
'రిలయన్స్ గ్యాస్ అందుబాటులోకి వస్తే మూడో పంటకు కూడా విద్యుత్ సరఫరా చేస్తాం. అప్పుడిక ప్రతి రైతు ఇంట రోజూ సంక్రాంతే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 135

శనివారం 5-8-2017

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆంధ్రాబ్యాంకు లాభం జూమ్
క్యూ1లో 29% పెరుగుదల. 6.21 నుంచి 8.09 శాతానికి ఎన్‌పీఏలు
-12లో



భారత్ జోరు...
అశ్విన్, సాహా, జడేజా అర్ధ సెంచరీలు. భారత్ 622/9 డిక్లేర్డ్
-స్పోర్ట్స్‌లో

రైతులు ఏకమవ్వాలి



పంటకు తామే ధర నిర్ణయించుకునే స్థాయికి ఎదగాలి: సీఎం కేసీఆర్

- వచ్చే ఏడాది నుంచే సాగుకు పెట్టుబడి సాయం
- రైతుల లెక్కల్లో తేడాలతో ఇబ్బందులు
- అందుకే పక్కాగా వివరాల నమోదు చేపట్టాం
- నిజమైన రైతులకు మాత్రమే ప్రభుత్వ సాయం
- గ్రామాల అభివృద్ధితోనే తెలంగాణ అభివృద్ధి
- అంతా ఏకమై సమస్యలను పరిష్కరించుకోవాలి
- ఇంటింటికీ ఆరు చొప్పున మొక్కలు నాటండి
- వాటికి కుటుంబ సభ్యుల పేర్లు పెట్టి పెంచండి
- కేశవరం, లక్ష్మాపూర్ గ్రామసభల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- కేశవరానికి రూ.12 కోట్లు, లక్ష్మాపూర్‌కు రూ.15 కోట్లు మంజూరు

మేడ్చల్: రాష్ట్రంలో రైతులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని.. తాము పండించిన పంటలకు తామే ధర నిర్ణయించుకునే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రైతుల సాగుకు తోడ్పడేందుకు ఏటా ఎకరానికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. భూమి ఉండి, సాగు చేసుకుంటున్న రైతుల లెక్క తేల్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇక గ్రామాల అభివృద్ధితోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందని, గ్రామస్తులంతా ఏకమై శ్రమదానం చేసి.. తమ గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.50 గంటలకు కేశవరం చేరుకున్న సీఎం కేసీఆర్.. గ్రామ శివార్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్నారు. గ్రామ సమస్యలపై అధికారులు, సర్పంచ్ ఇచ్చిన నివేదికను పరిశీలించి... ఆయా సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. తర్వాత దాదాపు గంట పాటు ప్రసంగించారు. అనంతరం లక్ష్మాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళుతున్న సమయంలో కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల వద్ద

మిగతా 2వ పేజీలో ▶

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక



సాయంత్రానికి ఫలితం

పోటీలో ఎన్డీఏ అభ్యర్థిగా వెంకయ్యనాయుడు, యూపీఏ అభ్యర్థిగా మహాత్మాగాంధీ మనవడు గోపాలకృష్ణ గాంధీ

- వివరాలు 5లో



భయపెడుతున్న వర్షాభావం..

- పత్యామ్నాయ చర్యలపై వ్యవసాయ శాఖ దృష్టి.. 7న జిల్లా అధికారులతో అత్యవసర సమావేశం

-3లో



ఉత్తీర్ణత శాతం	
పేపర్-1	పేపర్-2
57.37	19.51
గతేడాది ఉత్తీర్ణత శాతం	
పేపర్-1	పేపర్-2
54.45	25.04

టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత ఢమాల్!

పేపర్-1లో స్వల్పంగా పెరిగిన అర్హులు.. ఫలితాలు విడుదల

- విత్‌హెల్డ్‌లో 1,632 మంది ఫలితాలు
- పేపర్-1లో టాప్ సిరిసిల్ల జిల్లా.. పేపర్-2లో మంచిర్యాల టాప్
- 'విత్‌హెల్డ్' అభ్యర్థుల ఫలితాలనూ పరిశీలిస్తామని తెలిపిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్
- వారు తగిన కారణాలు చూపుతూ దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడి

సాక్షి, హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు వెల్లడయ్యాయి. పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ కిషన్ ఈ ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్-1లో గత టెట్ కంటే అర్హుల శాతం పెరగగా... పేపర్-2లో అర్హుల శాతం బాగా తగ్గిపోయింది. పేపర్-1లో గతేడాది 54.45 శాతం మంది అర్హత సాధించగా.. ఈసారి 57.37 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2లో గతేడాది 25.04 శాతం మంది ఉత్తీర్ణులవగా.. ఈసారి 19.51 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. పేపర్-1లో అత్యధికంగా 74.27 అర్హుల శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 48.40 శాతం మందితో రంగారెడ్డి జిల్లా చివరి స్థానంలో ఉంది. పేపర్-2లో 24.02 శాతం అర్హులతో మంచిర్యాల జిల్లా


మిగతా 2వ పేజీలో ▶



మరణ ధ్రువీకరణకూ ఆధార్

- దేశవ్యాప్తంగా మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వ్యక్తుల గుర్తింపులో మోసాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోంశాఖ పేర్కొంది.

-వివరాలు 5లో



ఇంతకీ మన పల్లెలెన్ని?

- మనదేశంలో గ్రామాలెన్ని? మనకు చాలాసార్లు ఇలాంటి సందేహం వస్తుంటుంది. దీనికి సమాధానం కోసం ప్రభుత్వ విభాగాలను అడిగితే స్పష్టమైన జవాబు మాత్రం రాదు. ఎందుకంటే దేశంలో ఎన్ని గ్రామాలున్నాయనే దానిపై ప్రభుత్వశాఖలకే స్పష్టత లేదు.

-వివరాలు 6లో


శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కేశవరంలో గ్రామ సభకు హాజరైన ప్రజలు...


మేడ్చల్ జిల్లా లక్ష్మాపూర్ గ్రామ సభకు హాజరైన మహిళలు...

రైతులు ఏకమవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

కాన్వాయ్ ఆపి స్థానికులతో మాట్లాడానని.. వారు పలు సమస్యలు చెప్పుకోవడంతో, ఆ సమస్యల పరిష్కారం కోసం స్వయంగా గ్రామసభలకు హాజరయ్యానని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలపై వరాల జల్లు కురిపించారు.

లెక్కల్లో తేడా ఉంటే 'సాయం'ఎలా?

రాష్ట్రంలో భూములు కలిగిన రైతుల సంఖ్య ఇటీవలి వ్యవసాయ శాఖ సర్వేలో ఒకలా తేలితే.. రెవెన్యూ లెక్కల ప్రకారం మరోలా ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి సాగు కోసం ఎకరాకు రూ.8 వేల చొప్పున సాయం అందించాలని భావించానని.. ఇలాంటి లెక్కల వల్ల ఎలా రైతులకు పెట్టుబడి డబ్బులు జమ చేయాలని పేర్కొన్నారు. త్వరలో రెవెన్యూ అధికారులు రైతుల వద్దకు వస్తారని.. పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టి రైతుల వివరాలు పక్కాగా నమోదు చేస్తారని తెలిపారు. ఇందుకోసం గ్రామాల్లోని రైతులు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. నిజమైన రైతుల వివరాలు రికార్డుల్లో నమోదు చేసేలా చూసి.. ప్రభుత్వ సాయం వారి ఖాతాల్లో జమయ్యేలా చూడాలని కోరారు. రైతులకు సాగు పెట్టుబడి కోసం ఏటా రూ.500 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఇలా రైతులకు సాగు పెట్టుబడి కోసం ప్రభుత్వమే డబ్బులిచ్చే విధానం దేశంలో ఎక్కడా లేదని.. రైతులు గర్వంగా బతకాలన్నదే తన సంకల్ప మని చెప్పారు.

మొక్కలు పెంచండి.. పాడి పశువులను పొందండి

గత ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యం వల్లే హరితవనంగా ఉండాల్సిన తెలంగాణ గ్రామాలు దుర్భిక్షమయంగా మారిపోయాయని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నివారించి, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ ఆరు చొప్పున మొక్కలు నాటాలని.. వాటికి ఇంట్లో వారి పేర్లు, కుటుంబంలో మరణించిన వారి పేర్లు పెట్టుకుని పెంచాలని కోరారు. తాను రెండేళ్ల తర్వాత వస్తే ఈ గ్రామాల్లో అన్ని చెట్లే కనబడాలన్నారు. జనవరిలో తాను పలు ఇళ్లను సందర్శించి, మొక్కలు నాటి బాగా సంరక్షించిన కుటుంబానికి ప్రభుత్వం తరపున రెండు పాడి పశువులను బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు.


శుక్రవారం మేడ్చల్ జిల్లా లక్ష్మాపూర్‌లో మొక్కను నాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు

రెండు గ్రామాలపై వరాల జల్లు

తెలంగాణ తొలిదశ పోరాటంలో స్ఫూర్తిదాయకంగా నిలిచిన గౌడవెల్లి వెంకట్రాంరెడ్డి, మూడుచింతలపల్లి వీరారెడ్డిలు పుట్టినగడ్డ మేడ్చల్ జిల్లా అని కేసీఆర్ పేర్కొన్నారు. అలాంటి అమరులు పుట్టినగడ్డను అభివృద్ధిపర్చాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి మేడ్చల్, నల్లగొండ జిల్లాలకు సాగు నీరు అందిస్తామని, రైతుల పొలాలను సిరుల మాగాణిగా మారుస్తామని చెప్పారు. ఇక కేశవరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మినీ ఫంక్షన్‌హాల్, డంపింగ్ యార్డు, విద్యుత్ సమస్య, స్మృతివనం, వైకుంఠ ధామం, అంగన్‌వాడీ భవనం ఏర్పాటు వంటి పలు సమస్యల పరిష్కారానికి రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. లక్ష్మాపూర్ గ్రామంలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం రూ.13 కోట్ల 48 లక్షలు ఇవ్వాలని గ్రామస్తులు కోరగా.. రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం వీటికి సంబంధించిన జీవోలు జారీ చేస్తామన్నారు. ఆరు నెలల్లో ఈ పనులన్నీ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. రెండు గ్రామాలలో ఒక రోజు పవర్‌డేగా ప్రకటించుకుని.. ఆ రోజు విద్యుత్ సమస్యలన్నీ తీర్చుకోవాలని సూచించారు. గ్రామస్తులంతా ఏకమై శ్రమదానం చేసి గ్రామ అభివృద్ధికి పాటు పడాలని.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పనులను పర్యవేక్షించాలని కోరారు.

ఆగస్టు 8న మళ్లీ వస్తా..

తాను మళ్లీ ఈ నెల 8వ తేదీన వస్తానని.. ఈ రెండు గ్రామాల్లో ఏదో ఒక గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తానని కేసీఆర్ చెప్పారు. ఆ రోజు మూడుచింతలపల్లిలో గ్రామసభలో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత ధమాల్!


శుక్రవారం హైదరాబాద్‌లో టెట్ ఫలితాలు విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న పాఠశాల విద్యా కమిషనర్ కిషన్

▶ మొదటి పేజీ తరువాయి

తొలిస్థానం పొందగా.. 16.80 శాతంతో సిద్ది పేట జిల్లా చివరి స్థానంలో ఉంది. ఇక పేపర్-1, పేపర్-2లలో 150 గరిష్ట మార్కులకు గాను పలువురు అభ్యర్థులు అత్యధికంగా 136 వరకు కూడా సాధించినట్లు తెలిసింది.

వెయిటేజీ నేపథ్యంలో..

ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో టెట్ స్కోర్‌కు 20% వెయిటేజీ ఉండటంతో.. మార్కులు పెంచుకునేందుకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 150 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షల్లో జనరల్ అభ్యర్థులు కనీసంగా 60% మార్కులు, బీసీలు 50% మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు 40% మార్కులు సాధిస్తేనే అర్హత సాధించినట్లుగా పరిగణనలోకి తీసుకుంటారు. అయితే వరుసగా టెట్‌లలో పేపర్-1లో అర్హుల సంఖ్య దాదాపుగా పెరుగుతుండగా.. పేపర్-2లో మాత్రం తగ్గిపోతూ వస్తోంది. ఈసారి అత్యంత తక్కువగా కేవలం 19.51% ఉత్తీర్ణత మాత్రమే నమోదైంది. పరీక్షలో ఇంటర్మీడియట్ స్థాయి సిలబస్‌తో కూడిన ప్రశ్నలు ఇవ్వడంతో అర్హత శాతం తగ్గినట్లు చెబుతున్నారు.

పేపర్-1లో పెరిగిన ఉత్తీర్ణత

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) అభ్యర్థులకు సంబంధించిన పేపర్-1 పరీక్షకు 1,11,647 మంది దరఖాస్తు చేసుకోగా.. 98,848 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 56,708 మంది (57.37 శాతం) అర్హత సాధించారు.

పేపర్-2లో తగ్గిన అర్హులు

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్), పండిట్ కోర్సులు చేసిన అభ్యర్థులకు నిర్వహించిన పేపర్-2కు 2,56,265 మంది దరఖాస్తు చేసుకోగా... 2,30,932 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 45,055 మంది (19.51శాతం) మాత్రమే అర్హత సాధించారు. ఇందులో గణితం-సైన్స్ విభాగంలో 1,11,018 మంది పరీక్ష రాయగా.. 20,323 మంది (18.31 శాతం) అర్హత సాధించారు. సాంఘిక శాస్త్రం విభాగంలో 1,19,914 మంది పరీక్ష రాయగా.. 24,732 మంది (20.62 శాతం) అర్హత సాధించారు.

ఇప్పటివరకు జరిగిన టెట్‌లకు హాజరైనవారు, అర్హులు...

పేపర్	హాజరు	అర్హులు	అర్హుల(%)
మొదటి ఏపీ టెట్ (1-7-2011)			
1	3,05196	1,35,105	44.27
2	3,34,659	1,66,262	49.68
రెండో ఏపీ టెట్ (8-1-2012)			
1	55,194	24,578	44.53
2	4,12,466	1,93,921	47.02
మూడో ఏపీ టెట్ (1-6-2012)			
1	58,123	26,382	45.39
2	4,18,479	1,94,849	46.56
నాలుగో ఏపీ టెట్ (16-3-2014)			
1	65,770	40,688	61.86
2	4,04,385	1,15,510	28.56
మొదటి తెలంగాణ టెట్ (22-5-2016)			
1	88,661	48,278	54.45
2	2,51,906	63,079	25.04
రెండో తెలంగాణ టెట్ (23-5-2017)			
1	98,848	56,708	57.37
2	2,30,932	45,045	19.51

విత్ హెల్డ్‌పై పరిశీలనకు కమిటీ

టెట్ ఓఎంఆర్ జవాబు పత్రంలో అభ్యర్థి వివరాలను పొందుపర్చకపోవడం, తప్పుడు వివరాలు ఇవ్వడం, డబుల్ బబ్లింగ్ చేయడం వంటి తప్పిదాలకు పాల్పడిన 1,632 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టినట్లు పాఠశాల విద్యా కమిషనర్ కిషన్ వెల్లడించారు. అవి ఎవరికి సంబంధించిన జవాబు పత్రాలన్నది గుర్తించడం కష్టమని.. అయితే ఏదైనా ప్రత్యేక కారణంతో అభ్యర్థులెవరైనా దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ప్రొఫెసర్ పీఎం భార్గవకు కన్నీటి వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవకు పలువురు ప్రముఖులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. హైదరా బాద్ రాయదుర్గంలో ఉన్న వైకుంఠ మహాప్రస్థానంలోని దివ్యస్థల్ విద్యుత్ దహనవాటికలో భార్గవ అంత్యక్రియ లను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ప్రజల సందర్శనార్థం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉప్పల్ ప్రశాంత్‌నగర్ లోని మనోరమ స్వగృహంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. భార్గవ మృతి పట్ల సీఎం కె.చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో సీసీఎంబీ ఏర్పాటు చేయడంతో పాటు, కణజీవ శాస్త్రంలో భార్గవ చేసిన కృషి అపారమని సీఎం కొనియాడారు. ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల తరపున పుష్పగుచ్ఛం ఉంచి భార్గవకు ఘనమైన వీడ్కోలు పలకాలని శుక్రవారం ఉదయం సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు సీఎస్ ఎస్పీ సింగ్ హాజరై భార్గవకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాయంత్రం మహా ప్రస్థానంలో ఆయన కుమారుడు మోహిత్ అంత్యక్రియలను పూర్తి చేశారు. మహాప్రస్థానం ప్రాంగణమంతా జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు, ఇతరుల నినాదాలతో మార్మోగింది. ప్రొఫెసర్ భార్గవ కూతురు వనితా భట్టా చార్య, సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్లు లాల్‌జిసింగ్, బాల సుబ్రమణ్యన్, మాభూమి చిత్ర దర్శకుడు బి.నర్సింగ్‌రావు, సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ, సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం, మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్, జేవీవీ నాయకుడు రమేశ్, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, విద్యావేత్త చుక్కా రామయ్య, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్, జీఏడీ ప్రోటోకాల్ అధికారి అరవింద్ సింగ్, హైదరాబాద్ ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రశాంతి, సికింద్రాబాద్ ఆర్‌డీఓ చంద్రకళ, షేక్‌పేట్ తహసీల్దార్ రాములు, శాంతాబయోటెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, హైదరాబాద్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు వేదకుమార్, కల్పనా కన్నాభిరాన్, ప్రొఫెసర్ రమా మెల్కోటే, సీసీ ఎంబీ మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, లాల్జీటండన్, ఇతర ముఖ్యులు చందనాచక్రవర్తి, అలేఖ్య, పాశం యాదగిరి, నిమ్స్ మాజీ డైరెక్టర్ కాకర్ల సుబ్బారావు, డాక్టర్ వినయ్ కుమార్, ఎన్ఐసీటీ, ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, హెచ్‌సీయూ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు భార్గవ పార్థివదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భార్గవతో తమ సాన్నిహిత్యాన్ని వారు గుర్తు చేసుకున్నారు.


భార్గవ పార్థివ దేహం వద్ద గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

నేడు ఐటీ కార్యాలయాలు పనిచేస్తాయి

ఆదాయ పన్ను శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆదాయ పన్ను దాఖలుకు చివరి తేదీ కావడంతో శనివారం సైతం ఐటీ కార్యాలయాలు పని చేయనున్నాయి. 2016-17 ఆదాయపన్ను వివరాలు, 2017-18 అడ్వాన్సు సమర్పణకు ఆగస్టు 5 చివరి తేదీగా కేంద్రం నిర్ణయించింది. ఐటీ దాఖలు వివరాల సమర్పణలో పన్నుదారులకు కలిగే ఇబ్బందులను పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఆదేశాల మేరకు శనివారం రాత్రి వరకు ఐటీ కార్యాలయాలు పని చేస్తాయని ఆదాయ పన్ను శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రానికి మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్

ముందుకొచ్చిన గుజరాత్ కంపెనీ


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణం కానుంది. గుజరాత్‌కు చెందిన రిద్ధి సిద్ధి కంపెనీ మొక్కజొన్న ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆ కంపెనీ యజమాని రూ. 200 కోట్లతో రోజుకు 800 టన్నుల సామర్థ్యంతో సంగారెడ్డి పరిసరాలలో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కంపెనీల ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని కంపెనీ ప్రతినిధులతో మంత్రి పోచారం తెలిపారు. 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉందని, రైతులకు ప్రయోజనం కలిగించే ఏ ప్రాజెక్టుకయినా ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, రిద్ధి సిద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ చౌదరి పాల్గొన్నారు.

2 ఎలక్ట్రానిక్ క్లస్టర్లకు కేంద్రం ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ప్రతిపాదిత ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అదనపు కార్యదర్శి అజయ్‌కుమార్ చేసిన ట్వీట్‌కు తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్ఐఐసీ నేతృత్వంలో 310 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న క్లస్టర్‌కు రూ. 437 కోట్లు వ్యయం కానుండగా, 600 ఎకరాల్లో రూ. 667 కోట్ల వ్యయం కానుంది. ఈ రెండు ఎలక్ట్రానిక్ క్లస్టర్లకు జూలై 31న కేంద్రం ఆమోదం తెలిపింది.

న్యాయాధికారులకు రోజువారీ లక్ష్యం

పరిష్కరించిన కేసుల వివరాలు పంపాలని హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఐదేళ్ల కింద దాఖలైన సివిల్, క్రిమినల్ కేసులన్నింటినీ 2018 మార్చి 31 నాటికి పరిష్కరించాలని కింది కోర్టులకు హైకోర్టు లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో భాగంగా ప్రతి న్యాయాధికారి రోజూ తాను పరిష్కరించిన కేసుల వివరాలకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను హైకోర్టుకు పంపాలని ఆదేశించింది. రోజూ సాయంత్రం 6 గంటలకల్లా ఆ స్టేట్‌మెంట్ హైకోర్టుకు అందించాలి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) ఆదేశాలకు అనుగుణంగా రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వెంకటేశ్వర్‌రెడ్డి ఈ మేరకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 7 నుంచి ఈ సర్క్యులర్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. కేసుల వివరాలు పంపకపోతే హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు.

పాపిరెడ్డి కొనసాగింపు

మూడేళ్ల పాటు కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా తుమ్మల పాపిరెడ్డి పదవీ కాలాన్ని మూడేళ్ల పాటు పొడిగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారని పేర్కొంటూ విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య జీవో నంబర్ 17న జారీ చేశారు. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న ఆయన పదవీ కాలం శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అదేరోజు ఆయనను మరోదఫా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పన్ను ఎగవేతదారుల్లో తెలుగువారే ఎక్కువ

సాక్షి, న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ) ప్రచురించిన 96 మంది పన్ను ఎగవేతదారుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 30మంది ఉన్నారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. సంబంధిత వివరాలను ఆదాయ పన్ను శాఖ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని తెలిపారు.

ఈనెల 12, 13 నాటి పరీక్షలు వాయిదా

27, 28 తేదీల్లో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ పోస్టుల భర్తీకి ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షలు కూడా అదే తేదీల్లో ఉండటంతో వాయిదా వేసినట్లు పేర్కొంది. పరీక్షలను ఈనెల 27, 28 తేదీల్లో తిరిగి నిర్వహిస్తామని వివరించింది.

237 బీడీఎస్ సీట్లు ఖాళీ

ముగిసిన బీ కేటగిరీ మెడికల్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రైవేటు మైనారిటీ కాలేజీల్లోని బీ కేటగిరీ ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ కోసం మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. రెండు రోజుల కౌన్సెలింగ్ అనంతరం ఎంబీబీఎస్‌లో 181 ఎంబీబీఎస్, 237 బీడీఎస్ సీట్లు మిగిలాయి. రాష్ట్రంలోని 15 ప్రైవేటు వైద్య కాలేజీల్లో 731 బీ కేటగిరీ సీట్లు, 319 సీ కేటగిరీ సీట్లు ఉన్నాయి. 11 దంత వైద్య కాలేజీల్లో 384 బీ కేటగిరీ సీట్లు, 165 సీ కేటగిరీ సీట్లు మిగిలాయి. అన్ని ప్రైవేటు కాలేజీల్లోని సీ కేటగిరీ ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఇదం జగత్


పోయానని ఇలా ఆధారం చూపిస్తే కుదరదు.. ఆధార్ తెస్తేనే డెత్ సర్టిఫికేట్!!

భయపెడుతున్న వర్షాభావం..

ప్రత్యామ్నాయ చర్యలపై వ్యవసాయ శాఖ దృష్టి

- 7న జిల్లా అధికారులతో అత్యవసర సమావేశం
- జిల్లాలవారీగా కంటింజెంట్ ప్రణాళిక ఖరారు చేసే అవకాశం
- ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో మేధోమథనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై వ్యవసాయ శాఖ ఆందోళన చెందుతోంది. నెల రోజులుగా లోటు వర్షపాతం నమోదు కావడంతో పంటలు వాడిపోతున్న పరిస్థితి నెలకొందని అంచనా వేసింది. ఇదే పరిస్థితి మరో వారం పది రోజులుంటే పంటల దిగుబడి పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ నెలాఖరు వరకు కూడా వర్షాలు రాకపోతే ఖరీఫ్ పంటలు చేతి కందడం కష్టమేనని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పంటల పరిస్థితిని అంచనా వేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు జిల్లా వ్యవసాయాధికారులతో అత్యవసర సమావేశానికి వ్యవసాయ శాఖ ఆదేశించింది. ఈ నెల 7న అన్ని జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి 'సాక్షి'కి తెలిపారు. పంటల పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని, వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలతో మేధోమథనం చేస్తున్నట్లు తెలిపారు.

ఇదీ పంటల పరిస్థితి..

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారమే జూన్‌లో 47 శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఖరీఫ్ పంటలు భారీగా సాగయ్యాయి. కానీ జూలై నాటికి పరిస్థితి అడ్డం తిరిగింది. గత నెలలో ఏకంగా 40 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆ నెలలో 242.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 146.2 మిల్లీమీటర్లే నమోదైంది. రాష్ట్రంలోని 9 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం రికార్డయింది. మండలాలవారీగా చూస్తే 195 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వర్షపాతం లోటుతో మొలక దశలోని పంటలకు అవసరమైన నీరు అందలేదు. వర్షాధార పంటలపైనా తీవ్ర ప్రభావం పడింది. ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో



మినహా మిగిలిన జిల్లాల్లో పంటలు వాడిపోయే దశలో ఉన్నాయని వ్యవసాయ శాఖ వెల్లడించింది. పత్తి, సోయాబీన్ పంటలు ప్రధానంగా నష్టపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. దాదాపు 20 లక్షల ఎకరాల్లో పత్తి వాడిపోతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు జలాశయాలు, చెరువులు, కుంటలు నిండకపోవడంతో వరి నాట్లు పుంజు కోవడంలేదు. 23.35 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంటే, 37 శాతం విస్తీర్ణంలోనే నాట్లు పడ్డాయి.

ప్రత్యామ్నాయ ప్రణాళికకు సన్నాహాలు..

ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై దృష్టి సారించింది. కరువు పరిస్థితులుంటే మూడు విడతలుగా ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేస్తారు. జూలై 15 వరకు వర్షాలు రాకుంటే మొదటి విడత ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేయాలి. 31 నాటికి వర్షాలు రాకుంటే రెండో విడత, ఆగస్టు 15 నాటికి వర్షాలు రాకుంటే మూడో విడత ప్రణాళిక అమలు చేయాలి. జూన్‌లో విస్తృతంగా వర్షాలు కురిశాయి. వర్షాధార పంటలు వేశారు. కానీ వేసిన పంటలు వాడిపోయాయి. దీంతో ప్రస్తుత పంటల పరిస్థితిని అంచనా వేసి ప్రత్యామ్నాయం కోసం ప్రత్యేక ప్రణాళిక రచిస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఉద్యాన విద్యార్థుల సమ్మె విరమణ

సాక్షి, హైదరాబాద్: ఉద్యానాధికారుల పోస్టులను మంజూరు చేయాలంటూ నెల రోజులుగా కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సమ్మె చేస్తున్న విద్యార్థులు శుక్రవారం విరమించినట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి, వర్సిటీ వీసీ సి.పార్థసారథి వెల్లడించారు. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం కూడా సానుకూలంగా ఉన్నారని తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టుల పాత పనులకు వ్యాటే!

- జీఎస్టీ నుంచి మినహాయించిన వాణిజ్య పన్నుల శాఖ
- జూలై నుంచి జరిగిన కొత్త పనులకే 18 శాతం జీఎస్టీ

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులపై జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొంత మేరకు మినహాయించింది. జూలై ఒకటో తేదీకి ముందు జరిగిన పనులు, వాటికి చెల్లించాల్సిన బిల్లులన్నింటికీ పాత వ్యాట్ అమలు చేయాలని నిర్ణయించింది. ఆ తర్వాత చేపట్టిన కొత్త పనులకు మాత్రమే జీఎస్టీ వర్తింపజేసేలా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. నీటిపారుదల శాఖ చేసిన సిఫార్సుల మేరకు వాణిజ్య పన్నుల శాఖ ఈ వెసులుబాటును ఇచ్చింది. దీంతో సాగునీటి కాంట్రాక్టర్లకు భారీగానే లాభం చేకూరనుంది. సాగు నీటి ప్రాజెక్టుల పరిధిలో ఉపయోగించే సిమెంటు, ఇనుము, భారీ పైపులు, యంత్ర సామగ్రిపై గతంలో 5 శాతం వరకు వ్యాట్ ఉండేది. ఈ భారాన్ని ప్రభుత్వమే భరించేది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్ పన్నులన్నీ విలీనమై అవన్నీ 18 శాతం శ్లాబులోకి వచ్చి చేరాయి. నిర్మాణ రంగంలో వినియోగించే సామగ్రిపై జీఎస్టీ విధించడంతో ప్రాజెక్టుల అంచనా వ్యయం కూడా పెరిగిపోనుంది. గతంలో ఉన్న వ్యాట్‌తో పోలిస్తే 13 శాతం అదనంగా పన్ను భారం పడటంతో కాంట్రాక్టర్లలో ఆందోళన వ్యక్తమైంది. జీఎస్టీని తక్కువ శ్లాబ్‌కు సడలించాలని, పెరిగిన మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని ఇటీవల కాంట్రాక్టు ఏజెన్సీలు అధికారులకు విజ్ఞప్తి చేశాయి. అయితే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో సామగ్రికి చెల్లించిన పన్ను నిర్మాణ సంస్థకు చేరుతుంది. దీంతో జీఎస్టీ 18 శాతం ప్రభుత్వం చెల్లించినా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద వచ్చే మొత్తాన్ని కాంట్రాక్టు కంపెనీలు తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పన్ను మొత్తాన్ని ప్రభుత్వమే తమకు చెల్లించాలని, తమకు వచ్చే ఇన్‌పుట్ ట్యాక్స్ మినహాయించుకొని మిగిలిన సొమ్మును ఖజానాకు జమ చేస్తామని కంపెనీలు చెబుతున్నాయి. దీనిపై ఇటీవల సమీక్షించిన నీటి పారుదల శాఖ జూలై ఒకటికి ముందు ఒప్పందాలు జరిగిన ప్రాజెక్టు పనులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించాలని వాణిజ్య పన్నుల శాఖను కోరింది. ఈ సిఫారసులను పరిశీలించిన వాణిజ్య పన్నుల శాఖ ఒప్పందాలతో సంబంధం లేకుండా జూలై ఒకటి వరకు జరిగిన పనులు, చెల్లించాల్సిన బిల్లులన్నింటికీ గతంలో ఉన్న వ్యాట్ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల పరిధిలో దాదాపు ఆరు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రస్తుత వెసులుబాటు ఈ బిల్లులన్నీ చెల్లించేంత వరకు కొనసాగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయం కాంట్రాక్టు ఏజెన్సీలకు కలిసొచ్చే అంశమేననే అభిప్రాయాలున్నాయి.

జీఎస్టీ కౌన్సిల్‌లో మరోసారి చర్చకు

మరోవైపు సాగు నీటి ప్రాజెక్టులకు జీఎస్టీ మినహాయించాలని శనివారం ఢిల్లీలో జరిగే జీఎస్టీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనను వినిపించనుంది. ఈ అంశం చర్చకు రానుందని, కేంద్రం సైతం వర్క్స్ అండ్ కాంట్రాక్టు పనులకు 18% నుంచి 12 శాతానికి శ్లాబ్ తగ్గించే అవకాశాలు లేకపోలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. సమావేశానికి రాష్ట్రం నుంచి మంత్రి కేటీఆర్ హాజరవుతారు.

సాక్షి
శనివారం, ఆగస్టు, 5

చట్టసభలు-జీతభత్యాలు

'మనదో చిత్రమైన ప్రజాస్వామ్యం. ఇక్కడ న్యాయమూర్తులే న్యాయమూర్తులను నియమించుకుంటారు. ఎంపీలు వాళ్ల జీతాల్ని వాళ్లే పెంచుకుంటారు'– పన్నెండేళ్ల క్రితం అప్పటి లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ చేసిన వ్యాఖ్య ఇది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఎంపీల జీతభత్యాలపై విమర్శనాత్మక వ్యాఖ్య పార్లమెంటులో వినబడింది. బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ జీరో అవర్‌లో దీన్ని లేవనెత్తుతూ కనీసం ఈ లోక్‌సభ కాలపరిమితి వరకూ మనం దాని జోలికి పోవద్దని కోరారు. అయితే ఆయనకు ఎవరినుంచీ పెద్దగా మద్దతు లభించలేదు. రాజ్యాంగంలోని 106, 195 అధికరణాలు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ జీతభత్యాలను తామే పెంచుకునే అధికారాన్నిస్తున్నాయి. న్యాయమూర్తుల నియామకాల కోసం ఉన్న కొలీజియం వ్యవస్థకు బదులు న్యాయ నియామకాల కమిషన్ ఏర్పాటుకు పార్లమెంటు ఒక చట్టం చేయడం, దాన్ని సుప్రీంకోర్టు కొట్టేయడం చరిత్ర. చట్టసభల సభ్యుల జీతభత్యాలకు సంబంధించి అలాంటి ప్రయత్నమేదీ జరగలేదు. అయితే సోమనాథ్ ఛటర్జీ కేవలం వ్యాఖ్యానించి ఊరుకోలేదు. ఈ అంశంపై ఒక అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో దాదాపు అన్ని పార్టీల నేతలూ ఈ విధానం సరైంది కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జీతభత్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అది అక్కడే ఆగిపోయింది. ఈ విషయంలో రాజ్యాంగ సవరణ బిల్లుగానీ, జీతభత్యాల కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లుగానీ రూపొందించే ప్రయత్నమే జరగలేదు. ఈలోగా మూడు, నాలుగు దఫాలు ఎంపీల జీతభత్యాలు మాత్రం పెరిగాయి. ఎంపీల జీతభత్యాలపై ఉభయ సభల సభ్యులతో ఒక కమిటీ ఉంటుంది. ప్రస్తుత యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని కమిటీ నిరుడు ఎంపీల జీతభత్యాలు సవరిస్తూ సిఫార్సు చేసింది.

అంతా పారదర్శకంగా, హేతుబద్ధంగా సాగుతుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. దాన్ని ప్రశ్నించేవారు కూడా ఉండరు. అలా లేనప్పుడే సమస్య అవుతుంది. ఏ ప్రమాణాల ఆధారంగా జీతభత్యాల పెంపు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. వరుణ్‌గాంధీ బ్రిటన్ ఎంపీలతో తెచ్చిన పోలిక ఆలోచించదగ్గది. అక్కడి ఎంపీల జీతభత్యాలు గత పదేళ్లలో 13 శాతం పెరిగితే, మన ఎంపీలకు 400 శాతం పెరిగాయని ఆయన వివరించారు. బ్రిటన్ ఎంపీల జీతాల అంశాన్ని పరిశీలించేందుకు ఒక స్వతంత్ర సంస్థ ఉంది. ఆస్ట్రేలియాలో సైతం ఇలాంటి ఏర్పాటే చేసుకున్నారు. ఈ కారణం వల్లనే కావొచ్చు... ఆ దేశాల ఎంపీల జీతభత్యాల పెరుగుదల మరీ అతిగా లేదు. మన దేశంలో చిత్రమైన పరిస్థితి. సాగు ఖర్చు అపరిమితంగా పెరిగి, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఏం చేయాలో దిక్కుతోచక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇంతవరకూ దేశవ్యాప్తంగా 1,600మంది రైతులకు పైగా బలవన్మరణాల పాలయ్యారు. కేంద్రంలో పాలకులెవరున్నా రైతుల వ్యథ తీరడం లేదు. కానీ చట్టసభల సభ్యులకు మాత్రమే కాదు... కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఉద్యోగుల జీతభత్యాలు కూడా ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. 1970లో గోధుమ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 76గా ఉంటే ఇప్పుడది రూ. 1,625 అయింది. అంటే ఈ 47 ఏళ్లలోనూ 21 రెట్లు పెరిగింది. మిగిలిన పంటల మద్దతు ధరలు కూడా అంతంత మాత్రమే. ఇదే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బంది జీతాలు దాదాపు 150 శాతం పెరిగాయి. ఇలాంటి వ్యత్యాసాలు బాహాటంగా కనిపిస్తున్నప్పుడు కనీసం తమవరకైనా సంయమనం పాటించాలన్న స్పృహ చట్టసభల సభ్యులకు ఉండాలి. 2001లో రూ. 12,000గా ఉన్న ఎంపీ జీతం నిరుడు పెంచిన తర్వాత రూ. 1,00,000 అయింది. తమ పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని, రుణమాఫీ వర్తింపజేయాలని తమిళనాడు రైతులు గత కొన్ని నెలల నుంచి సాగిస్తున్న ఆందోళన ఇంకా విరమించలేదు. వారి సమస్య మాటేమోగానీ తమిళనాడు అసెంబ్లీ గత వారం ఎమ్మెల్యేల జీతాలను రూ. 55,000 నుంచి ఒక్కసారిగా రూ. 1,05,000కు పెంచుతూ తీర్మానించింది. రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా చోటుచేసుకునే మహారాష్ట్రలో నిరుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు రూ. 75,000 నుంచి ఒకేసారి రూ. 1,70,000కు పెరిగాయి. చిత్రమేమంటే ఇలా పెంచినప్పుడు చట్టసభల్లో కనీసం ఒక్క నిరసన స్వరమైనా వినబడటం లేదు. ఆమధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్న ప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి కొన్ని మినహా చాలా దేశాల్లో ఎంపీల జీతభత్యాల పెంపును అక్కడి చట్టసభల్లోనే నిర్ణయిస్తారు. అమెరికాలో వివిధ రాష్ట్రాలు వివిధ రకాల విధానాలను అనుసరిస్తున్నాయి. దాదాపు 19 రాష్ట్రాలు ఎంపీల జీతభత్యాలపై కమిషన్‌లు ఏర్పాటు చేయగా కొన్నిచోట్ల చట్టసభలే ఆ నిర్ణయం తీసుకుంటాయి. మరికొన్ని రాష్ట్రాలు కమిషన్ నిర్ణయాలను సభలో చర్చించి వాటిని సవరించుకునే స్వేచ్ఛను దఖలు పరచుకున్నాయి. మన రాజ్యాంగ నిర్మాతలు అప్పట్లో వివిధ దేశాల రాజ్యాంగాలనూ, అక్కడి పాలనా సంప్రదాయాలనూ అధ్యయనం చేశారు. ఆ సమయంలో చాలాచోట్ల చట్టసభల నిర్ణయమే అంతిమంగా ఉండేది కనుక ఆ ఒరవడినే బహుశా ఇక్కడా కొనసాగించి ఉండొచ్చు. అయితే వరుణ్‌గాంధీ చెప్పినట్టు ఎంపీల జీతభత్యాలు దశాబ్దకాలంలో 400 శాతం పెరగడం ఆరోగ్యకర ధోరణిని ప్రతిబింబించదు. కనీసం ఇలా పెంచినప్పుడు చర్చ జరగడం, ఆ నిర్ణయంపై అన్ని పార్టీల సభ్యులు మాట్లాడటమనే సంప్రదాయం ఉంటే అందులోని మంచిచెడ్డలు ప్రజలందరికీ అర్థమవుతాయి. అలాకాక అన్ని పార్టీలూ మౌనంగా ఉండిపోవడం ద్వారా ఆమోదముద్ర వేస్తుంటే ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? ప్రతి అంశంపైనా చట్టసభల్లో చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకర లక్షణం. అది ఎటూ లేదు. కనీసం తమ జీతాల విషయంలోనైనా దాన్ని పాటించడం అత్యవసరమని ప్రజాప్రతినిధులు గుర్తించాలి.




స్వప్రయోజనాలు, ప్రజల పట్ల బాధ్యత అనేవి ఎదురెదురుగా నిలిచినప్పుడు దేనికి ప్రాధాన్యత ఇవ్వాలనేదే నేతల గొప్పతనానికి గీటురాయి.

– విన్‌స్టన్ చర్చిల్
బ్రిటన్ పూర్వ ప్రధాని

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.త్రయోదశి రా.8.15 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం పూర్వాషాఢ రా.12.06 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం ఉ.8.14 నుంచి 10.01 వరకు, దుర్ముహూర్తం ఉ.5.43 నుంచి 7.25 వరకు, అమృతఘడియలు సా.6.49 నుంచి 7.44 వరకు.

సూర్యోదయం	: 5.42	10.30 వరకు	
సూర్యాస్తమయం	: 6.30	యమగండం:	
రాహుకాలం:		ప.1.30 నుంచి	
ఉ.9.00 నుంచి		3.00 వరకు	



నమాజ్ వేళలు

ఫజర్	: 4.39	మగ్రీబ్	: 6.47
జొహర్	: 12.22	ఇషా	: 8.05
అసర్	: 4.50		

యుద్ధోన్మాదుల శాంతి జపం



శేఖర్ గుప్తా

చైనా మనతో నిజమైన యుద్ధాన్ని కోరుకోవడం లేదు. ఇది 1962 కాదు కాబట్టి అది దానికి చాలా ఇబ్బందికరం అవుతుంది. అది నిజానికి మనతో బలవంతపు దౌత్యాన్ని సాగిస్తోంది. దాడికి, రెచ్చగొట్టడానికి అది తన సొంత మీడియానే సాధనంగా వాడుతోంది. ఆగ్రహావేశపూరితమైన మన చానళ్లు చైనాపై స్టూడియో యుద్ధాన్ని ప్రారంభించాలని నా వాదన కాదు. వాస్తవానికి వారలా చేయకపోవడం వల్ల అంతా మంచే జరుగుతోంది. కాబట్టే పాకిస్తాన్ విషయంలో వలే ప్రజాభిప్రాయం ఇంకా అదుపు తప్పిపోలేదు.

డోక్లామ్ వివాదంపై భారత మీడియా ఆచితూచి స్పందిస్తుండటం వల్ల అంతా మంచే జరుగుతుంది. కాకపోతే అది అలవాటులో పొరపాటు కాకుండా ఉండాలి.

ముందుగా కాస్త దారితప్పి ఓ విషయాన్ని చెప్పనివ్వండి, ఎందుకైనా మంచిది దానితో పాటే క్షమాభిక్ష లేదా ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోనివ్వండి. నాకూ, నా కుటుంబానికి బతికున్న మరే జీవులకంటే పిల్లులు, కుక్కలంటేనే ఎక్కువ ప్రేమ. కాబట్టి అద్భుతమైన ఆ కుటుంబ సభ్యుల నుంచి మేం ఎన్నో జీవిత పాఠాలను నేర్చుకున్నాం. క్రికెట్ క్రీడ లాగే అవి కూడా నా రాజకీయ రచనలలోకి తొంగి చూస్తుంటాయి. డోక్లాం వివాదం మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మొట్టమొదటి నిజమైన వ్యూహాత్మక సంక్షోభం. ఇంత సుదీర్ఘమైన ఉపోద్ఘాతమంతా, సిక్కిం సరిహద్దుల్లోని ఆ పరిస్థితి పట్ల నా సొంత వృత్తియైన వార్తా మీడియా వైఖరిని మా మొదటి మూడు కుక్కల తీరుతో పోల్చి చూపి... ఒక ముఖ్య విషయాన్ని చెప్పడానికే.

ఎనభైల మొదట్లో, మేం షిల్లాంగ్‌లో ఉండగా మా మూడు లాసా కుక్కలు మూడూ మిగతా ప్రపంచంతో సంబంధం లేనట్టుగా మా చిన్న తోటలో దర్పం ఒలకబోస్తూ బద్ధకంగా తిరుగుతుండేవి. ఎవరైనా మనిషి లేదా జంతువు ఆ దారంట పోతుంటే మహోగ్రంగా దాడికి దిగుతున్నట్టు నటిస్తూ మొరుగుతుండేవి. ఒక రోజున మా పొరుగున ఉండే ఆదివాసీ కుటుంబం వారి కోళ్లను ఆరు బయటకు వదిలింది. ఉండీ లేనట్టుండే మా గొలుసు కంచె దగ్గరకు సహజమైన రంగురంగుల దుస్తులను ధరించిన రెండు కోడిపుంజులు వచ్చాయి. విడ్డూరాల్లోకెల్లా విడ్డూరమనిపించేలా మా కుక్కలు అలవాటుగా ఆగ్రహంతో మొరగడానికి బదులు... ఆ పుంజుల పట్ల పూర్తి ఉదాసీనతను చూపాయి. వేరే వైపుకు చూడ్డం మొదలెట్టి, దారిన పొయ్యేవారిని చూసి మొరగడం ప్రారంభించాయి. అవి అంతకు ముందెన్నడూ అలాంటి ''ముప్పు'' ఎదుర్కోలేదు మరి. ఎందుకైనా మంచిదని జంకాయి. అది చూసిన మేం వాటిని ఎంతగా బుజ్జగించినా, రెచ్చగొట్టినా అవి మాత్రం ఆ కోడి పుంజులు లేనే లేవన్నట్టుగా వాటిని పట్టించుకోలేదు. చెడిపోయిన ఆ ఇంటి కుక్కలు చిన్నవే అయినా, వాటికి మనుగడను కాపాడుకోవాలనే స్పృహ మాత్రం బాగా ఉంది.

చైనా అంటే భయమా?

ఆ పాత కథ ఇప్పుడు ఎందుకో ముందే చెప్పాను. అయినా తెలియదనేట్టయితే లేదా తెలియనట్టు నటించేట్టయితే... మీరు భయం గొలిపే మన అతి దేశభక్తియుత కమాండో చానళ్లను గుర్తుకు తెచ్చుకోండి. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటలపాటూ అవి మన దేశానికి నిజమైన లేదా ఊహాత్మకమైన విదేశీ లేదా దేశీయ శత్రువులనందరినీ చీల్చి చెండాడటాన్నీ, ఆగ్రహంతో రంకెలువేస్తూ, ఊహకు అందే ప్రతి కాల్పనికమైన ముప్పు మీదకూ మళ్లడాన్ని గుర్తుచేసుకోండి. డోక్లామ్‌లో చైనా చొరబాటు, కంచెకు అవతలి ఆ కోడిపుంజుల లాంటిదేనని అనుకుని ఆలోచించండి. మన యోధులు వారిని పట్టించుకోలేదనేది స్పష్టమే. కాకపోతే, తెలియని శత్రువు పట్ల భయంతో అవి అలా చేయలేదనేదే ఉన్న తేడా. దురాక్రమణ చేయగల శత్రువు ముంగిట ఉంటే అవి బెంబేలెత్తి పోయాయని అనడం పూర్తి అమర్యాదకరం. వాటికి అలా సూచించారు కాబట్టే అవి అలా ప్రవర్తిస్తున్నాయి.

దీనిని ముఖ్య వ్యూహాత్మక వాదనగా పరిగణించాలని కోరుతున్నా. చైనా వాళ్లు ఈ విడ్డూరాన్ని గమనిస్తున్నారు, దీని నుంచి వారు తమ సొంత నిర్ధారణలను చేస్తున్నారు. చూడబోతే ఈ నిర్ధారణ తార్కికమైనదిగా తోస్తోంది: ప్రతి

జాతిహితం



ప్రతీకాత్మక చిత్రం

సాయంత్రం పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రకటించే భారత మీడి యాలోని అతి యుద్ధోన్మాద విభాగాలు చైనా నుంచి సవాలు అసలు లేనే లేదన్నట్టుగా నటిస్తున్నాయి. అంటే వారి ప్రభుత్వం వాటికి అలా చేయమని సలహా (ఆదేశం?) ఇచ్చి ఉండాలనేది స్పష్టం.

మన మీడియాకు చెడ్డపేరు

అదే జరిగితే, భారత ప్రభుత్వం చైనా అంటే భయపడుతోందనే అర్థానికి చేరుతాం. చిన్న శత్రువు పాకిస్తాన్‌ను నిరంతరం దునుమాడేయడం అంటే మహా మక్కువ చూపే అది, ఎక్కువ బలీయమైన శత్రువు దగ్గరికి వచ్చేసరికి దాక్కుంటుంది. తన నోటి దురుసుతనాన్ని అదుపులో ఉంచుకోవడమే కాదు, తదనుగుణంగా మీడియా కూడా నడుచుకోవడానికి హామీని కల్పిస్తుంది. చివరగా, మన మీడియాకే కాదు భారత జాతీయ ప్రయోజనానికి సైతం అత్యంత ప్రమాదకరంగా... తమలాగే భారత ప్రభుత్వం కూడా మీడియాను నియంత్రిస్తుందని చైనా భావిస్తుంది. అందువల్ల మన ప్రభుత్వం కూడా తన అంతరంగాన్ని బయటకు వెల్లడించాలన్నా లేక వెల్లడించరాదన్నా చైనా లాగే ''తన'' మీడియా ద్వారానే చేస్తుందని నిర్ధారిస్తుంది. అలాగే భారత ప్రభుత్వం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, పాకిస్తాన్ సహా ఏ ఇతర శత్రువుతోనైనా ఘర్షణలను నిలిపి వేయమని మీడియాను ఆదేశించగలదని కూడా నిర్ధారిస్తుంది.

మన మీడియా పట్ల చైనాకు చిన్న చూపు ఏర్పడటం దీని చిన్న పర్యవసానమే. కానీ ఈ కొత్త సవాలును చేపట్టే విషయంలో అతి జాగ్రత్తగా వ్యవహరించేంతగా లేదా ప్రజాభిప్రాయం మరింత ఆగ్రహావేశపూరితం కాకుండటం కోసం తమ వేట కుక్కలను తూర్పునకు చూడొద్దని చెప్పేంతగా భారత్, చైనా అంటే భయపడుతోందని భావించవచ్చు. ఇది మనకు మరింత నష్టం కలిగించే నిర్ధారణ. ఈలోగా మన మీడియా యోధులు పాకిస్తాన్‌ను, మన సొంత కశ్మీరీలను, ముస్లింలను, చనిపోయినవారిని, భోఫోర్స్ కుంభకోణంతో సంబంధం ఉందని ఆరోపించినవారిని మాటలతో దునుమాడేయడం కొనసాగుతూనే ఉంటుంది. ఈ చానళ్లలో ఒకటి డోక్లామ్ ప్రతిష్టంభనపై ఆగ్రహావేశాన్ని వ్యక్తం చేసేంత వరకు వచ్చింది. అయితే ప్రత్యేకించి దాన్ని లక్ష్యించడంతో అది సైతం దిగ్భ్రాంతికరంగా మౌనంగా మారిపోయింది. అది చైనాను ఉల్లాసరపచడమే కాదు, మరిన్ని కుహకాలకు దిగడానికి ప్రేరేపించేది కూడా.

చైనీయులు దీన్ని ఎలా చూసినాగానీ, ఇది వారు తప్పుడు అంచనాలకు రావడానికి, భారత్ పిరికిదనే ముందస్తు భావనకు రావడానికి దారి తీసే అవకాశం ఉంది. భారత మీడియాలో ఆధిపత్యపూరితమైన, విజయవంతమైన విభాగాలు ఈ ముప్పును కూడా మిగతా వాటితో, ప్రత్యేకించి పాకిస్తాన్ ముప్పుతో సమానంగా లెక్కగడితే చైనా ఇలాంటి తప్పుడు అంచనాలకు రావడం జరగదు. కానీ అవి అలా చేయకపోవడం వల్ల, పాకిస్తాన్-కశ్మీర్-ముస్లింలను దునుమాడే కార్యక్రమాలకు అధికార పార్టీ అధికారిక ప్రతిని ధులు టీవీ స్టూడియోలకు తరచుగా వస్తుండటంవల్ల.. ప్రపంచ శక్తిగా పెంపొందుతున్న దేశానికి ఉండాల్సిన బుర్ర భారత్‌కు లేదని చైనా భావించవచ్చు.

మీరు చైనాను పైపైనే అయినా గమనిస్తుంటే, లేదా కాలేజీ రోజుల యవ్వనంలో మీరు మావో అంటే ఉత్తేజితులై ఉంటే మీకు 'పోరాటం పోరాటం, మాటలు మాటలు' అనే మావోయిస్టు సూత్రం తెలిసి ఉంటుంది. దశాబ్దాల తరబడి చైనీయులు విదేశీ వ్యవహారాలలో ఈ సూత్రాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. తమ మాటలు, పోరాటంలో చాలా భాగాన్ని వారు తమ మీడియాగా చెప్పేదాన్లోనే చేస్తుంటారు. చైనా ఆర్థిక సంస్కరణలను చేపట్టిన తర్వాత మూడు దశాబ్దాలకు కూడా వారి ప్రభుత్వం ఇంకా ఆ మూడు పత్రికల ద్వారానే మాట్లాడుతున్నదనడంలో ప్రపంచంలో ఎవరికీ సందేహం లేదు.

మన వైఖరి సమంజసం

ఇంకా పూర్తి ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్న వ్యవస్థలో అవే చైనా గురించి తెలుసుకోడానికి ఉన్న ఏకైక వనరుగా ఉంటున్నాయి. వెల్లడించడానికి ఉద్దేశించినది తప్ప మరే విషయమూ బయటివారికి ఎవరికీ అందే దారే లేదు. సరిగ్గా మన మీడియాలోని కొందరు పాకిస్తాన్‌పైన, మరింత దురదృష్టకరంగా తరచుగా మన సొంత ముస్లిం పౌరులపైన సైతం విరుచుకుపడే ధోరణిలోనే... చైనా మీడియా ఇప్పుడు భారత్‌పై దాడిని సాగిస్తోంది.

చైనా సూత్రంలోని పోరాటం-పోరాటం భాగాన్ని వారి అధికారిక మీడియా అమలు చేస్తోంది. మన మీడియాలో గణనీయమైన భాగం పూర్తి మౌనం వహిస్తుండగా, ప్రభుత్వం చైనా సూత్రంలోని మాటలు-మాటలు అనే భాగాన్ని ఆశావాదంతో పట్టుదలగా అమలు చేస్తోంది. పోరాడటమో లేదా ఉపసంహరించుకోవడమో తేల్చుకోమనేలా చైనీయులు మనకు సవాలు విసురుతున్నారు. మాటల్లోనైనా మనం దాన్ని తిప్పికొట్టకుండా, వాళ్లు మాట్లాడుతారని వేచి చూడటాన్ని కొనసాగిస్తున్నాం.

ఆగ్రహావేశపూరితమైన మన చానళ్లను చైనాపై స్టూడియో యుద్ధాన్ని ప్రారంభించమని భారత ప్రభుత్వం ఆదేశించాలని నా వాదన కాదు. వాస్తవానికి వారలా చేయకపోవడం మంచి విషయం. కాబట్టే పాకిస్తాన్ విషయంలో వలే గాక ప్రజాభిప్రాయం ఇంకా అదుపు తప్పిపోలేదు. ప్రభుత్వం దౌత్యపరమైన పరిష్కారం కోసం దారి వెతకడం మంచి విషయమే. దౌత్యపరమైన ప్రయత్నాలకు ఉండే అవకాశాలను ప్రజాగ్రహం కుదించి వేయకుండా చూసుకోవడమూ మంచిదే. మనకు వ్యతిరేకంగా తెరచుకున్న కొత్త యుద్ధరంగం విషయంపై ప్రశాంత చిత్తంతో కూడిన ఇలాంటి దృక్పథం... మరో యుద్ధరంగంలో కూడా అలాంటి విజ్ఞతనే కనబరిస్తే... మరింత విశ్వసనీయమైనదిగా కనిపిస్తుంది కూడా.

చైనీయులు నిజమైన యుద్ధాన్ని కోరుకోవడం లేదు. ఇది 1962 కాదు కాబట్టి క్షేత్ర స్థాయిలో అది వారికి చాలా ఇబ్బందికరం అవుతుంది. అది మొదటి తూటా పేల్చిన వెంటనే ఆస్ట్రేలియా నుంచి జపాన్ వరకు భారత్‌కు పశ్చిమానికి చూస్తాయి. ఉప అగ్రరాజ్యంగా ఉన్న చైనా కోరుకోని ఈ పరిణామాన్ని హఠాత్తుగా కొని తెచ్చుకుంటుంది. చైనా మనతో బలవంతపు దౌత్యాన్ని సాగిస్తోంది. దాడికి, రెచ్చగొట్టడానికి అది తన సొంత మీడియానే సాధనంగా వాడుతోంది. ఆగ్రహావేశపరులైన మన తెల్ల మీసాలను ఉసిగొలిపి భయపెట్టడం అందుకు సమాధానం కాదనేది నిస్సందేహం. కాకపోతే, వారి ముప్పు పట్ల ప్రభుత్వ నిర్దేశితమైన ఈ పట్టింపులేనితనం వల్ల మనకు, డోక్లామ్ సమస్యకు పరస్పరం గౌరవప్రదమైన శాంతియుత పరిష్కారమనే లక్ష్యానికి నష్టదాయకమైన కొన్ని నిర్ధారణలను చైనా చేస్తుంది.

Twitter@ShekarGupta

గోళ్లు, వెంట్రుకలు మరియు సిట్!

మహా సంగ్రామాలప్పుడు కొన్ని వ్యూహాలు శత్రు పక్షాన్ని దారి తప్పిస్తాయ్. ప్రస్తుతం డ్రగ్స్‌పై విచారణలో గొప్ప వ్యూహ రచన సాగిందని తెలుస్తూనే ఉంది. అసలైన గొప్ప గుర్రాల్ని జాగ్రత్తగా కప్పెట్టడానికే ఈ వ్యూహం పన్నారని జనం అనుకుంటున్నారు.



శ్రీరమణ

నాస్తికులు నమ్మరుగానీ దేవుడు భలే అసాధ్యుడు. సృష్టిలో బోలెడు మెలికలు పెడతాడు. గోళ్లు మిక్కిలి నిష్ప్రయోజనమైనవనుకుంటాం. శరీరాన్ని అంటిపెట్టుకు ఉన్నా రక్త సంబంధంలేని భాగాలు గోళ్లు, వెంట్రుకలు. వాటి దారిన అవి పెరుగుతూ ఉంటాయి. వాటి పోషణ ఇటీవలి కాలంలో పెనుభారం అయ్యింది. గోళ్ల వ్యవహారమూ తక్కువది కాదు. వీటిని చాలా తృణీకారంగా తీసేస్తుంటాం. అదే మన అజ్ఞానం. మన పెద్దవాళ్లు బిడ్డ పుట్టగానే బొడ్డుని భద్రపరచి, తాయత్తులో పదిలపరిస్తే మూఢ నమ్మకం అనుకున్నాం. కానీ మూల కణాల చరిత్రని క్షణాల్లో అది చెబుతుందని నిన్న మొన్నటిదాకా మనకు తెలిసిరాలేదు.

అకున్ సబర్వాల్ పుణ్యమా అని కొన్ని కీలక ఘట్టాలలో గోళ్లు, వెంట్రుకలు గుట్టు విప్పుతాయని జన సామాన్యానికి విశదమైంది. విచారణకు వచ్చిన వారిలో కొందరు వెంట్రుక ముక్కలు ఇవ్వడానికి ససేమిరా

అక్షర తూణీరం




అన్నారు. గోళ్లు ఆత్మరక్షణకే అనుకున్నాం గానీ ఇలా గమ్మత్తు కథలు చెప్పగలవని ఎవరికీ తెలియదు. నెత్తుట్లో సైతం దొరకని కొన్ని మధుర స్మృతులు వీటిలో చూడవచ్చుట. మొత్తానికి నెల రోజులపాటు అటు ఆబ్కారీ శాఖ, ఇటు మీడియా కావల్సినంత సందడి చేశారు. కొన్ని చానెల్స్ స్వయంగా ఇంకొన్ని మసాలాలు జోడించి రేటింగులు సాధించుకున్నాయి. అందరూ పేరూ ప్రఖ్యాతి కలిగినవారు. ముఖ విలువ ఉన్నవారు. నాబోటి వాళ్లకి విషయాలు తెలుసుకోవాలని విపరీతమైన ఆసక్తి. ఈ మహా మత్తులో చిక్కుకున్న వారికి డబ్బు నిషా ఆనదు. విలాస జీవన శైలి ప్చ్... గ్లామర్ నిషా చాలదు. అప్పుడు అవసరపడతాయా అదనపు కిక్కులు. తొలి అడుగులోనే ఆనంద స్థితికి చేర్పిస్తాయి టాటూలు, బ్లాసమ్‌లు. ఒక్కసారి రుచి మరిగితే వీడటం కష్టం. గంజాయి, నల్లమందు, భంగు అతి ప్రాచీనమైన దేశవాళీ నిషాలు. తర్వాత అనేకానేక పై సంగతులు వచ్చి పడ్డాయి. ఇవీ కొత్తేమీ కాదు. ఎప్పుడూ ఓ మూల ఈ కోడ్ నడుస్తూనే ఉంది. ఇప్పుడెందుకో తీగె లాగారు. డొంకంతా కదల్లేదుగానీ కొద్దిగా హడావుడి చేశారు.

గంటలు గంటలు, రోజులు రోజులు ఇంటరాగేషన్ చేశారు. అందరూ సహకరించారు. అయినా అసలు సంగతి ఏమిటో ఎవరికీ తెలియదు. వారాల తరబడి టీవీ తెరలకు అతుక్కుపోయిన జనం పిచ్చివాళ్లుగా మిగిలారు. మహా సంగ్రామాలప్పుడు కొన్ని వ్యూహాలుంటాయ్. అవి శత్రు పక్షాన్ని దారి తప్పిస్తాయ్. ఇప్పుడు కూడా గొప్ప వ్యూహ రచన సాగిందని తెలుస్తూనే ఉంది. అసలైన గొప్ప గుర్రాల్ని జాగ్రత్తగా కప్పెట్టడానికే ఈ వ్యూహం పన్నారని జనం అనుకుంటున్నారు. తిమింగలాలు సముద్ర మధ్యంలో నిశ్చింతగా జోగుతున్నాయ్. ఒడ్డున చిన్న చేపతో అలజడిని సృష్టించి, ఆయా శాఖలు తమ నిజాయితీని చాటుకుంటున్నాయి. అకున్ సబర్వాల్ జీ! ఇంతకీ దీని ఫలశ్రుతి ఏమిటో చెప్పరా ప్లీజ్! గోళ్లు, వెంట్రుకలు మరియు రాజకీయం. వడ్ల గింజలో బియ్యపు గింజ!

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

భవతీ భిక్షాం దేహి!



బిచ్చం వేసే వారుండాలేగానీ భిక్షాటనంత సులభమైన ఉపాధి మరొకటి ఉండదు. అందుకే, అందరికీ అష్టైశ్వర్యాలు ఇవ్వగల హరహర మహాదేవుడు తన సొంత అవసరాలకు మాత్రం భిక్షా పాత్రను ఆశ్రయించి, అన్నపూర్ణేశ్వరి ప్రసాదం నుంచి హాలాహలం దాకా అన్నీ హరాయించుకొనే శక్తి సంపాదించుకొన్నాడు. తనకు భిక్ష వేసే వారింట్లో కావాలంటే కనక ధారలు కురిపిస్తాడు. తను మాత్రం అనాదిగా వచ్చిన అలవాటు మానడు.

ఆయనకు మిత్రుడూ, బావమరిది వరసవాడూ అయిన లక్ష్మీ నారాయణుడు కొంత బెట్టుసరిగా ఉండే మాట నిజమే కానీ పెద్ద పెద్ద యజ్ఞాలలో భూరి దానాలూ, దక్షిణలూ లభిస్తాయంటే, ఆయన కూడా అణిగి మణిగిపోయి చేయిచాచే సందర్భాలు ఉన్నాయి. వదినా మరదళ్ల వరస అయిన వాళ్ల భార్యలు ఆడుకొనే సరసాలు కూడా దీన్ని ప్రతిఫలిస్తాయి. 'తొలి బిచ్చగాడుగా తోచు నీ పతియంచు' వదినగారు వేళాకోలం చేస్తే, 'బలి బిచ్చమెత్తె నీ పతి యటంచు' మరదలు మేలమాడుతుంది.

జ్యోతిర్మయం

బిచ్చమెత్తటంలో ఆత్మోద్ధరణకే కాకుండా, పరోపకారానికి కూడా బోలెడంత అవకాశం ఉంది. పూర్వం, పిల్లికి బిచ్చం వేయాలన్నా బోలెడు ప్రశ్నలు గుప్పించే పీనాసి రాజుగారొకడు ఉండేవాడట. తన దగ్గరికి దానం కోరుతూ వచ్చిన ఓ భిక్షకుడిని 'నేను నీకెందుకు బిచ్చం వేయాలో చెప్పు' అని నిలదీశాడట.

'నువ్వు బిచ్చం వేస్తే నాకెంత లాభమో గానీ, బిచ్చం వెయ్యకపోతే మాత్రం నీకు అందుకు నూరురెట్ల నష్టం' అన్నాడట. 'అన్నం బిచ్చం వేయక పోవటంవల్ల, నేను ఈ జన్మలో బిచ్చగాడినయ్యాను. ఈ దుర్దశ పై జన్మలో నీకు దాపరించగూడదని, నేను బిచ్చం అడుగుతున్నాను. ఈ సువర్ణావకాశం అంది పుచ్చుకొంటావో, జారవిడుచుకొంటావో అది నీ నిర్ణయం' అన్నాడు బిచ్చగాడు. మరోమాట కూడా చెప్పాడు. 'క్రితం జన్మలో ధనం ఉండీ దానం చేయక, నేను ఈ జన్మలో బిచ్చమెత్తుతున్నాను. ఈ జన్మలో దానం చేసేందుకు ధనం లేక, దానం చేయలేకపోతున్నాను. కనుక పై జన్మలలోనూ నా గతి ఇంతే. ఇలాంటి విష వలయం నుంచి నిన్ను తప్పించాలని నేను నిన్ను బిచ్చమడుగుతున్నాను అన్నాడు.


బిచ్చమంటే ఏమిటి? 'నీ చేయిపైనా, నా చేయి కిందా, ఇచ్చి పుచ్చుకొను రుణమే బాబూ' అన్నారు పింగళి నాగేంద్రరావుగారు. ఇవాళ తీసుకొంటాం, రేపో ఎల్లుండో పై జన్మలోనో తీర్చుకొంటాం. దీన్ని బిచ్చమనటం వాస్తవాన్ని వక్రీకరించటమేనట. 'ముష్టి ఏమిటిది? ముసలి బ్రహ్మ మన చిట్టాలో రాసిన జమలే బాబూ!' అని పింగళివారి భిక్ష సూత్రం.

– ఎం. మారుతిశాస్త్రి

నేను తెలుసుకున్న కామ్రేడ్ సుందరయ్య

దక్షిణ భారతదేశంలోని తొలి తరం కమ్యూనిస్టు నేతల్లో నిరుపమాన వ్యక్తిత్వం కలిగిన ఒక గొప్ప నాయకుడి జ్ఞాపకాల కలబోత 'నేను తెలుసుకున్న కామ్రేడ్ సుందరయ్య'. 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పటి నుంచి 1985 అస్తమయం వరకు పుచ్చలపల్లి సుందరయ్య సుదీర్ఘమైన రాజకీయ జీవితంలోని వివిధ చారిత్రక ఘట్టాల సమాహారం ఈ పుస్తకం. రెండు దశాబ్దాలపాటు సుందరయ్య వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ ఏపీ విఠల్ ఆయన జీవిత పరిణామక్రమాన్ని ఈ పుస్తకంలో వివరించారు.

కమ్యూనిజం పేరు వింటేనే గొంగళిపురుగులు పాకినట్లు మధ్యతరగతి మేధావులు, సోషల్ మీడియా వ్యాఖ్యాతలు భావిస్తున్న ప్రస్తుత కాలంలో, దశాబ్దాలుగా శ్రామిక జనావళి విముక్తి ప్రదాతగా వెలుగొందిన కమ్యూనిస్టు ఉద్యమం వెనుకపట్టు పట్టినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో.. సుందరయ్య గురించి ఇప్పుడు జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఏమిటి? చట్టసభలో సభ్యులుగా ప్రమాణం కూడా చేయకముందే ఈ పార్టీనుంచి ఆ పార్టీలోకి ఫిరాయింపుదారులు జంప్ చేస్తున్న రోజుల్లో సుందరయ్య గొప్పతనం ఎవరికి కావాలి? అనేది మనముందు పెను ప్రశ్నగా నిలుస్తోంది. కానీ రాజకీయరంగంలో కనిపిస్తున్న విలువల దిగజారుడుతనం ఇలాగే కొనసాగితే నామమాత్రపు ప్రజాస్వామ్యంపైన కూడా ప్రజల విశ్వాసం పూర్తిగా క్షీణిస్తుంది. కేంద్రం, రాష్ట్రం అంటూ తేడా లేకుండా అన్ని పార్టీలూ, నేతలూ విలువల పతనం విషయంలో ఒకే తాను ముక్కలుగా ఉన్న స్థితిలో రాజకీయ రంగం ప్రక్షాళన కావాలంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, మానవీయ లక్షణాలను పుణికి పుచ్చుకోవడం, ప్రజల కోసం పోరాటం ఎలా చేయాలో, విరమించాల్సి వస్తే ఎలా విరమించాలో తెలిసి ఉండటం... ఈ గుణాలకో సమే దేశంలోని, తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నాయకులతో పాటు యువతీయువకులు కూడా సుందరయ్య జీవిత విశేషాలు చదవటం అవసరం.



1930లో మాలపర్రు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నప్పుడు 18 ఏళ్లలోపు వయస్సులో అరెస్టయి తంజావూరు బోర్‌స్టల్ స్కూలులో జైలు జీవితం సుందరయ్యను తీవ్ర అధ్యయన కర్తగా మార్చి కమ్యూనిస్టు భావజాలంతో పరిచయం కలిగించింది. విడుదలైన తర్వాత 1931లో అమీర్ హైదర్ ఖాన్‌తో కమ్యూనిస్టు పార్టీకి పూర్తికాలం కార్యకర్తగా ఉంటానని మాట ఇచ్చిన సుందరయ్య ఆ తర్వాత 1985లో కన్నుమూసేవరకు 55 సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉమ్మడి సీపీఐలోనూ, తర్వాత సీపీఎంలోనూ కొనసాగారు. పార్టీ తాననుకున్న మార్గంలో నడవలేదని గ్రహించినప్పుడు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కేంద్రంలో తన పదవులకు 1978లో రాజీనామా చేసి పార్టీ లక్ష్యాల సాధనకు నాటి ఆంధ్రప్రదేశ్‌ను కార్యక్షేత్రంగా చేసుకుని జీవించినంత కాలం ఆ కర్తవ్యంలోనే గడిపిన జననేత సుందరయ్య. కేంద్ర కమిటీ నుంచి మళ్లీ కింది స్థాయిలోకి వచ్చి పనిచేయడం అత్యంత అరుదు. దానికీ సుందరయ్యే ఆద్యులు కావడం విశేషం.

మద్రాసులో ఆంధ్రపత్రికలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను యాజమాన్యం తిరస్కరించినప్పుడు కార్మికులు సమ్మె చేస్తే పత్రిక వ్యవస్థాపకులు కాశీనాధుని నాగేశ్వరరావు సుందరయ్యతో సంప్రదింపులు జరిపి కొంత మేరకు కార్మికుల డిమాండ్లను ఆమోదించారు. ఈ సందర్భంగా కాశీనాధుని నాగేశ్వరరావు మాట్లాడుతూ కొంత అదనంగా సొమ్ము ఖర్చుపెట్టడం పెద్ద సమస్య కాదనీ, ఆంధ్రపత్రికలో కూడా సమ్మె అన్నది సంస్థ పరువుకు సంబంధించిన విషయమని, కొంచెం ముందుగానే నువ్వు నన్ను కలిసి వివరించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని నొచ్చుకున్నారు. సమస్యను పట్టువిడుపుల వైఖరితో పరిష్కరించడంలో సుందరయ్య నేర్పును ఈ ఉదంతం తెలుపుతుంది.

ఆయన పదేపదే చెప్పే విషయం ఏమిటంటే ''ఈ సమాజగమనం ఒక్క మిల్లీమీటరయినా ముందుకు వెళ్లేందుకు ప్రతి కమ్యూనిస్టూ ప్రయత్నించాలి. ఇదీ సాధ్యం కానప్పుడు కనీసం ఉన్న దశనైనా నిలబెట్టేందుకు కృషి చేయాలి. మన లక్ష్యం సిద్ధించిందా లేదా అన్నది ప్రధానం కాదు. దానిని బట్టి మన గమనాన్ని మార్చుకోవచ్చు. కానీ మనం అసలా దిశలో మానవాళి పురోగమన ప్రస్థానంలో నడుస్తున్నామా లేదా అన్నది ముఖ్యం''. 55 సంవత్సరాల ఉద్యమ జీవితం సాక్షిగా మనిషి లక్ష్యం కోసం ఎందుకు నిలబడాలో చెబుతున్న సుందరయ్య జ్ఞాపకాలను అందుకే తెలుసుకోవాలి. *ప్రతులకు: సాహితీ మిత్రులు– విజయవాడ । మొబైల్: 93929 71359*

కె. రాజశేఖరరాజు

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

సాయంత్రానికి ఫలితం వెల్లడి ● ఎన్డీఏ అభ్యర్థి వెంకయ్యకే విజయావకాశాలు

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమయ్యింది. శనివారం(నేడు) పార్లమెంట్ సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే విషయం శనివారం సాయంత్రానికి తేలిపోనుంది. లోక్‌సభలో మెజారిటీగల ఎన్డీఏ అభ్యర్థి వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికకవడం లాంఛనమే. ఆయనపై విపక్షాలు మహాత్మాగాంధీ మనవడు, పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీని రంగంలోకి దించాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతు తెలిపిన బీజేడీ, జేడీయూ ఇప్పుడు గాంధీకి మద్దతిస్తున్నాయి.

సాయంత్రానికి ఫలితం: పార్లమెంట్ హౌస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఓటింగ్ జరుగుతుంది. సాయంత్రం 7 గంటలకు ఫలితం వెల్లడిస్తారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో ఈ ఎన్నిక జరుగుతున్నందున పార్టీలు విప్ జారీ చేయలేదు. రెండుసార్లు ఉపరాష్ట్రపతిగా కొనసాగిన హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10తో ముగియనుంది రాజ్యసభ ఎక్స్–అఫీషియో చైర్మన్, లోక్‌సభ, రాజ్యసభలకు ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనుంది. ఉభయ సభల్లో మొత్తం సభ్యుల సంఖ్య 790. అయితే లోక్‌సభలో రెండు, రాజ్యసభలో ఒక స్థానం ఖాళీగా ఉన్నాయి. అలాగే కోర్టు తీర్పు కారణంగా లోక్‌సభలో బీజేపీ ఎంపీ చేడీ పాశ్వన్ ఓటు హక్కును వినియోగించుకోలేరు. 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి ఎన్నికలో గెలుస్తారు. లోక్‌సభలో మొత్తం సభ్యులు 545. బీజేపీ సభ్యులు 281. బీజేపీతో కలిపి ఎన్డీఏ బలం 338. ఇక 243 మంది సభ్యులున్న రాజ్యసభలో బీజేపీకి 58 మంది సభ్యులు.. కాంగ్రెస్‌కు 57 మంది సభ్యులు ఉన్నారు. కాగా, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఒకే కుటుంబం(బీజేపీ) నుంచి వస్తుండటంతో 2017–2022 మధ్య ఉజ్వల భవిత దిశగా దేశం పయనిస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యకు మద్దతిస్తున్న వివిధ పార్టీల ఎంపీలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు.



ఢిల్లీలో వెంకయ్య నాయుడి ప్రసంగాల పుస్తకావిష్కరణలో వేదికపై మోదీ, వెంకయ్య, అమిత్, జైట్లీ, 'ఎమెస్కో' విజయ్‌కుమార్, జర్నలిస్ట్ ఏ కృష్ణారావు



మీడియాకు విందు సందర్భంగా కూతురు దీప, మనవరాలు సుష్మాలతో ఫొటో దిగుతున్న వెంకయ్య దంపతులు

మరింతగా క్షీణించిన మేధా పాట్కర్ ఆరోగ్యం




ధార్: సర్దార్ సరోవర్ డ్యాం ముంపు బాధితులకు సరైన పునరావాసం కల్పించాలని కోరుతూ గత 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక ఉద్యమ కారిణి మేధా పాట్కర్(62) ఆరోగ్యం మరింతగా క్షీణించింది. వైద్య పరీక్షల్లో పాట్కర్ రక్త పోటు, షుగర్ స్థాయి పడిపోయినట్లు తేలిందని అదనపు కలెక్టర్ డి.కె.నాగేంద్ర తెలిపారు. మేధా పాట్కర్‌తో పాటు 11 మంది ఉద్యమకారులు జూలై 27 నుంచి మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా ఛిఖల్డా గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.

స్పైస్‌జెట్ విమానానికి తప్పిన ముప్పు

కోజికోడ్: చెన్నై నుంచి 68 మంది ప్రయాణికులతో కేరళలోని కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన స్పైస్‌జెట్ విమానానికి పెనుప్రమాదం తప్పింది. కాలికట్ ఎయిర్‌పోర్ట్‌లో శుక్రవారం ఉదయం 8.30కు విమానం ల్యాండ్ అయిన వెంటనే రన్‌వే నుంచి జారి పక్కకు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. విమానాల దిశానిర్దేశం కోసం రన్‌వే పక్కన ఏర్పాటుచేసిన లైట్లు దెబ్బతిన్నాయి.

మద్యం మత్తులో విన్యాసాలు.. ఇద్దరి మృతి

ముంబై: మద్యం మత్తులో విన్యాసాలు చేస్తూ ఇద్దరు యువకులు 2,000 అడుగుల లోతున్న లోయలోకి జారిపడి దుర్మరణం చెందారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన ఏడుగురు స్నేహితులు ఇటీవల పర్యాటక కేంద్రమయిన అంబోలీ ఘాట్‌కు చేరుకున్నారు. వీరిలో ఇమ్రాన్ (26), ప్రతాప్(21)లు మద్యం సేవించి కవాలే సాద్ బ్రిడ్జిపై విన్యాసాలు ప్రారంభించారు. స్నేహితులు ప్రోత్సహించడంతో రెయిలింగ్‌ను దాటి అవతలకు వెళ్లి నిల్చున్నారు. ఇంతలో పట్టుతప్పిన ఒక యువకుడు పక్కనే ఉన్న మరొకరిని పట్టుకోవడంతో ఇద్దరూ లోయలోకి జారి పోయారు. వీరిద్దరూ అక్కడికక్కడే మరణించారు. మిగతా స్నేహితులు ఇమ్రాన్, ప్రతాప్‌లు తప్పిపోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ప్రమాదం జరిగిన తర్వాతి రోజు ఇద్దరు యువకులు లోయలో పడిపోతున్న వీడియో వెలుగులోకి చూడ్డంతో అసలు విషయం తెలిసింది. వర్షాలు వల్ల మృతదేహాల వెలికితీతకు ఆటంకం కలుగుతోంది.



డైనోసార్ల 'మోనాలీసా'గా పేరొందిన డైనోసార్ శిలాజం ఫొటోలివి. ఏమాత్రం చెక్కుచెదరని 18 అడుగుల పొడువున్న ఈ శిలాజం కెనడాలో లభించింది. 11 కోట్ల ఏళ్ల క్రితం జీవించిన దీని బరువు 1300 కేజీలపైనే.

పనితీరు మార్చుకోండి: ఎంపీలతో మోదీ

న్యూఢిల్లీ: మారుతున్న దేశ రాజకీయాలను అర్థం చేసుకునేందుకు ప్రస్తుత పనితీరును మార్చుకోవాలని పలువురు బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలతో శుక్రవారం తన నివాసంలో మోదీ భేటీ అయ్యారు. ముద్ర, పంటబీమా, భూసార కార్డుల వంటి వివిధ పథకాల లాభాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

కార్తీపై లుక్ ఔట్ నోటీసులు

సాక్షి, చెన్నై: సీబీఐ గాలిస్తున్న అజ్ఞాత నేరస్తుల జాబితాలో కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ చేర్చింది. ఆయన విదేశీయానంపై నిషేధం విధించింది. ఐటీ, సీబీఐ, ఈడీ కేసుల్లో విచారణకు హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. లుక్ ఔట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో..వీటిని వ్యతిరేకిస్తూ శుక్రవారం కార్తీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై ఈనెల 7వ తేదీన విచారణ జరగనుంది. షెల్ కంపెనీల నుంచి భారీ ఎత్తున విదేశీ మారకద్రవ్యం పొందినట్లుగా కార్తీపై సీబీఐ అభియోగం.

మా ఓపికకు హద్దుంది: చైనా

బీజింగ్: డోక్లాం వివాదంలో తమ ఓపికకు హద్దుందని, ఇరు దేశాల మధ్య సరిహద్దుల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనపై అత్యంత స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నామని చైనా పేర్కొంది. చైనా రక్షణ శాఖ ప్రతినిధి రెన్ గ్యుకియాంగ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సరిహద్దుల్లో శాంతి, సామరస్యం తిరిగి నెలకొనేలా వీలైనంత త్వరగా ఈ వివాదానికి భారత్ ముగింపు పలకాలని సూచించారు.

సాయుధ దళాలకు ఖాదీ

న్యూఢిల్లీ: సాయుధ దళాల సిబ్బందికి త్వరలోనే ఖాదీ యూనిఫారాలు అందించనున్నామని, ఇందుకు సంబంధించిన చర్యలను వేగవంతం చేశామని లోక్‌సభలో శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ భామ్రే వెల్లడించారు. ఖాదీ విలేజస్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) విన్నపం మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. దుస్తులకు సంబంధించిన నమూనాలను కేవీఐసీకి పంపామని తెలిపారు. సైన్యంలో సోషల్ మీడియా వినియోగంపై భారత ఆర్మీ కొత్త విధివిధానాలను రూపొందించిందని తెలిపారు.



ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడికి ఢిల్లీలో పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలుపుతున్న సెల్‌కాన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు. ఆ పదవికి అభ్యర్థిగా ఎన్నికవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని గురు అన్నారు.

రాహుల్ కారుపై రాళ్ల దాడి

- పగిలిన కారు అద్దాలు.. రాహుల్ క్షేమం
- గుజరాత్ వరద ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ఘటన
- ప్రధాని నరేంద్ర మోదీకి అనుకూలంగా నినాదాలు
- దాడి బీజేపీ కార్యకర్తల పనేనని కాంగ్రెస్ విమర్శ



రాళ్లదాడిలో పగిలిన కారు అద్దాలు



రూనీ గ్రామంలో మాట్లాడుతున్న రాహుల్

ధనేరా/న్యూఢిల్లీ: గుజరాత్‌లో వరద ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల పరిశీలనకు వచ్చిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ వాహనంపై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో రాహుల్ కారు అద్దాలు పగిలిపోయాయి. ప్రత్యేక భద్రత దళం(ఎస్పీజీ) వెంటనే అప్రమత్తమవటంతో ఆయన ఎలాంటి గాయాల్లేకుండానే క్షేమంగా బయటపడ్డారు. పిరికిపందల చర్యలకు తాను భయపడనని రాహుల్ అన్నారు. అటు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఘటనలపై మండిపడింది. బీజేపీ గుండాలే ఈ దాడికి పాల్పడ్డారని విమర్శించింది. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. రాహుల్ అవకాశవాద రాజకీయాలకు విసిగి ప్రజలే దాడిచేశారని పేర్కొంది.

అసలేం జరిగింది?.. తాజా వరదలకు అతలాకుతలమైన రాజస్తాన్, ఉత్తర గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో సహాయక చర్యలను రాహుల్ గాంధీ పరిశీలించారు. రాజస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో రాహుల్ పర్యటించారు. ఈ జిల్లాలోని పలు గ్రామాల్లో బాధితులతో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత రైతులతో మాట్లాడేందుకు ధనేరాలోని మార్కెటింగ్ యార్డుకు రాహుల్ చేరుకున్నారు. లాల్‌చౌక్ ప్రాంతంలో స్థానికులను, రైతులనుద్దేశించి ఆయన మాట్లాడేందుకు సిద్ధమవగానే స్థానికులు నల్లజెండాలతో నిరసన తెలపటంతోపాటు మోదీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి ప్రజలను చెదరగొట్టారు. ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసిన రాహుల్ అక్కడినుంచి వెళ్లిపోతున్న సమయంలో ప్రజలు వాటర్ ప్యాకెట్లను కాన్వాయ్‌పైకి విసిరారు. కాన్వాయ్ ధనేరా హెలిప్యాడ్ సమీపంలోకి రాగానే.. కొందరు నిరసనకారులు రాహుల్ వాహనంపైకి రాళ్లురువ్వారు. దీంతో రాహుల్ ప్రయాణిస్తున్న కారు ఒకవైపు అద్దాలు పగిలిపోయాయి. వెంటనే అప్రమత్తమైన ఎస్పీజీ దళం రాహుల్‌ను వాహనం నుంచి బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎస్పీజీ దళ సభ్యుడికి స్వల్ప గాయాలయ్యాయి. రాయి విసిరిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధనేరా ఎమ్మెల్యే జోయ్‌తాభాయ్ పటేల్ (కాంగ్రెస్) ప్రస్తుతం బెంగళూరు ఈగల్‌టన్ రిసార్టులోని క్యాంపులో ఉన్నారు. కాగా, తనపై దాడి చేస్తే భయపడేది లేదని రాహుల్ స్పష్టం చేశారు. 'ఇలాంటి పిరికిపంద చర్యలకు, మోదీ మోదీ అంటూ చేసే నినాదాలకు నేను భయపడను. మీ బాధలను విని, అర్థం చేసుకునేందుకు వచ్చాను. వీలైనంత సాయం చేద్దామనుకున్నాను. సత్యాన్ని చూడాలనుకోని, అర్థం చేసుకోలేని వారే భయపడతారు. నేను కాదు' అని దాడి అనంతరం రాహుల్ ట్వీట్ చేశారు. ఘటన జరిగిన సమయంలో కాంగ్రెస్ నేత, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ తదితరులున్నారు.

బీజేపీ గూండాల పనే: కాంగ్రెస్

రాహుల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్తే బీజేపీ గూండాలు సిమెంటు ఇటుకలతో దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించాలని బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావు లేదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు.

రాహుల్‌వి 'ఫొటో' రాజకీయాలు: బీజేపీ

గుజరాత్, రాజస్తాన్‌లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటన ఫొటో రాజకీయం చేసేందుకేనని బీజేపీ విమర్శించింది. 'ప్రజలను గూండాలు, రౌడీలని అనొద్దు. వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరు రిసార్టులో ఎంజాయ్ చేస్తున్నారు. రాహుల్ గాంధీ, ఆయన పార్టీ చేస్తున్న రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారు. అందుకే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించాలి' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తెలిపారు.

మరణ ధ్రువీకరణకూ ఆధార్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వ్యక్తుల గుర్తింపులో మోసాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈ మేరకు హోంశాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జమ్మూకశ్మీర్, అస్సాం, మేఘాలయ రాష్ట్రాలు మినహా దేశమంతటా ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ మూడు రాష్ట్రాల కోసం త్వరలో మరో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఆధార్‌ను తప్పనిసరి చేయడం ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం కోసం రకరకాల డాక్యుమెంట్లను సమర్పించాల్సిన అవసరం ఉండదని హోంశాఖ నేతృత్వంలో పనిచేసే రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం(ఓఆర్జీ) తెలిపింది. ఈ విషయమై తమ అభిప్రాయాలను అక్టోబర్ 1కల్లా తెలియజేయాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరినట్లు వెల్లడించింది. మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసే సమయంలో చనిపోయిన వ్యక్తి ఆధార్ లేదా ఎన్‌రోల్‌మెంట్ ఐడీతో పాటు అతని/ఆమె జీవిత భాగస్వామి ఆధార్‌ను కూడా ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించింది. దీంతో పాటు దరఖాస్తుదారు కూడా తన ఆధార్‌ను సమర్పించాల్సి ఉంటుందని ఓఆర్జీ పేర్కొంది. చనిపోయినవారి ఆధార్ వివరాలపై స్పష్టత లేకుంటే..తనకు తెలిసినంతవరకు మృతుడు/మృతురాలికి ఆధార్ లేదని దరఖాస్తుదారు సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఒకవేళ దరఖాస్తుదారు తప్పుడు వివరాలు ఇస్తే ఆధార్ చట్టం–2016, జనన, మరణాల రిజిస్ట్రేషన్ చట్టం–1969 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

హిజ్బుల్ ఉగ్రవాది హతం

అనంత్‌నాగ్: దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇటీవలే హిజ్బుల్ ముజాహిదీన్‌లో చేరిన స్థానిక ఉగ్రవాది హతమయ్యాడు. కాల్పుల్లో చిక్కుకుని గుర్తుతెలియని మరో వ్యక్తి కూడా మరణించాడు. మిలిటెంట్లు ఉన్నారన్న సమాచారం అందడంతో గురువారం రాత్రి బిజ్‌బెహారా ప్రాంతంలోని కానిబల్ సమీపంలోని ఓ గ్రామంలో భద్రతా దళాలు గాలింపు ప్రారంభించాయి. రెండు గంటల పాటు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఉగ్రవాదిని యావర్‌గా గుర్తించారు. మరో ఇద్దరు మిలిటెంట్లు పారిపోయారు. ఈ ఘటనలో ఓ జవాన్‌కు గాయాలైనా అతని ప్రాణానికి ముప్పేమీ లేదని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న సమయంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బుల్లెట్‌లు తగిలి చనిపోయాడు. బైక్ నంబర్‌ప్లేట్ ధ్వంసం కావడం, అతని ఐడీ కార్డు లభ్యం కాకపోవడంతో అతనెవరో గుర్తించలేకపోయారు.

విదేశాల్లోను భారీగా ఆస్తులు

కర్ణాటక మంత్రి సన్నిహితుడి ఇంట్లో 16 రహస్య లాకర్లు గుర్తింపు



శివకుమార్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ అక్రమాల పుట్ట తవ్వేకొద్దీ కొత్త అంశాలు వెలుగుచూస్తున్నాయి. దుబాయ్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో బినామీ పేర్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన ఆధారాల్ని సేకరించారు. మూడు రోజులుగా శివకుమార్‌పై ఐటీ దాడులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దుబాయ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటు, బెంగళూరులో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి డీకే సొమ్ము సమకూర్చుకున్నట్లు తేలింది.

వందల కోట్ల స్థిరాస్తి పత్రాలు స్వాధీనం


శివకుమార్ సన్నిహితుడు శర్మా ట్రావెల్స్ యజమాని సునీల్‌కుమార్ శర్మ ఇంట్లో 16 రహస్య లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 11 లాకర్లలో వందల కోట్ల స్థిరాస్తి ధ్రువీకరణ పత్రాల్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ట్రావెల్స్‌కు చెందిన ఐదు బ్యాంకు లావాదేవీల్ని స్తంభింపజేశారు. ఈ ట్రావెల్స్‌లో శివకుమార్‌కు 35%వాటా ఉన్నట్లు సమాచారం. ఆ ఇంటి భూగర్భంలో గదిని గుర్తించిన అధికారులు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మైసూరులోని డీకే మామ తిమ్మయ్యకు చెందిన షీకాయిపొడి పరిశ్రమను ఐటీ శాఖ అధికారులు సీజ్ చేశారు.

శివకుమార్‌కు అస్వస్థత

శివకుమార్ శుక్రవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. బీపీ పెరిగినట్లు గుర్తించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు.

చలామణిలో 86 శాతం నగదు

- లోక్‌సభలో కేంద్రం వెల్లడి
- రాజ్యసభలో సుష్మపై రెండు హక్కుల తీర్మానం నోటీసులు



రాజ్యసభలో విపక్షాల నిరసన

న్యూఢిల్లీ: నోట్ల రద్దుకు ముందు చలామణిలో ఉన్న నగదులో 86 శాతం ఈ ఏడాది జూలై 21 నాటికి మార్కెట్లో అందుబాటులో ఉందని లోక్‌సభకు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. డిమాండ్‌కు సరిపడా కరెన్సీ నోట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ అన్ని ఏర్పాట్లు చేసిందని ఆర్థిక శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. మరోవైపు ఎల్పీజీ సిలిండర్లపై నెలవారీ రూ. 4 పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరీ మాట్లాడుతూ.. ఎల్పీజీ సబ్సిడీ ఎత్తివేస్తున్నారని, ఒక్కసారిగా 18 కోట్ల మంది ఎలా ధనవంతులుగా మారిపోతారు? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లోకి పాకిస్తాన్ ఉగ్రవాదుల చొరబాట్లు పెరిగినా.. వాటిని దీటుగా తిప్పికొడుతున్నామని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు తెలిపారు. కాగా, రైల్వే టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ తప్పనిసరి కాదని రాజ్యసభకు కేంద్రం తెలిపింది.

సుష్మ సభను తప్పుదారి పట్టించారు: కాంగ్రెస్

విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సభను తప్పుదారి పట్టించారంటూ రాజ్యసభలో కాంగ్రెస్ రెండు సభా హక్కుల తీర్మానం నోటీసులు అందచేసింది. ఆగస్టు 3న విదేశాంగ విధానంపై చర్చ సందర్భంగా సుష్మ సభను తప్పుదారి పట్టించారని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. బాండుంగ్‌లో ఆఫ్రో–ఆసియన్ సదస్సులో నెహ్రూ పేరును ప్రస్తావించకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. సదస్సులో భారత్ తరపున ఎవరూ మాట్లాడలేదని సుష్మ అబద్ధమాడారంది. మోదీ లాహోర్ పర్యటన అనంతరం దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరగలేదంటూ సుష్మ సభను తప్పుదారి పట్టించారని మరో హక్కుల తీర్మానం నోటీసును కాంగ్రెస్ అందచేసింది.



సూచీతో ఆంధ్రసంఘం అధ్యక్షుని భేటీ

న్యేపిదా: మయన్మార్ అమరవీరుల స్మారకదినోత్సవం సందర్భంగా ఇటీవల పలు మతాల, సంస్థల ప్రతినిధి బృందాలతో ఆ దేశ ప్రధాన సలహాదారు ఆంగ్‌సాంగ్‌సూచీ తన నివాసంలో భేటీ అయ్యారు. ఈ బృందంలో ఆంధ్రప్రదేశ్ నుంచి మయన్మార్‌కు వలసవచ్చిన సుబ్రమణి ఉన్నారు. మయన్మార్‌లోని లక్ష మంది తెలుగువారు మన తెలుగు సాంస్కృతీ సంప్రదాయలను కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. సుబ్రమణి మయన్మార్ 'ఆంధ్ర సంఘం' అధ్యక్షుడు.

కాలగర్భంలో 400 భాషలు!

తెలుగుకు ముప్పు లేదు



భాషకు ముప్పొచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండొంతుల భాషలు ప్రమాదంలో పడ్డాయి. ప్రపంచంలో మొత్తంగా 6000 భాషలున్నట్లు అంచనా. వాటిలో 2050 ఏడాదికల్లా 4000 భాషలు క్రమేపీ మూగబోయే ప్రమాదం ఉందని భాషాశాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. వీటిలో పదిశాతం భారతీయ భాషలున్నాయి. ప్రస్తుతం దేశంలో 780 భాషలను మాట్లాడుతుండగా రాబోయే 35 ఏళ్లలో వాటిలో 400 వరకు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఒక పరిశీలన. భాషను కోల్పోవడమంటే పెద్ద ఎత్తున మానవ, సాంస్కృతిక పెట్టుబడిని కోల్పోయినట్టే. ఒక భాష పుట్టడానికి వేలాది ఏళ్లు పడుతుండగా, ఎంతో మానవ సంఘర్షణ తర్వాతే ఒక రూపాన్ని సంతరించుకుంటుంది. ఈ విషయంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు మాట్లాడుతున్న హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ, పంజాబీ భాషలకు అటువంటి బెంగ ఏమీ లేదని, ఈ భాషలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉండడంతో ఈ జాబితాలోకి రావంటున్నారు. వీటిపై ఇంగ్లిష్ భాష ప్రభావమున్నా ఇవి క్షీణిస్తాయన్న భయం అవసరం లేదని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ) భరోసా ఇస్తోంది. ఈ సంస్థ 27 రాష్ట్రాల్లోని 780 భాషలపై 3000 మందితో అధ్యయనం నిర్వహించింది. ఈ ఏడాది చివరినాటికి సిక్కిం, గోవా, అండమాన్, నికోబార్‌లలోనూ పరిశీలన పూర్తి చేసే ఆలోచనతో ఉంది. ఈ పరిశోధనకు సంబంధించిన 11 సంపుటాలను ఇటీవల ఢిల్లీలో విడుదల చేసింది.

తీరప్రాంత భాషలకే ఎక్కువ ముప్పు

తీరప్రాంతాల్లో మాట్లాడుతున్న భాషలే ప్రమాదంలో ఉన్నాయని పీఎల్ఎస్ఐ చైర్మన్ గణేష్ ఎన్.దేవి చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో స్థిరమైన జీవనోపాధి దొరకక సంప్రదాయ మత్స్యకార వర్గాలు తీరానికి దూరమవుతున్నాయి. అధునాతన జీవనశైలి అలవడి క్రమేణా తమ మాతృభాషను వదులుకోవాల్సి వస్తోంది' అని ఆయన అంటున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో మాట్లాడే సంతాలి, గోండి, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లలోని భేలి, మిజోరాంలోని మిజో, మేఘాలయాలోని ఖాసి, త్రిపురలోని కోట్ బారక్ భాషలు పుంజుకోవడం శుభపరిణామం. ఈ తెగల్లోని విద్యావంతులు భావవ్యక్తీకరణకు, రచనలకు విరివిగా ఈ భాషను ఉపయోగిస్తున్నారు. తమ భాషల్లోనే కవితలు, నాటకాలను రాసి ప్రదర్శిస్తుండడం, గోండి వంటి భాషల్లో సినిమాలను కూడా తీస్తుండడం కలిసివస్తోంది. చిత్రపరిశ్రమ పురోభివృద్ధితో భోజ్‌పురి దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న భాషగా నిలుస్తోంది.

–సాక్షి నాలెడ్జ్ సెంటర్

'రష్యా జోక్యం'పై జ్యూరీ

వాషింగ్టన్: 'రష్యా జోక్యం' కేసులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ప్రచార బృందానికి, రష్యాకు మధ్య కొనసాగినట్లు భావిస్తున్న సంబంధాలపై దర్యాప్తు కోసం ప్రత్యేక ప్రాసిక్యూటర్, ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్.. గ్రాండ్ జ్యూరీని నియమించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం పూర్తిగా తన శత్రువులు సృష్టించిన కట్టుకథ అని ట్రంప్ మండిపడ్డారు. కాగా, మెక్సికో అధ్యక్షుడు ఎన్రిక్ పెనా నీటో, ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బుల్‌లతో ట్రంప్ ఈ ఏడాది జనవరిలో జరిపిన ఫోన్ సంభాషణల వివరాలు లీక్ అయ్యాయి. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం తనకు ప్రాధన్య అంశం కాదని, శరణార్థులకు ఆశ్రయం కల్పించొద్దని ఆయన సంభాషణల్లో అన్నారు.

మంత్రి తుమ్మలకు అస్వస్థత

యశోదలో చేరిక.. ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రహదారులు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన మూడేళ్ల నుంచి సెప్టిక్ అల్సర్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఉదయం ఆయనకు రక్తపు వాంతులు అవడంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చేరారు. డాక్టర్ పీవీ రావు సమక్షంలో తుమ్మలకు ఎండోస్కోపీతోపాటు పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. అల్సర్ వల్లే రక్తపు వాంతులు అవుతున్నాయని గుర్తించిన వైద్యులు ఆయన్ను ఐసీయూకి తరలించి చికిత్సను అందిస్తున్నారు. అయితే, ఆయన ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు మూడు రోజుల తర్వాత ఆయన్ను డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుమ్మలను మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీలు పరామర్శించారు.

✦ ఓటమి భయం పట్టుకున్నది కాంగ్రెస్‌కే..

తప్పుడు కేసులు వేస్తున్నందుకు సిగ్గు పడాలి: కర్నె



సాక్షి, హైదరాబాద్: ఓటమి భయం పట్టుకుంది ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాదని, కాంగ్రెస్ పార్టీ నేతలకే ఆ భయం పట్టుకుందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌వి దిగజారుడు రాజకీయాలని, కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుల, మత రాజకీయం చేస్తుంటేనే సీఎం మాట్లాడారని, విపక్షాలు ఎలా బడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కాక, కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తున్నందుకు సిగ్గుపడాలని మండిపడ్డారు. వివిధ ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలపై కేసులు వేసినందుకు కాంగ్రెస్ నేతలంతా ముక్కు నేలకు రాసి లక్ష గుంజీలు తీయాలన్నారు.

✦ కొత్త అసెంబ్లీ, సచివాలయం ఎందుకు?



మర్రి శశిధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సచివాలయం, అసెంబ్లీ భవనాలు పటిష్టంగా ఉన్నా కొత్త భవనాలు ఎందుకో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పుడున్న సచివాలయానికిరాని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కొత్త భవనాలు ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రమంతా తిరుగుతానని సీఎం అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల రీ డిజైన్‌పై బహిరంగ చర్చకు రావాలని ఎన్నిసార్లు సవాల్ చేసినా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి నిరంకుశ ముఖ్యమంత్రిపై ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు.

✦ కుమారుడిని కాపాడేందుకు సీఎం పాట్లు



తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: ప్రజా ఉద్యమాలను చులకన చేస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వెటకారంగా మాట్లాడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తన కుమారుడిని కాపాడుకోవడానికి సీఎం పడరాని పాట్లు పడుతున్నారని విమర్శించారు. కొద్ది రోజులుగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై తాము చేస్తున్న అభియోగాలను ఆధారాలతో సహా నిరూపించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతుల భూములను కారుచౌకగా కాజేయటానికి కంపెనీలు, ప్రభుత్వం ఉమ్మడిగా భూదందాకి పాల్పడ్డాయని, కాబట్టే రైతులు కోర్టులను ఆశ్రయించారన్నారు.

✦ అధికారం దక్కదనే దిగజారుడు రాజకీయాలు

కాంగ్రెస్‌పై మండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్టంలో తిరిగి తమకు అధికారం దక్కదని కాంగ్రెస్ నాయకులకు అర్థమైందని, అందుకే దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని శాసనమండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు రెండు నెలలుగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నా సీఎం ఓపికతో వ్యవహరించారని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మౌనంగా ఉంటే కాంగ్రెస్ నాయకులు మరింత రెచ్చిపోతారనే సీఎం అన్ని అంశాలను విడమరిచి చెప్పారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడుతున్న కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించటం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

✦ నిజాలు దాచిపెట్టొద్దు: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ మంత్రిగా ఉండి హిమాన్షు మోటార్ కంపెనీలో డైరెక్టర్‌గా కొనసాగడం చట్టవిరుద్ధమని అభియోగాలు వెల్లువెత్తుతుంటే, వాటికి సమాధానం చెప్పకుండా ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వాస్తవాలు దాటవేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. హిమాన్షు కంపెనీతో ఏడేళ్లుగా ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రం కంపెనీ ఉన్నా యాక్టివిటీలో లేదంటున్నారని పేర్కొంది. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో హిమాన్షు మోటారు కంపెనీలో 3 లక్షల షేర్లు ఉన్నాయని, వాటి విలువ రూ.30 లక్షలు అని పేర్కొన్నారని, కేటీఆర్ డైరెక్టర్ హోదాలో 2015–16 ఆర్థిక సంవత్సరం ఐటీ రిటన్స్‌ను తన సంతకంతో సమర్పించారని వివరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాట్లాడితే తప్పులు ఒప్పు కావని, కేటీఆర్‌తో రాజీనామా చేయించాలని సీపీఎం పేర్కొంది.

✦ అప్రజాస్వామిక చర్యలకు పరాకాష్ట

రాహుల్‌గాంధీపై దాడి ఘటనపై ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై గుజరాత్‌లో బీజేపీ నేతలు భౌతికదాడులకు పాల్పడటం ప్రధాని మోదీ అప్రజాస్వామిక పాలనకు పరాకాష్ట అని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గుజరాత్‌లోని బనస్కంత్ ప్రాంతంలో పర్యటిస్తున్న సందర్భంగా బీజేపీ కార్యకర్తలు దాడులకు దిగారని వివరించారు. ప్రధాని సొంత రాష్ట్రంలోనే దాడులు జరగడం బీజేపీ పాలనా విధానాలను బయటపెట్టిందన్నారు. అహింసా సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహాత్మ గాంధీ పుట్టిన నేలపై ఇలాంటి దాడులు జరగడం దారుణమన్నారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడిని సీఎల్పీ నేత జానారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఖండించారు.

✦ నా కుమారుడి వివాహానికి రండి

లోక్‌సభ స్పీకర్‌కు మధుసూదనాచారి ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 11న హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి ఆహ్వానించారు. శుక్రవారం పార్లమెంటులో ఆమెను కలసి ఈ మేరకు వివాహ ఆహ్వాన పత్రికను అందించారు. టీఆర్ఎస్ ఎంపీలు, ఇతర నేతలనూ కలసి పెళ్లికి ఆహ్వానించారు.

✦ దేశంలోనే తొలి బాడీ స్కానర్

త్వరలో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అందుబాటులోకి..: సీఐఎస్ఎఫ్ డీజీ
శంషాబాద్‌లో ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ వ్యవస్థ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: దేశంలో మొదటిసారిగా ఎయిర్‌పోర్టుల భద్రత విషయంలో బాడీ స్కానర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ఓపీ సింగ్ వెల్లడించారు. ముందుగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో త్వరలో అందుబాటులోకి రానుందని స్పష్టం చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జీఎమ్మార్ సంస్థ ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ వ్యవస్థను సీఐఎస్ఎఫ్ డీజీ ఓపీ సింగ్ శుక్రవారం డొమెస్టిక్ టెర్మినల్‌లో ప్రారంభించారు. ఈ–బోర్డింగ్, డిజిటలైజేషన్‌ను దృష్టిలో పెట్టుకొని సులువుగా, వేగంగా సెక్యూరిటీ చెక్ పూర్తిచేసుకోవడంలో ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఉపకరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సౌకర్యం వల్ల 40 శాతం మంది డొమెస్టిక్ ప్రయాణికులు నేరుగా సెక్యూరిటీ చెక్‌ను పూర్తిచేసుకోవచ్చన్నారు. దీంతో సమయం వృథా కాకుండా నేరుగా సెక్యూరిటీ చెక్‌తో ఎయిర్‌క్రాఫ్ట్ వద్దకు చేరుకోవచ్చన్నారు. దేశంలో మొదటిసారిగా హైదరాబాద్ జీఎమ్మార్ ఈ ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయని ఓపీ సింగ్ అభిప్రాయపడ్డారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో టీఆర్ఎస్ ఎంపీ కె. కవిత, పార్టీ ఎమ్మెల్యేలు శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎంపీ కవిత ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, విద్యాసాగర్‌రావు, గణేష్ గుప్తా తదితరులు కోవింద్‌ను రాష్ట్రపతి భవన్‌లో కలుసుకొని నూతన రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు.



శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత



శుక్రవారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌తో ఎంపీ కవిత

జగిత్యాలకు అనుసంధానంగా హైవేలు విస్తరించండి

కేంద్రమంత్రి గడ్కరీకి టీఆర్ఎస్ ఎంపీల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: జగిత్యాలకు అనుసంధానంగా వివిధ జాతీయ రహదారులను విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీలు కవిత, ఎమ్మెల్యేలు కోరారు. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 63లను కలుపుతూ జగిత్యాలకు అనుసంధానంగా దారూర్–నర్సింగాపూర్–పోలాస గ్రామాల మీదుగా మూడో బైపాస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నిజామాబాద్–కరీంనగర్ రోడ్‌లో చల్‌గల్ అంతర్‌గాన్–దారూర్–రాజారాంల మీదుగా బైపాస్ ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు నిజామాబాద్–ధర్మపూరి ఎన్‌హెచ్ 63 రహదారిలో చల్‌గల్ నుంచి పోలాస మధ్య బైపాస్‌ను విస్తరించాలని కోరారు.

‘రాఖీ రోజున హెల్మెట్’ ప్రచారం భేష్

ఎంపీ కవితకు లోక్‌సభ స్పీకర్ కితాబు

సాక్షి, న్యూఢిల్లీ: హెల్మెట్ వినియోగంపై అవగాహనకు ఎంపీ కవిత ప్రారంభించిన ఆన్‌లైన్ ప్రచారానికి సంబంధించిన వెబ్‌లింక్ www.sisters4 change.org ను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం పార్లమెంటులో ప్రారంభించారు. రాఖీ పండుగనాడు ప్రతి మహిళ తమ సోదరులకు రాఖీ కట్టడంతోపాటు ఒక హెల్మెట్‌ను బహుకరించాలని కవిత ఇచ్చిన పిలుపును స్పీకర్ మెచ్చుకున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం తాను ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.

అక్రమాలకు స్కానింగ్‌తో బ్రేక్!

వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ల అడ్డుకట్టకు చర్యలు

- వాహనం నమోదు సమయంలోనే స్కానింగ్
- ఇంజన్, చాసిస్ నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు
- ప్రభుత్వానికి విచారణ కమిటీ నివేదిక అందజేత

సాక్షి, హైదరాబాద్: వాహనం ఒక చోట. ఆర్టీఏ కార్యాలయం మరో చోట. ఆ వాహనాలను రిజిస్ట్రేషన్ చేసే అధికారి ఇంకో చోట. కొత్త వాహనాలు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయ్యే వాహనాల్లో తరచుగా చోటుచేసుకునే నిబంధనల ఉల్లంఘన ఇదీ. ఏజెంట్‌లు, మధ్యవర్తులపై ఆధారపడి కార్యకలాపాలు సాగించే కొందరు ఆర్టీఏ అధికారులు వాహనాల భౌతిక స్థితిని ఏ మాత్రం పరిశీలించకుండా అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. మోటారు వాహన చట్టాలను సైతం పరిగణనలోకి తీసుకోకుండా వాహనాలను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు అడ్డగోలుగా బదిలీ చేసేస్తున్నారు. కొన్నిసార్లు డాక్యుమెంట్లను పరిశీలించకుండానే ఒకరి నుంచి మరొకరికి బదిలీ చేస్తున్నారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు, బదిలీల్లో భారీగా డబ్బులు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఇలా అక్రమంగా నమోదయ్యే వాహనాలు అసాంఘిక శక్తుల చేతుల్లోకి సైతం వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల అక్ర మాలకు చెక్ పెట్టేందుకు వాహనాలను, వాటి ఇంజన్, చాసిస్ నంబర్లను స్కానింగ్ చేయాలని విచారణ కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. ప్రస్తుతం రవాణా శాఖ అందజేసే సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారానే లభిస్తున్నాయి. వాహనదారులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని సేవలను పొందుతున్నారు. కానీ వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో మాత్రం ఇంకా పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. ఒక తెల్ల కాగితంపై వాహనం ఇంజన్ నంబర్, చాసిస్ నంబర్లను పెన్సిల్(రుద్దడం ద్వారా)తో నమోదు చేస్తున్నారు. వాహనాలను ఆర్టీఏ కార్యాలయానికి తరలించకుండా ఎక్కడో ఉన్న వాటి నంబర్లను ఏజెంట్‌లే పెన్సిల్ ద్వారా నమోదు చేసుకుని వస్తున్నారు. విజయవాడలో బాడీ నిర్మాణ దశలో ఉన్న ఆయిల్ ట్యాంకర్లకు అక్కడే ఇంజన్ నంబర్లు, చాసిస్ నంబర్లను పెన్సిల్‌తో కాగితంపై రుద్దుకుని తెచ్చారు. వాహనాలను పరిశీలించకుండా కేవలం ఏజెంట్‌లు అందజేసిన కాగితాల ఆధారంగానే కొందరు ఎంవీఐలు వాహనాలను నమోదు చేసినట్లు ఈ ఉదంతంపై ప్రభుత్వానికి నివేదిక అందజేసిన ప్రవీణ్‌రావు కమిటీ అభిప్రాయపడింది. అక్రమాలకు చెక్ పెట్టాలంటే.. తెల్లకాగితంపై పెన్సిల్‌తో రుద్దే పద్ధతిని రద్దు చేసి.. దాని స్థానంలో వాహనాల ఇంజన్ నంబర్లు, చాసిస్ నంబర్లను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించింది. కమిటీ నివేదిక నేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. త్వరలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరనున్నట్లు రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు ‘సాక్షి’తో చెప్పారు.

భారీ పరిశ్రమగా మత్స్యరంగం

చేప పిల్లల విడుదలను వీడియో చిత్రీకరణ: తలసాని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మత్స్యరంగాన్ని భారీ పరిశ్రమగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో తలసాని అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కన్నెబోయిన రాజయ్యయాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ చందా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఇందులో పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తలసాని విలేకరులకు తెలిపారు. ఈ సంవత్సరం 77 రిజర్వాయర్లు, 19,465 గ్రామ పంచాయతీ చెరువులు, 4,467 ప్రభుత్వ చెరువులలో సుమారు 70 కోట్ల చేపపిల్లలను విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో టెండర్లను పిలిచామన్నారు. వచ్చే నెలలో చేపపిల్లలను విడుదల చేస్తామన్నారు. నిబంధనల ప్రకారం లేని చేపపిల్లలను కచ్చితంగా తిరస్కరించాలని, చేపపిల్లల విడుదల సమయంలో ఆయా మత్స్యసొసైటీల సభ్యులు ఉండే విధంగా చూడాలని ఆదేశించామన్నారు. చేపపిల్లల విడుదలను వీడియో ద్వారా చిత్రీకరణ చేయాలని, ఉదయం 8 నుండి 11 గంటల మధ్యలోనే చేపపిల్లలను విడుదల చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు మంత్రి పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా 6 రిజర్వాయర్లలో రొయ్యల పెంపకం చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు. మత్స్యరంగ అభివృద్ధికి ప్రధానంగా మార్కెటింగ్, చేపల నిల్వకు కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, మత్స్యకారులకు శిక్షణ తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తలసాని వివరించారు.

అదే ధైర్యంతో ఉద్యమించండి

నేరెళ్ల వ్యవహారంపై మావోయిస్టు పార్టీ నేత జగన్

సాక్షి, హైదరాబాద్: ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా నేరెళ్ల గ్రామ ప్రజలు, దాని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చేస్తున్న పోరాటానికి మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు. మాఫియాకు వ్యతిరేకంగా మరింత ధైర్యంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. వనరుల పరిరక్షణ ఉద్యమంలో నేరెళ్ల ప్రజల పోరాటం తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శం అవుతుందని శుక్రవారం ఓ లేఖలో పేర్కొన్నారు. కోస్తాంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణ వనరులను దోచుకుంటున్నారని, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని కొండలు, గుట్టలు, గోదావరి ఇసుకను తరలించి వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు తొత్తులుగా పనిచేస్తున్న వరంగల్, కరీంనగర్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వారి బంధువులకు ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆంధ్రాపాలన నాటి దుస్థితి ఇంకానా..?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండగగా జరుపుకోలేని ఆంధ్రా పాలన నాటి దుస్థితి స్వరాష్ట్రంలోనూ కొనసాగాల్సిందేనా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ సమావేశం హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రజాకార్లపై పోరాడి గెలిచిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోవడం అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటం, మనోభావాలతో ముడిపడిన అంశమని అన్నారు. ఆంధ్రాపాలనలోని దుస్థితి ఇంకా ఎందుకు కొనసాగాలని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ విమోచన దినోత్సవంపై వాస్తవాలను తొక్కిపెట్టారని, ఇంకా అదే కొనసాగుతోందని విమర్శించారు. ఉద్యమ నాయకునిగా దీనిని ప్రశ్నించిన కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కి మూడేళ్లు దాటినా ఇంకా ఎందుకు అధికారికంగా నిర్వహించడంలేదని ప్రశ్నించారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపకుంటే సమైక్య రాష్ట్రంలోని మంత్రులను రాజీనామా చేయాలని తెలంగాణ మంత్రులను డిమాండ్ చేసిన వారు ఇప్పుడు పదవుల్లో ఎందుకు ఉన్నారో చెప్పాలన్నారు. అప్పుడు అడిగిన టీఆర్ఎస్ అధికారంలో ఉందని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎందుకు మాటమారుస్తున్నారని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఒకటి, రెండు జిల్లాలు మాత్రమే తీసుకున్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరుపుకుంటున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు జరపడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాపాలను కడుగుతున్నామని చెప్పుకుంటున్న టీఆర్ఎస్ నేతలు.. విమోచన దినోత్సవాన్ని ఎందుకు జరపడంలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తప్పిదాలను ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. మజ్లిస్ నాయకులు, రజాకారుల వారసులకోసం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజలు పరిచిపోయేలా చేస్తారా అని లక్ష్మణ్ ప్రశ్నించారు.

ఇంతకీ మన పల్లెలెన్ని?



దేశంలో గ్రామాల లెక్కపై గందరగోళం • ఒక్కో సంఖ్య చెబుతున్న ఒక్కో శాఖ

మనదేశంలో మొత్తం గ్రామాలెన్ని..? మనకు చాలాసార్లు ఇలాంటి సందేహం వస్తుంటుంది. దీనికి సమాధానం కోసం ప్రభుత్వ విభాగాలను అడిగితే స్పష్టమైన జవాబు మాత్రం రాదు. ఎందుకంటే దేశంలో ఎన్ని గ్రామాలున్నాయనే దానిపై ప్రభుత్వ శాఖలకే స్పష్టత లేదు. అందువల్లే ఒక శాఖ 6 లక్షల గ్రామాలు ఉన్నాయని చెపితే.. మరో విభాగం 10 లక్షల గ్రామాలు ఉన్నాయని చెపుతుంది. విభాగాలవారీగా గ్రామం అనే పదానికి నిర్వచనాలు భిన్నంగా ఉన్నాయి. దీనికి అనుగుణంగా గ్రామాల సంఖ్య మారిపోతోంది. మొత్తం గ్రామాల సంఖ్య ఎంత అనే దానిపై స్పష్టత లేకపోవడంతో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో గందరగోళం తలెత్తుతోంది.

–సాక్షి, తెలంగాణ డెస్క్



ఒక్కో శాఖదీ ఒక్కో లెక్క..

దేశంలో పరిపాలనా సరిహద్దుల గురించిన సమాచారానికి అధీకృత మూలం జనాభాలెక్కలే. 2011 జనాభాలెక్కల ప్రకారం దేశంలో ఉన్న మొత్తం గ్రామాల సంఖ్య 6,49,481. ఇందులో 5,93,615 గ్రామాల్లో ప్రజలు నివసిస్తుండగా.. మరో 50 వేల గ్రామాల్లో జనావాసాలే లేవు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వంద రోజుల పని కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సేకరించిన గ్రామాలు, కుగ్రామాల సంఖ్య 10 లక్షలకుపైగానే ఉంది. ఇక తాగునీటి, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ అధీనంలో ఉండే ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఐఎంఐఎస్) డాటాబేస్‌లో ఈ సంఖ్య 6,08,662గా ఉంది. ఇదే శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛ భారత్ అభియాన్(గ్రామీణ)లో గ్రామాల సంఖ్యను 6,05,805గా పేర్కొనడం గమనార్హం.

ఎందుకీ తేడాలు..

వాస్తవంగా చెప్పాలంటే.. ప్రస్తుతం దేశంలో మొత్తం గ్రామాలు ఎన్ననే దానిపై అధీకృత అంచనా లేదు. ప్రణాళికాపరంగా, నిధుల అందజేసే విషయంలో కచ్చితమైన గ్రామాల సంఖ్య తెలుసుకోవడం చాలా కీలకం. ఆర్థిక, పరిపాలనకు సంబంధించి ప్రాథమిక విభాగంగా గ్రామం ఉంటుంది. ప్రభుత్వ రెవెన్యూ విభాగం.. గ్రామాలను నిర్వచించి.. గుర్తిస్తుంది. గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కొత్త గ్రామాలను గుర్తిస్తుంది. అయితే ఈ గ్రామాల పేర్లు రెవెన్యూ శాఖ జాబితాలో ఆటోమాటిక్‌గా చేరవు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనాభాలెక్కల గణన ప్రారంభమైన తర్వాత మాత్రమే అన్ని శాఖల వినియోగానికి అనుగుణంగా రెవెన్యూ గ్రామాన్ని చేర్చుతారు. అందువల్ల ఎప్పటికప్పుడు పెరుగుతున్న గ్రామాలు ఒకే డేటాబేస్‌లో నమోదుకావు.

లెక్కల్లో లేని గ్రామాలూ ఉన్నాయ్..

జనాభాలెక్కల్లో రెవెన్యూ గ్రామాలుగానే కాక.. జనావాసాలు ఉన్న.. జనావాసాలు లేని గ్రామాలుగా విభజిస్తుంది. సెన్సెస్ ప్రకారం సుమారు 50 వేల గ్రామాల్లో జనావాసమే లేదు. అలాగే మారుమూల ప్రాంతాల్లో అటవీ గ్రామాలు-కుగ్రామాలు కూడా ఉంటాయి. రాష్ట్ర అటవీ శాఖ అటవీ రిజర్వేషన్ల ప్రక్రియ ప్రకారం వీటిని గుర్తిస్తుంది. జనాభాలెక్కల పరిధిలోకి రాని ఇలాంటి గ్రామాలను సర్వే చేయని గ్రామాలు అంటారు. ఇలాంటి కారణాల వల్ల ప్రభుత్వ విభాగాలు జనాభా లెక్కల్లోని గ్రామాలను సాధారణంగా పరిగణనలోకి తీసుకోవు. జిల్లా అధికారులు, స్థానిక యంత్రాంగం అందించిన సమాచారాన్నే ఎక్కువగా అనుసరిస్తాయి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం, 5-8-2017





షింహాలు

రఫ్ అండ్ టఫ్ జాబ్.. పోలీసుద్యోగం! క్రిమినల్స్‌ని డీల్ చెయ్యాలి. పాలిటిక్స్‌ని డీల్ చెయ్యాలి. పబ్లిక్‌లో ప్రతివాడికీ ఓ 'పెద్దమనిషి' ఉంటాడు. ఆ పెద్దమనిషినీ డీల్ చెయ్యాలి. ఇన్ని చెయ్యాలంటే.. ఎంత డేరింగ్‌గా ఉండాలి? ఎంత డోన్ట్ కేరింగ్‌గా ఉండాలి. సినిమాల్లో అయితే మహేష్ బాబు 'పోలీస్' అనగానే అంతా గప్‌చుప్ అయిపోతారు. 'నేనేరా పోలీస్.. ఆ..' అని సాయికుమార్ అనగానే.. అంతా సెట్‌రైట్ అయిపోతారు. రియల్ లైఫ్‌లో అలా నడవదు. నిజంగా అలా ఉండదా? ఉంటుంది.. ఇదిగో ఇలాంటి 'షి'ంహాలు ఉంటే.. పవరున్నవాడైనా, పొగరున్నవాడైనా దారికి రావాల్సిందే. ఇటీవలి కాలంలో అలా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కే పేరు తెచ్చిన కొందరు మహిళా పోలీస్‌ల సాహసాలు.. స్వాభిమానాల సంఘటనలు, ప్రతిఘటనలు ఇవి.

1 శ్రేష్ఠ ఠాకూర్

డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్యానా సర్కిల్ ఆఫీసర్ (బులంద్‌షహర్)
2017 జూన్

హెల్మెట్ లేకుండా బండి నడుపుతున్న వాళ్ల మీద యాక్షన్ తీసుకుంటున్నారు శ్రేష్ఠ. 'పోనివ్వమ్మా.. పోలీసమ్మా' అన్నారు బీజేపీ వాళ్లు సీన్‌లోకి వచ్చి. 'మీరెవరు?' అన్నారు శ్రేష్ఠ. 'స్టేట్‌లో పవర్ మాదే' అన్నారు వాళ్లు. 'పవర్‌లో ఉన్నవాళ్లయితే పర్‌ఫెక్ట్‌గా ఉండాలి కదా' అన్నారు శ్రేష్ఠ. బీజేపీ లీడర్స్‌కి, శ్రేష్ఠకీ గొడవైంది. అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. జూలైలో శ్రేష్ఠకు ట్రాన్స్‌ఫర్ అయింది! బులంద్‌షహర్ నుంచి ఆమెను బార్రైచ్ పంపించారు. శ్రేష్ఠపై బీజేపీ నాయకులు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్‌కు కంప్లెంట్ చెయ్యగానే ఆయన వెంటనే ఏమీ యాక్షన్ తీసుకోలేదు. స్టేట్‌లో 244 మంది పోలీసు అధికారులకు బదలీలు అయ్యాయి. సింపుల్‌గా ఆ లిస్టులో శ్రేష్ఠ పేరును చేర్చారు. శ్రేష్ఠ వర్కింగ్ ఏరియా అయితే మారింది కానీ, ఆమె వర్కింగ్ స్పిరిట్ మారలేదు. బార్రైచ్‌కు బదలీ చేశాక ఫేస్‌బుక్‌లో ఇలా రాసుకున్నారు శ్రేష్ఠ.

'బార్రైచ్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ ప్రాంతం నేపాల్ బార్డర్‌లో ఉంటుంది. డోన్ట్ వర్రీ మై ఫ్రెండ్స్. నేను సంతోషంగా ఉన్నాను. నా పనికి ఇది గుర్తింపుగా భావిస్తున్నాను. మీ అందరికీ బార్రైచ్‌కు నా ఆహ్వానం'.

2 మోనికా సేన్

ప్రొబేషనరీ ఐ.పి.ఎస్. ఆఫీసర్
జూలై 12, 2017

రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్యాంగ్‌స్టర్ ఆనంద్ పాల్ సింగ్‌ను ఎవరో చంపేశారు. ఆ ఘటన హింసకు దారి తీసింది. షాపుల్ని, బస్సుల్నీ, ప్రత్యర్థి గ్యాంగ్ అనుచరుల ఇళ్లను ధ్వంస చేస్తున్నారు ఆనంద్‌పాల్ మనుషులు. శాంతిభద్రతల్ని అదుపు చెయ్యడం కోసం ఆనంద్‌పాల్ అనుచరుల్ని అదుపులోకి తీసుకున్నారు మోనికా! 'ఏం ఆఫీసర్... బతకడానికేనా?' అని హయ్యర్ సర్కిల్స్ నుంచి ఫోన్. 'డ్యూటీనే నా బతుకు' అన్నారు మోనికా. 'నా డ్యూటీని నన్ను చెయ్యనివ్వండి' అనీ అన్నారు. అంతకు ముందు మార్చిలో ఇంకో ఘటన జరిగింది. మోనికా అక్రమ సారా వ్యాపారులను అడ్డుకున్నారు. వాళ్ల తరపున బీజేపీ నాయకుడొకరు ఆమెను బెదిరించాడు. చూసీ చూడనట్టు పొమ్మన్నాడు. 'చూశాక, ఇక పోయేది లేదు' అని అతడిపై కేసు పెట్టి, అరెస్ట్ చేశారు మోనికా.

3 రూపా మౌద్గిల్

కర్నాటక డి.ఐ.జి. (ప్రిజన్స్)
17 జూలై 2017

శశికళ పవర్‌ఫుల్. ఆమె చుట్టూ ఉన్న వాళ్లు పవర్ ఫుల్. జైలు నిబంధనలకు విరుద్ధంగా శశికళ సకల సౌకర్యాలూ అనుభవిస్తున్నారనీ, తన పై అధికారులే భారీ మొత్తంలో లంచాలు తీసుకుని ఆమెకు సహకరిస్తున్నారని రూప ధైర్యంగా బయటపెట్టారు. రూప ఆరోపణలపై విచారణ మొదలైంది. అది పూర్తయ్యేలోపే రూప, ఆమె సీనియర్ డి.జి. సత్యనారాయణరావు అక్కడి నుంచి ఇంకో చోటికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 'నేనెక్కడైనా ఇంతే' అని రూప ధైర్యంగా ఓ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చి వెళ్లారు.

4 ఉషా సోమ్‌వంశీ

సబ్ ఇన్‌స్పెక్టర్
జూలై 2017

జబల్‌పూర్ (మధ్యప్రదేశ్)లోని దుమ్నా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉషా సోమ్‌వంశీ. అద్దాలకు టింటెడ్ ఫిల్మ్ అంటించుకుని వెళుతున్న ఓ కారును అడ్డుకున్నారు. కారులో ఉన్నవారికి పెనాల్టీ రాశారు. కారులో ఉన్నవారు పలుకుబడి ఉన్నవారి పిల్లలు. 'మాతో పెట్టుకోకు ఆఫీసర్' అని చెప్పారు. 'పెట్టుకోడానికే నేనుంది' అని ఆమె కారు కీస్ తీసుకున్నారు. ఇదంతా వైరల్ అయింది. ఆ వెంటనే ఆమె ట్రాన్స్‌ఫర్ అయింది.

5 చారూ నిగమ్

ఐ.పి.ఎస్., గోరఖ్‌పూర్ సర్కిల్ ఆఫీసర్
మే 2017

చారూ నిగమ్ ఝాన్సీలో పని చేసేటప్పుడు ఇల్లీగల్ లిక్కర్ మాఫియాను పరుగులు తీయిస్తుంటే పనిష్మెంట్‌గా గోరఖ్‌పూర్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. మే నెలలో ఇక్కడా ఆమె తన తఢాకా చూపించారు. రోడ్డు మీద నిరసన చేస్తూ ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న వారిని ఆమె పక్కకు తోసేశారు. 'మా నాయకుడు వస్తున్నాడు' అని చెప్పినా ఆమె వినలేదు. ఆ నాయకుడు బీజేపీ ఎమ్మెల్యే రాధా మోహన్ అగర్వాల్. వచ్చీ రాగానే చారూపై విరుచుకు పడ్డాడు. 'లిమిట్స్ దాటకు' అని హెచ్చరించాడు. అతడి మోటు భాషకు చారూ ఖిన్నురాలయ్యారు. వెంటనే సర్దుకున్నారు. రాబోయిన కన్నీటిని ఆపుకున్నారు. 'ఆ నీటి తెర డ్యూటీలో నేను బలహీనమైనందుకు కమ్మినది కాదు, స్త్రీగా నా ఉద్యోగానికి ఒక సంకేతం' అని ఆమె ధైర్యంగా చెప్పుకున్నారు.

చారూ రూర్కీ ఐఐటిలో బీటెక్ చేశాక మనసు మార్చుకుని మరీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చారు.

దేశంలో మహిళా పోలీసులు
(2016 జనవరి 1 నాటికి)

పోలీసు శాఖలో మహిళా పోలీసుల శాతం	7.1
మహిళా ఐ.పి.ఎస్. ఆఫీసర్ల సంఖ్య	296
మహిళా పోలీసుల సంఖ్య	1,22,912

ఇన్‌పుట్స్: బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఈ బూరో్య అధినేత కూడా మహిళా ఐ.పి.ఎస్. ఆఫీసరే! పేరు **మీరా బోర్వాంకర్**)

6 సంగీతా కాలియా

ఐ.పి.ఎస్., ఫతెహాబాద్ ఎస్.పి.
నవంబర్ 2015

హర్యానా హెల్త్ మినిస్టర్ అనిల్ విజ్‌తో పడింది సంగీతకు. జిల్లా ఫిర్యాదులు, పౌర సంబంధాల కమిటీ సమావేశం జరుగుతోంది. ఆ సమావేశంలో అనిల్ విజ్ ఉన్నాడు. అక్కడే ఎస్.పి. సంగీత ఉన్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యను సంగీత ఆ హెల్త్ మినిస్టర్ దృష్టికి తెచ్చింది. ఆయనకు కోపం వచ్చింది. 'ఇక్కడి నుంచి వెళ్లిపో' అన్నాడు. 'మీరు పొమ్మంటే పోడానికి నేనిక్కడి రాలేదు. నా జాబ్ నేను చేయడానికి వచ్చాను' అని అక్కడే హఠం వేసుకుని కూర్చున్నారు సంగీత. మినిస్టర్ మనసులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆమెను ట్రాన్స్‌ఫర్ చేయించాడు.

7 దమయంతీ సేన్, ఐ.జి.,

అడ్మినిస్ట్రేషన్, పశ్చిమబెంగాల్
ఏప్రిల్ 2012

2012 తర్వాత దమయంతీ సేన్ కామ్ అయిపోయారని కాదు. ఆ ఏడాది ఆమె చూపిన తెగువ ఆమె కెరీర్‌లోనే ముఖ్యమైంది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 'పార్క్ స్ట్రీట్ రేప్' కేసులో దమయంతి ఇచ్చిన నివేదిక, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటనకు విరుద్ధంగా ఉంది. తన ప్రతిష్ఠను దెబ్బతియ్యడానికి ఈ రేప్ కేసును వాడుకున్నారని మమత అనడం, 'కేసును పరిశీలిస్తే అలాంటిదేమీ లేదు' అని దమయంతి నివేదిక ఇవ్వడం అప్పట్లో పెద్ద చర్చ అయింది. 'ఇంత రచ్చ చేశావ్ ఏంటి తల్లీ' అని డిపార్ట్‌మెంట్ తలకొట్టుకుంటే.. దమయంతి మాత్రం 'ఉన్న విషయమే చెప్పాను' అని సింపుల్‌గా అన్నారు. అప్పుడు దమయంతీ సేన్ జాయింట్ కమిషనర్. ఆ పోస్టు నుండి ఆమెను అంతకన్నా తక్కువ ప్రాముఖ్యం ఉన్న డి.ఐ.సి. ట్రెనింగ్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. తిరిగి 2014లో ప్రభుత్వం ఆమెకు ఇలాంటి కీలకమైన కేసునే అప్పగించింది.

8 ఈషా పంత్, ఐ.పి.ఎస్. ఆఫీసర్

ప్రియాంక చోప్రా పోలీస్ ఆఫీసర్‌గా నటించిన 'జై గంగాజల్' చిత్రం ఈషా డైనమిజం ఆధారంగా తయారైందే. అప్పట్లో ఆమె భూపాల్ ఆఫీసర్. ప్రస్తుతం కర్నాటకలో విధులు నిర్వహిస్తున్నారు.

9 మెరిన్ జోసెఫ్

కేరళ ఐ.పి.ఎస్. ఆఫీసర్

'అందాల రాశులైన మన ఐ.పి.ఎస్. ఆఫీసర్‌లు' అంటూ ఒక వార్తా పత్రిక ఓ పెద్ద జాబితా ఇవ్వడాన్ని మెరిన్ తీవ్రంగా నిరసించారు. ట్విట్టర్‌లో ఆ పత్రికపై విరుచుకు పడ్డారు.

10 కిమ్ శర్మ, బిహార్ ఐ.పి.ఎస్. ఆఫీసర్

ఒరిజినల్ లేడీ సింగం అని పేరు. ఆమె అభిమానులు ఆమె పేరుతో 'హెరాస్‌మెంట్' అనే ఒక ఫేస్‌బుక్ అకౌంట్‌నే సృష్టించారు.



ఫస్ట్ ఉమన్: కిరణ్ బేడీ

ఇండియాలో తొలి మహిళా ఐ.పి.ఎస్. అధికారి. బేడీని 'క్రేన్ బేడీ' అనేవారు. ఢిల్లీలో రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ఆమె భారీ క్రేన్‌లతో ఎప్పటికప్పుడు ఎత్తేయించేవారు. అందుకు ఆ పేరు వచ్చింది. తీహార్ జైల్‌లో తొలిసారి సంస్కరణలను ప్రవేశపెట్టింది కూడా బేడీనే. 2015 ఢిల్లీ ఎన్నికలకు ముందు బేడీ బీజేపీలో చేరారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆమె పుదుచ్చేరి గవర్నర్‌గా ఉన్నారు.



కంచన్ చౌదరి భట్టాచార్య

దేశంలో డైరెక్టర్ జనరల్ ర్యాంక్‌కి చేరుకున్న తొలి మహిళా పోలీస్ ఆఫీసర్ కంచన్. 2014లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. 1980ల నాటి టెలీ సీరియన్ 'ఉడాన్'కు ఆమె జీవితమే ఇన్‌స్పిరేషన్. కిరణ్ బేడీ తర్వాత రెండో మహిళా ఐ.పి.ఎస్. కంచన్.

ఆత్మీయం

మన ఆయుష్షు మన చేతుల్లోనే!



అన్నీ ఉన్నా ఆయుష్షు లేకపోతే ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే ఈ లోకంలో ప్రతి ఒక్కరూ తాము ఆయురారోగ్యైశ్వర్యాలతో సుఖంగా జీవించాలని కోరుకుంటారు. అది సహజం. అందుకే సంకల్పంలో కూడా అదే చెప్పుకుంటారు. మనం పెద్దలకూ, పూజారులకూ నమస్కరించినప్పుడు వారు 'ఆయుష్మాన్ భవ' అని ఆశీర్వదిస్తారు. అయితే లోకంలో కొందరు పూర్ణాయుష్కులుగానూ, మరికొందరు అర్ధాయుష్కులుగానూ, ఇంకొందరు అల్పాయుష్కులుగానూ ఉంటున్నారు. అందుకు కారణం వారి అలవాట్లు, నడవడిక అన్నింటికీ మించి విధిరాత.

'మానవుడు జీవించి ఉంటే వంద సంవత్సరాలకైనా ఆనందాన్ని పొందగలడు అన్న లోకోక్తి సత్య దూరం కాదని నాకు తోస్తోంది..!' అని లంకలోని అశోకవనంలో రావణ బందీగా ఉన్న సీతాదేవి రామదూతగా తన వద్దకు వచ్చిన హనుమంతునితో అన్న మాటలు ఇవి. వ్యాసభారతంలో ధృతరాష్ట్రుడు విదురుని ఓ ప్రశ్న అడుగుతాడు.. 'వేదాలు మానవునికి నూరు సంవత్సరాల ఆయువు అని చెబుతున్నాయి. కానీ, మానవుడు ఏ కారణం చేత పూర్ణాయుర్దాయం పొందలేకపోతున్నాడు?' అని. దీనికి విదురుని సమాధానం... 'గర్వము, హద్దుమీరి పలుకుట, మహాపరాధాలు చెయ్యటం, క్రోధం, తన సుఖమే చూసుకోవడం, నమ్మిన వారిని చెరచటం అనే ఆరు లక్షణాలు పదునైన కత్తుల వంటివి. దేహం ఆయువును ఇవి నశింపజేస్తాయి. నిజానికి మానవుని చంపేది ఈ లక్షణాలే, మృత్యువు కాదు. కాబట్టి ముందు మనలోని ఈ ఆరు అవలక్షణాలనూ వెళ్లగొట్టగలిగితే మన ఆయుష్షు ఆ మేరకు పొడిగించుకోగలిగినట్లే!

గుడ్ ఫుడ్

ఇమ్యూనిటీని పెంచే చిలగడదుంప

ఉడకబెట్టుకొని తింటే అద్భుతంగానూ, నిప్పుల మీద కాల్చుకుని తింటే పరమాద్భుతంగానూ ఉండే చిలగడదుంప అంటే చాలామందికి ఇష్టమే. వేర్వేరు ప్రాంతాల్లో దీనికి గణుసుగడ్డ, మోరంగడ్డ అంటూ రకరకాల పేర్లు కూడా ఉన్నాయి. కేవలం రుచి విషయంలోనే కాదు... ఆరోగ్యపరంగానూ దీని విశిష్టతలు ఎక్కువే.

- చిలగడదుంపలో విటమిన్–బి6 పాళ్లు పుష్కలం. విటమిన్–బి6 అనేది హోమోసిస్టిన్ అనే రసాయనం దుష్ప్రభావాన్ని తగ్గిస్తుంది. గుండెజబ్బులు వచ్చేందుకు ఈ హోమోసిస్టిన్ కారణమవుతుంది. అంటే చిలగడదుంప వల్ల అనేక గుండెజబ్బులు నివారితమవుతాయని నిర్ద్వంద్వంగా తేలింది.
- చిలగడదుంపలో బీటా–కెరొటిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అవి శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి.
- చర్మంలోని కణాలను గట్టిగా దగ్గరగా పట్టి ఉంచే కొలాజెన్ ఉత్పత్తికి విటమిన్–సి బాగా దోహదపడుతుంది. అందుకే విటమిన్–సి పోషకాలను పుష్కలంగా తీసుకునేవారి చర్మం చాలా కాలం యౌవనంగా ఉంటుందన్నమాట. చిలగడదుంపలోనూ విటమిన్–సి పాళ్లు చాలా ఎక్కువ. అందుకే దీన్ని తినేవారి చర్మం అంత త్వరగా ఏజింగ్ దుష్ప్రభావాలకు గురికాదు.
- చిలగడదుంపలో శరీరంలోని విషాలను బయటకు పంపే గుణం ఉంది. ఒత్తిడి వల్ల ఒంట్లో పేరుకునే విషాలను కూడా చిలగడదుంప తొలగిస్తుంది.
- చిలగడదుంపలో ఐరన్ పాళ్లు ఎక్కువ. అందుకే రక్తహీనత ఉన్నవారు దీన్ని తీసుకోవడం వల్ల ఒంట్లో రక్తహీనత తగ్గడంతో పాటు, తగినన్ని ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాల ఉత్పాదన జరుగుతుంది.
- ఇందులోని మెగ్నీషియమ్ మన ఒంట్లోని ధమనులు, ఎముకలు, గుండె, నరాల పనితీరును మెరుగుపరుస్తుంది.



బ్యూటిప్స్

ఇంట్లోనే వాక్సింగ్

చేతుల మీద అవాంఛిత రోమాలను తొలగించడం పెద్ద పనే. కానీ ఇంట్లోనే వ్యాక్సింగ్ చేసుకోవచ్చు.

ఒక టీ స్పూను నిమ్మరసంలో ఒక టీ స్పూను చక్కెర కలిపి వేడి చేయాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే వ్యాక్సింగ్ నైఫ్‌తో కాని స్పూను వెనుక భాగంతో కాని చేతులకు పట్టించి వెంటనే కాటన్ క్లాత్ కప్పేసి గట్టిగా అదమాలి. వ్యాక్సింగ్ మిశ్రమం చల్లారి ఆరే కొద్దీ చర్మానికి క్లాత్ అతుక్కుపోతుంది. పూర్తిగా ఎండిన తరువాత క్లాత్ ఒక వైపును పట్టుకుని గట్టిగా లాగేయాలి. ఇలా చేయడం వల్ల రోమాలన్నీ క్లాత్‌కు అతుక్కుని వచ్చేస్తాయి. ఇది కొంచెం నొప్పిగా అనిపిస్తుంది కాని క్రమంగా రోమాల కుదుళ్లు బలహీన పడి పెరుగుదల ఆగిపోతుంది. వ్యాక్సింగ్ పట్టించేటప్పుడు రోమాలు ఏ దిశగా ఉన్నాయన్న సంగతిని గుర్తించి అదే దిశగా అప్లై చేసి, క్లాత్ లాగేటప్పుడు వ్యతిరేక దిశగా లాగాలి. వ్యాక్సింగ్ చేసినప్పుడు ర్యాష్ వచ్చినట్లయితే వెంటనే రెండు చుక్కల గ్లిజరిన్ రాయాలి. వ్యాక్సింగ్ చేయడానికి క్లాత్‌కు బదులు వ్యాక్సింగ్ టిష్యూలను వాడవచ్చు.



లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! తను, నేను 4 ఇయర్స్ నుంచి చాలా మంచి ఫ్రెండ్స్. ఒకసారి ఇద్దరికీ గొడవ జరిగి మాట్లాడ్డం మానేశాడు. అప్పుడు తనకి నాపై లవ్ ఫీలింగ్ కలిగిందట. తను నాకు చెప్పాడు. అప్పుడు నేను రిజెక్ట్ చేశా. అయినా తను నన్ను వదలకుండా కేరింగ్ తీసుకునేవాడు. నేను అడగకుండానే హెల్ప్ చేసేవాడు. తను చూపించే ప్రేమకి నాకూ ఆ ఫీలింగ్ కలిగింది. ఎక్స్‌ప్రెస్ చేశా. అయితే.. 'ఇప్పుడు నీ మీద ఎలాంటి ఫీలింగ్ లేదు. ఒకప్పుడు ఉండేది సారీ' అంటున్నాడు. కానీ తన పర్స్‌లో ఇంకా నా ఫోటో ఉంది. నేను ఇచ్చిన గిఫ్టులు అన్నిటినీ మెమరీగా దాచుకున్నాడు. ఒకప్పుడు నేనే తన ప్రపంచం. కానీ ఈ మధ్య నేను కాల్ చేస్తే వర్క్ ఉందని అబద్ధం చెబుతున్నాడు. అసలు నాపై తనకు ఉన్న అభిప్రాయం ఏంటి? ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటారు సార్ ప్లీజ్ చెప్పండి?

\- నీరజ



గేమ్స్ ఆడుతున్నాడు!

నువ్వు తన విషయంలో వీక్ అని తెలుసుకుని గేమ్స్ ఆడుతున్నాడు!

పట్టించుకోనట్లు ఉంటే నువ్వు నిండా మునిగిపోయి 'శరణం శరణం..' అని వెంటపడతావని తెలిపోయింది!!

''మరి ఇప్పుడు నీరజ ఏం చెయ్యాలి సార్?''

రివర్స్ గేమ్ ఆడాలి!

''అంటే.. వాట్ చెయ్యాలి?''

ఫుల్‌గా అంజాన్ కొట్టాలి!!

''అంజాన్?''

'నువ్వు ఎవరు రా' అన్నట్లు పట్టించుకోకుండా ఉండాలి!!

''అప్పుడు ఏమౌతుంది సార్?''

గిలగిలా కొట్టుకుంటాడు.. జ్వరం వస్తుంది!!

''లవ్ డాక్టర్‌కి లెటర్ రాస్తాడు...''

ఎస్!!

''అప్పుడు మీ చెల్లెలి రివెంజ్ మీరు గడ్డి పెట్టి తీర్చుకుంటారు!!''

ఎస్!!

''ఇదిగోండి సార్ అబ్బాయిలను అంతగా టార్చర్ పెట్టే మీకు... అరటి ఆకు! తినండి!!''



లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		9	6			2		
8				1	2	7		5
	2	5	7	9		4	3	
			4		9	8	5	
		2				9		
	5	3	1		7			
	1	4		7	6	3	8	
2		7	8	4				9
		8			1	5		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	3	4	8	1	5	7	9	6
9	5	1	2	7	6	3	8	4
7	6	8	9	3	4	1	5	2
4	2	3	5	8	1	9	6	7
5	1	7	3	6	9	4	2	8
6	8	9	7	4	2	5	1	3
8	4	5	1	2	3	6	7	9
3	9	2	6	5	7	8	4	1
1	7	6	4	9	8	2	3	5

కిచెన్ కుచేల

అటుకులు అతుకేసే స్నేహాన్ని మించిన స్నేహం లేదు.
అంటే, పేదరికం స్నేహానికి అడ్డం రాదు.
అంత పవిత్రమైంది అటుకుల స్నేహం.
శ్రీకృష్ణుడిని కలవడానికి వెళ్లిన
కుచేలుడు తీసుకెళ్లిన కానుక అటుకుల మూట.
పంచభక్ష్య పరమాన్నాలు తినే శ్రీకృష్ణుడు అటుకులు తిని
తన్మయత్వం చెందాడు. రేపు స్నేహితుల దినోత్సవం.
అటుకులు పంచండి. స్నేహం పెంచండి.





హాట్ పోహా!

కావల్సినవి: అటుకులు-4 కప్పులు; పచ్చిమిర్చి - 2; ఎండుమిర్చి - 3; జీడిపప్పు - 3 టేబుల్ స్పూన్లు; శనగపప్పు - 5 టేబుల్‌స్పూన్లు; పుట్నాల పప్పు - 5 టేబుల్ స్పూన్లు; కరివేపాకు - 2 రెమ్మలు; పసుపు - అర టీ స్పూన్; ఉప్పు - టీ స్పూన్; ఆలివ్ నూనె-4 టేబుల్ స్పూన్లు

తయారీ: ● కడాయి పొయ్యి మీద పెట్టి నూనె వేసి వేడి చేయాలి ● దీంట్లో పల్లీలు వేసి వేయించాలి ● తర్వాత ఎండుమిర్చి, పచ్చిమిర్చి, జీడిపప్పు వేసి వేయించాలి ● ఆ తర్వాత కరివేపాకు, పసుపు, పుట్నాలపప్పు వేయించి మంట తగ్గించాలి ● ఉప్పు కలిపి ఆ తర్వాత కప్పు అటుకులు వేసి కలపాలి ● అటుకులకు పసుపు, నూనె పట్టిన తర్వాత మిగతా అటుకులు వేసి కలపాలి ● ఇలా చేయడం వల్ల మిగతా అటుకులకంతా పోపు మిశ్రమం బాగా పడుతుంది ● 5-8 నిమిషాల సేపు అలా సన్నని మంట మీద ఉంచి, అడుగుమాడకుండా మధ్య మధ్య కలుపుతూ ఉండాలి ● తర్వాత మంట తీసేసి, చల్లారాక నిమ్మముక్కతో సర్వ్ చేయాలి.

దోసె



కావల్సినవి: బాయిల్డ్ రైస్ – కప్పు; అటుకులు – అర కప్పు; మినప్పప్పు – 2 టేబుల్ స్పూన్లు; మజ్జిగ – కప్పు; బేకింగ్ సోడా – పావు టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్; నూనె – తగినంత

తయారీ: ● బియ్యం కడిగి నీళ్లుపోసి నానబెట్టాలి ● మరోగిన్నెలో అటుకులు, మినప్పప్పు వేసి నీళ్లతో కడిగి వడబోయాలి ● దీంట్లో మజ్జిగను కలిపి 3 గంటల సేపు నానబెట్టాలి ● ముందుగా బియ్యం, తర్వాత నీళ్లను వడకట్టి అటుకుల మిశ్రమం మిక్సర్‌జార్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి ● పిండిని గిన్నెలోకి తీసుకున్న తర్వాత బేకింగ్ సోడా, ఉప్పు కలపాలి ● 4 గంటలసేపు పిండిని అలాగే ఉంచి, ఆ తర్వాత దోసెలు వేసుకోవాలి ● పొయ్యి మీద నాన్‌స్టిక్ పెనం పెట్టి, పైన 2–3 చుక్కల నూనె వేసి మెత్తటి బ్రష్ లేదా గుడ్డతో తుడిచేయాలి ● తర్వాత గుంట గరిటతో పిండి తీసుకొని పెనం మీద వేసి, ఆ పైన గుండ్రంగా పిండి విస్తరించేలా గరిటను తిప్పాలి ● తర్వాత దోసె చుట్టూత నూనె వేసి, కాలనివ్వాలి ● ఇష్టాన్ని బట్టి రెండో వైపు కూడా కాల్చుకోవాలి. కొబ్బరి పచ్చడి లేదా సాంబార్‌తో వడ్డించాలి.

రోల్స్



కావల్సినవి: గుడ్డు – 1; అటుకులు – పావు కప్పు; బంగాళదుంప ముక్కలు – 100 గ్రాములు; పచ్చిమిర్చి – 2; పల్లీలు – 2 టేబుల్ స్పూన్లు; ఆమ్చూర్ – పావు టీ స్పూన్; గరం మసాలా – పావు టీ స్పూన్; కారం – పావు టీ స్పూన్; బ్రెడ్ క్రంబ్స్ – 2; నూనె – వేయించడానికి తగినంత; కొత్తిమీర – కొన్ని ఆకులు

తయారీ: ● బంగాళదుంపపై పొట్టు తీసి, ఉడకబెట్టాలి ● తర్వాత గరిటతో గుజ్జులా చేయాలి ● అటుకులను కడిగి, జల్లెడలో పోయాలి ● కడాయిలో నూనె పోసి, స్టౌ మీద పెట్టి పల్లీలు వేయించాలి ● దీంట్లో అటుకులు, పల్లీలు, మిర్చి, కరివేపాకు, మెత్తగా చేసిన బంగాళదుంపల గుజ్జు వేసి బాగా కలపాలి ● ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ చేత్తో రోల్‌లా చేయాలి ● పొయ్యిమీద కడాయి పెట్టి నూనె పోసి కాగనివ్వాలి ● సిద్ధంగా ఉంచుకున్న అటుకుల రోల్స్‌ని గుడ్డు సొనలో ముంచి, కాగుతున్న నూనెలో వేసి అన్ని వైపులా వేయించాలి ● టొమాటో సాస్ లేదా పచ్చడితో వేడి వేడిగా వడ్డించాలి.

కట్లెట్



కావల్సినవి: అటుకులు – కప్పు; శనగపిండి – 2 1/2 కప్పులు; క్యాప్సికమ్ తరుగు – పావు కప్పు; అల్లం ముద్ద – అర టీ స్పూన్; పచ్చిమిర్చి పేస్ట్ – అర టీ స్పూన్; కారం – టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; జీలకర్ర – 1/4 టీ స్పూన్; కొత్తిమీర – పావు కప్పు; పుదీనా ఆకులు – కొన్ని (తరగాలి); టీ స్పూన్ – పంచదార; ఉప్పు – తగినంత; నూనె – వేయించడానికి తగినంత

తయారీ: ● అటుకులను కడిగి 2 నిమిషాలు జల్లెడలో నీళ్లన్నీ పోయేదాక ఉంచాలి ● ఒక గిన్నెలో మిగిలిన దినుసులు, పిండి అన్నీ వేసి కలపాలి ● దీంట్లో అటుకులు కూడా వేసి బాగా కలిపి ముద్దలా చేయాలి ● సుమారు 8 నుంచి 10 చిన్న చిన్న ఉండలు చేసి, చేత్తో అదమాలి ● పొయ్యి మీద కడాయి పెట్టి, నూనె పోసి కాగనివ్వాలి ● దీంట్లో సిద్ధం చేసుకున్న పట్టీలను వేసి రెండువైపులా ముదురు గోధుమరంగు వచ్చేవరకు వేయించి తీయాలి ● పుదీనా లేదా టోమాటో చట్నీ లేదా కెచప్‌తో వేడి వేడిగా అటుకుల కట్లెట్‌ను సర్వ్ చేయాలి.


దద్ధ్యోజనం



కావల్సినవి: అటుకులు - కప్పు; పెరుగు - 3 కప్పులు; ఆవాలు - టీ స్పూన్; మినప్పప్పు - టేబుల్ స్పూన్; శనగపప్పు - టేబుల్ స్పూన్; ఎండుమిర్చి - 3; నూనె - టేబుల్ స్పూన్; కరివేపాకు - రెమ్మ; ఉప్పు - తగినంత

తయారీ: ● అర టీ స్పూన్ ఉప్పు 2 కప్పుల నీళ్ళలో కలిపి, అటుకులు నిమిషంసేపు నానబెట్టాలి ● తర్వాత అటుకులను వడకట్టాలి ● పెరుగును గరిటతో మృదువుగా అయ్యేంత వరకు చిలికి, కొద్దిగా ఉప్పు కలపాలి ● మందపాటి గిన్నె పొయ్యి మీద పెట్టి నూనె వేసి వేడి చేయాలి ● దీంట్లో ఆవాలు, మినప్పప్పు, శనగపప్పు, పల్లీలు వేయించి మంట తీసేయాలి ●ఎండుమిర్చి, కరివేపాకు వేసి కలిపి 10-20 సెకన్లు అలాగే ఉంచాలి ● దీంట్లో నానబెట్టిన అటుకులు, పెరుగు వేసి కలపాలి ● కావాలనుకుంటే పోపులో పావు టీ స్పూన్ శొంఠి వేసుకోవచ్చు.

లడ్డు



కావల్సినవి: అటుకులు - కప్పు; బెల్లం - ముప్పావు కప్పు; యాలకులు - 2 (పొడి చేయాలి); ఎండుకొబ్బరి తురుము - అర కప్పు; నెయ్యి - పావు కప్పు; జీడిపప్పు - 10; కిస్‌మిస్ - 10

తయారీ: ● అటుకులను వేయించాలి. దీంట్లో కొబ్బరి తురుము కలిపి సన్నని మంట మీద మళ్లీ కొద్దిగా వేయించాలి ●సువాసన వస్తుండగా మంట తీసేసి చల్లారనివ్వాలి ● యాలకుల పొడి, బెల్లం కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని ప్లేట్‌లోకి తీసుకోవాలి ● పాన్‌లో నెయ్యి, జీడిపప్పులు వేయించిన తర్వాత కిస్‌మిస్ వేసి మంట తీసేయాలి ● దీంట్లో మిగిలినవన్నీ వేసి కలపాలి ●చిన్న చిన్న ముద్దలు తీసుకొని, బాల్స్ చేయాలి ● దీంట్లో వేయించిన ఇతర నట్స్ కూడా కలుపుకోవచ్చు ● త్వరగా, సులువుగా, రుచిగా ఈ లడ్డూలను తయారుచేసుకోవచ్చు.

స్వీట్ పోహా!



కావల్సినవి: అటుకులు – కప్పు; బెల్లం – అర కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; కొబ్బరిపొడి – 2 టేబుల్ స్పూన్లు; జీడిపప్పులు – 8 (సగం పలుకుగా చేయాలి); బాదం పప్పులు – 7 (సన్నగా తరగాలి); నెయ్యి – అర టేబుల్ స్పూన్లు.


తయారీ: ● అటుకులను కడిగి, జల్లిలో వేసి, పూర్తిగా నీళ్లు పోయాక గిన్నెలోకి తీసుకోవాలి ● వీటిపైన మళ్లీ 2 టేబుల్ స్పూన్ల నీళ్లు చల్లాలి ● పది నిమిషాల తర్వాత పొయ్యిమీద మూకుడు పెట్టి, దాంట్లో నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, బాదం పలుకులు వేయించాలి ● దీంట్లో కొబ్బరి పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అర కప్పు నీళ్లలో బెల్లం వేసి కరిగించాలి. సన్నని మంట మీద 8 నిమిషాల సేపు ఉంచితే బెల్లం పూర్తిగా కరుగుతుంది ● ఈ బెల్లం పాకంలో నానిన అటుకులు, కొబ్బరి తురుము, వేయించిన నట్స్ వేసి కలపాలి ● వడ్డించే ముందు మరిన్ని నట్స్ వేసుకోవచ్చు ● ఎండుకొబ్బరి బదులుగా పచ్చికొబ్బరి తురుము కూడా వాడుకోవచ్చు.

చరిత్ర



హిరోషిమా ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న స్టూడెంట్స్

నాటి హిరోషిమా... నేటి హీరో సీమ



నేటి హిరోషిమా

అది 1945, ఆగస్టు 6వతేదీ. ఉదయం ఎనిమిదిన్నర. ఇది ఇండియా టైమ్ కాదు, జపాన్ టైమ్. యుద్ధమేఘాలు గగనతలాన్ని కమ్ముకుని ఉన్నాయి. ఎక్కడ రేడియో విన్నా, ఏ వార్తాపత్రిక చూసినా రెండవ ప్రపంచ యుద్ధం ముగియడానికి సిద్ధంగా ఉందనే సంకేతాలే. యుద్ధం ఎవరికి మేలు చేస్తుందో తెలియదు, కానీ కీడు మాత్రం చాలా మందికి చేస్తుంది. ఆ కీడంతా అమాయకులకే. ఏ పాపం పుణ్యం ఎరగని జీవులకే. ఒక దేశం మరో దేశంతో ఎందుకు యుద్ధం చేస్తుందో తెలియదు వాళ్లకు. ప్రపంచం మొత్తం ఎందుకు రెండుగా చీలిపోయిందో తెలియదు. తమ దేశం ఏ పక్షాన ఉందనే ప్రాథమిక వివరం కూడా ఏ కొద్దిమందికో తప్ప అందరికీ తెలియదు. వారికి తెలిసిందల్లా ఎప్పుడు ఏ విమానం గగనతలాన చక్కర్లు కొడుతుందోనని కళ్లు తల మీద పెట్టుకుని చూస్తూ ఉండడమే.

జపాన్‌లో ఆ రోజు విమానం ప్రొఫెల్లర్ల చప్పుడు ఆ దేశ పౌరులకు జానపద కథల్లోని గుర్రపు డెక్కల చప్పుడును తలపించజేస్తోంది. గుండె గుభిల్లుమంటుంటే పిల్లలు ఎక్కడ ఉన్నారో వెతికిపట్టుకుని తలదాచుకోవడానికి పరుగులు తీస్తున్నారు. సూర్యోదయమైందంటే ఏ శకలం ఎటు నుంచి వచ్చి తాకుతుందోనని ఒళ్లంతా చెవులు చేసుకుని చిటుక్కుమనే శబ్దం కోసం ఎదురు చూడడమే అయింది. ఆ క్రమంలో పెద్ద దేశాల అధినేతలంతా సమావేశమయ్యారనే వార్త వారి చెవుల్లో పన్నీటిని చల్లింది. ఇక యుద్ధం ముగిసినట్లేనట ఆశ నిండిన మాటలు అక్కడక్కడా వినిపిస్తున్నాయి.

ఇంతలో పెద్ద పెట్టున శబ్దం. పిశాచి రెక్కలు విచ్చినట్లు జపాన్ గగనతలం మీద చక్కర్లు కొట్టింది అమెరికన్ బాంబర్ బి–29. మరో నిమిషంలో వంద పిడుగులు ఒక్కసారిగా నేలకు తాకినట్లు 'లిటిల్ బాయ్' అనే ఆ బాంబు జపాన్ భూతలాన్ని తాకింది. షిరోషిమా నగరంలో 90 వేల భవనాలున్నాయి, 1900 అడుగుల ఎత్తు నుంచి శరాఘాతంలా దూసుకొచ్చిన లిటిల్‌బాయ్ తాకిడికి నగరం పేకమేడలా కుప్పకూలిపోయింది. ఎనభై వేల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. 35 వేల మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. తీవ్రమైన రేడియేషన్‌కు గురై రకరకాల అనారోగ్యాలతో ఏడాదిలోపు సంభవించిన మరో అరవై వేల మరణాలు కూడా లిటిల్‌బాయ్ పొట్టన పెట్టుకున్నవే.

ప్రపంచం ముందు ఒకే ఒక్క ప్రశ్న. ఇంతకీ పెద్ద దేశాల అధిపతులు కూర్చుని చర్చించి సాధించిందేమిటి? సోవియట్ యూనియన్ అధినేత స్టాలిన్, అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్ ట్రూమన్, గ్రేట్ బ్రిటన్ ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ (చర్చిల్ తర్వాత క్లెమెంట్ అట్లీ)... జర్మనీలో సమావేశమయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధానికి తెర దించడానికే సమావేశమయ్యారు. ఆ ఏడాది జూలై 27 నుంచి ఆగస్టు రెండవ తేదీ వరకు చర్చించారు. జపాన్ బేషరతుగా లొంగిపోవాలని డిమాండ్. అనధికారికంగా వారంతా జపాన్‌లో రాజరికాన్ని కొనసాగించడానికి ఆమోదం తెలిపిన వారే. కానీ చేసిందేమిటి? బేషరతుగా లొంగిపోవడానికి జపాన్ అంగీకారం తెలిపే లోపే అమెరికా అతి తెలివిగా ఆలోచించింది. యుద్ధంలో అవసరమవుతుందని సిద్ధం చేసుకున్న అణుబాంబులను వాడకపోతే ఎలా? ప్రయత్నం అంతా వృథా అయిపోదూ? ఇప్పుడు వాడకపోతే ఇక వాడే అవసరం రాదేమో! అణుబాంబును ప్రయోగించి చూడడానికి ఇంతకు మించిన మంచి తరుణం రాకపోవచ్చు. ఇప్పుడే ప్రయోగించాలి అనుకుంది. అంతే... హిరోషిమా మీద తొలి అణుబాంబును ప్రయోగించింది. ఆ భయోత్పాతం నుంచి బయటపడేలోపు నాగసాకి పట్టణం మీద ఫ్యాట్‌మ్యాన్ పేరుతో మరో అణుబాంబును ప్రయోగించింది.

నిజానికి జపాన్ అప్పటికి అగ్రదేశాధినేతల డిమాండ్‌ను ధిక్కరించే పరిస్థితిలో ఏ మాత్రం లేదు. యుద్ధానికి చరమగీతం పాడడానికి సిద్ధంగానే ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా చేసిన అణుదాడిని ఆ దేశపు ఆధిక్యభావన ప్రకటనలో భాగంగానే గుర్తించింది ప్రపంచం. ఇకపై ఇలాంటివి జరగడానికి వీల్లేదని శాంతికాముకులు చేసిన అనేక నిరసనల తర్వాత ఆగస్టు ఆరవ తేదీని ప్రపంచదేశాలన్నీ యాంటీ న్యూక్లియర్‌డేగా గుర్తు చేసుకుంటున్నాయి. జపాన్ ప్రజలు యుద్ధం మిగిల్చిన చేదు అనుభవాలను దీటుగా ఎదుర్కొంటూ నేలమట్టమైన నగరాలను పునర్నిర్మించుకున్నారు.



బాంబు ప్రయోగం



బాంబు తాకిడికి ధ్వంసమైన హిరోషిమా



సెల్ఫ్ చెక్

రాఖీని ఎలా కట్టాలి?



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టేసినంత ఈజీగా ఉండదు. ఒకరి క్షేమాన్ని ఒకరు కాంక్షిస్తూ సంప్రదాయబద్ధంగా చేసుకునే తంతు ఇది. మాటల్లో చెప్పలేని అభిమానానికి దేవుని అనుగ్రహాన్ని రంగరించి వేసే ఆత్మీయబంధనం.

1. మంత్రోచ్చారణతో పూజ చేసి ఆ కుంకుమను నుదుట దిద్ది, పూజాక్షతలను తల మీద వేసిన తర్వాత మాత్రమే రాఖీని కడతారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. సోదరులు తల మీద వస్త్రం ఉంచుకుని దాని మీద అక్షతలు వేయించుకోవాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. అన్నయ్యకు సోదరి హారతి ఇవ్వాలి, కర్పూరం పూర్తయ్యే వరకు వెలగనివ్వాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. కొబ్బరికాయకు నూలు దారాన్ని చుట్టి సోదరునికి ఇచ్చిన తర్వాత స్వీటు తినిపిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. సంప్రదాయ రాఖీ ఎరుపు, పసుపు దారం మధ్యలో గురివింద గింజ సైజులో వెల్‌వెట్ బాల్ ఉంటుంది. దీనిని బొమ్మనిరాఖీ అంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. ఈ పండగరోజు సోదరికి సోదరులు పాద నమస్కారం చేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. ఆడపడుచు పుట్టింటికి వెళ్లి రాఖీ కట్టడానికి సాధ్యం కాని పక్షంలో సోదరులే ఆమె ఇంటికి వచ్చి రాఖీ కట్టించుకుంటారు లేదా పోస్టులో పసుపు, కుంకుమ, రాఖీ పంపిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. సోదరునికి అన్నింటిలోనూ విజయం కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని సోదరి కోరితే, ఆదుకోవడానికి నేను ఉన్నాను అని సోదరుడు తెలియచేయడమే ఈ వేడుక ఉద్దేశం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. ఇది పైకి సన్నటి దారంలా కనిపించినప్పటికీ మనసుకు 'సున్నితమైన, బలమైన బంధం' అన్న భావనను సూచిస్తుంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో 'ఎ'లు ఆరు అంతకంటే ఎక్కువగా వస్తే మీ దృష్టిలో రక్షాబంధనం ఒక వేడుక మాత్రమే కాదు అనుబంధాల బంధనం కూడ. ఎదుటి వారి శ్రేయస్సును కోరి కట్టే రాఖీకి ప్రతిగా అవ్యాజమైన అనురాగాన్ని పొందుతున్నారనుకోవాలి.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
శనివారం :: 5-8-2017



నన్ను గెలవలేరు!

...అంతే కాదు. నాపై గెలుస్తాననుకోవడమూ కష్టమే! ఒకవేళ ఎవరైనా అటువంటి కలలు కంటుంటే... త్వరగా మేల్కోవడం మంచిది. మేల్కొని మమ్మల్ని క్షమించమని నన్ను వేడుకోండని చెబుతున్నారు త్రిష. ఇప్పుడీ గెలుపోటముల ప్రస్తావన ఎందుకు? ఎందులో ఆమెను గెలవలేరు? పదేళ్లకు పైగా తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోన్న ఆమె కొత్త కథానాయికలకు ఏమైనా సవాల్ విసురుతున్నారా? వంటి ఆలోచనల్లోకి వెళ్లొద్దు. ఎందుకంటే... త్రిష చెబుతున్నది కథానాయికల గురించి కాదు, బాక్సింగ్ గురించి! త్రిషకు కొత్తగా బాక్సింగ్‌పై ప్రేమ పుట్టుకొచ్చింది. ఫిట్‌నెస్ కోసం ఇటీవల రెగ్యులర్ వర్కౌట్స్‌లో బాక్సింగే ఎక్కువ చేస్తున్నారు. దీనికి మరో కారణం కూడా ఉందండోయ్... ఓ తమిళ సినిమా కోసం త్రిష బాక్సింగ్ నేర్చుకోవలసి వచ్చింది. ఆ సినిమాలో ఓటమి ఎరుగని బాక్సర్‌గా కనిపించనున్నారని చెన్నై కోడంబాక్కమ్ టాక్! అటు సినిమాకూ, ఇటు స్లిమ్ముగా ఉండడానికీ ఆమెకు బాక్సింగ్ అక్కరకు వస్తోందన్న మాట.

● త్రిష

కమల్ నాస్తికుడు... మోహన్‌లాల్ కృష్ణుడు!



● కమల్‌హాసన్



● మోహన్‌లాల్

కొత్తగా చెప్పేదేముంది? పలు సందర్భాల్లో కమల్‌హాసనే స్వయంగా 'నేను నాస్తికుణ్ణి' అని వెల్లడించారు. ఇప్పుడు తెరపై అటువంటి పాత్రలోనే నటించడానికి సిద్ధమవుతున్నారట. అక్షయ్‌కుమార్ కృష్ణుడిగా, పరేశ్ రావెల్ నాస్తికుడిగా నటించిన హిందీ సినిమా 'ఓ మై గాడ్'. దీన్నే తెలుగులో 'గోపాల గోపాల'గా రీమేక్ చేశారు. ఈ సినిమాను తమిళ, మలయాళ భాషల్లో కమల్‌హాసన్ రీమేక్ చేయాలనుకుంటున్నారట. కృష్ణుడి పాత్రకు మోహన్‌లాల్‌ను సంప్రదించారట. కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ సంస్థ తమిళ, మలయాళ రీమేక్‌ను నిర్మించనుందని సమాచారం. మరి, ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తారనేది ఇంకా తెలియలేదు. మోహన్‌లాల్ అంగీకరిస్తే వచ్చే ఏడాది ఈ సినిమాను సెట్స్‌కి పైకి తీసుకెళ్లాలనుకుంటున్నారట.

ఎప్పుడు చూపిస్తారు?



'బాహుబలి' ప్రభాస్ బాగా బరువు తగ్గారీ మధ్య. ఇదంతా ఆయన హీరోగా నటించనున్న కొత్త సినిమా 'సాహో' కోసమేనని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదా! రీసెంట్‌గా రిలీజైన స్టిల్స్‌లో ప్రభాస్ బరువు తగ్గిన సంగతి తెలుస్తోంది. ఇంచు మించు ఐదేళ్ల పాటు ప్రభాస్‌ను బాహుబలిగా, ఆజానుబాహుడిగా చూసిన ఫ్యాన్స్‌కు ఈ కొత్త లుక్ కిక్కిచ్చింది. అయితే... 'సాహో'లో లుక్ ఇదేనంటూ దర్శక-నిర్మాతలు ఎక్కడా చెప్పలేదు. దాంతో వాళ్లంతా ప్రభాస్ 'సాహో' లుక్ ఎప్పుడు చూపిస్తారు? అని ఎదురు చూస్తున్నారు. ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల ఎదురు చూపులకు పంద్రాగస్టుతో తెర పడనుందట! 'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న 'సాహో'లో ప్రభాస్ ఫస్ట్ లుక్‌ను ఆగస్టు 15న విడుదల చేయాలనుకుంటున్నారట.

● ప్రభాస్

యుద్ధంలో ఇద్దరూ హీరోలే!


యుద్ధంలో ఇద్దరు తలపడినప్పుడు ఒకరు గెలుస్తారు, మరొకరు ఓడుతారు. అందులో గెలిచినోడు హీరో, ఓడినోడు జీరో అవుతాడు! కానీ, 'కృష్ణార్జున యుద్ధం'లో ఇద్దరూ హీరోలేనట! అదెలా? అనడిగితే... 'యుద్ధం మొదలవుతోందిప్పుడే కదా! అప్పుడే చెప్పేస్తే ఎలా? కొన్నాళ్లు వెయిట్ చేయండి' అంటోంది చిత్రబృందం. ఇక్కడ కృష్ణుడూ.. అర్జునుడూ.. ఇద్దరూ నానీనే. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై నాని హీరోగా సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మించనున్న సినిమా 'కృష్ణార్జున యుద్ధం'. ఇందులో నాని ద్విపాత్రాభినయం చేయనున్న సంగతి తెలిసిందే. రీసెంట్‌గా 'జెంటిల్‌మన్'లోనూ నాని ద్విపాత్రాభినయం చేశారు. అయితే... అందులో ఒకరు హీరో, ఇంకొకరు విలన్. తాజా సినిమాలో మాత్రం రెండూ హీరో పాత్రలేనట! వచ్చే వారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతోంది. కొన్ని రోజులు హైదరాబాద్‌లో షూటింగ్ చేసిన తర్వాత, నెలాఖరున యూరప్ షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమాకు 'హిప్ హాప్' తమిళ స్వరకర్త.



● నాని

ప్రేమను వెతుక్కుంటూ..!

చిన్ననాటి నుంచి ఆ అమ్మాయిని ప్రాణంగా ప్రేమిస్తాడు. అయితే కాలం వాళ్లను విడదీస్తుంది. ప్రేమను వెతుక్కుంటూ అతను పదమూడేళ్ల తర్వాత వెళితే ఆ అమ్మాయి అతన్ని గుర్తుపట్టకుండా వెళ్లిపోతుంది. అసలు వీళ్ల ప్రేమకథ ఏంటి? ఇన్నేళ్లు ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? అన్న విషయాలను తెలుసుకోవాలంటే 'మళ్లీ రావా' సినిమా చూడాల్సిందేనంటున్నారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. సుమంత్, ఆకాంక్షా సింగ్ జంటగా స్వధర్మ్ ఎంటర్టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్క ఈ చిత్రం నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ను విడుదల చేశారు. గౌతమ్ తిన్ననూరి మాట్లాడుతూ–''కథను నమ్మి నాకు దర్శకునిగా అవకాశం ఇచ్చిన రాహుల్ గారికి, సుమంత్‌గారికి కృతజ్ఞతలు. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు.''మా బ్యానర్‌లో వస్తున్న తొలి చిత్రమిది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే విడుదల చేస్తాం'' అన్నారు రాహుల్‌యాదవ్. అన్నపూర్ణ, కాదంబరి కిరణ్, మిర్చి కిరణ్, కార్తీక్ అడుసుమిల్లి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.



● సుమంత్





ఉయ్యాలవాడలో... 'ఈగ' విలన్!

సుదీప్‌కు 'ఈగ' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు లభించింది. అందులో విలన్‌గా నటించారీ కన్నడ హీరో. మళ్లీ మరో తెలుగు సినిమాలో ఈయన కీలక పాత్రలో నటించనున్నారని టాక్. చిరంజీవి హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో తొలి తరం తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథతో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. అందులో సుదీప్ విలన్‌గా చేయనున్నారట. కొన్ని రోజుల క్రితమే 'ఉయ్యాలవాడ...'లో మరో కన్నడ హీరో ఉపేంద్ర విలన్‌గా నటించనున్నారనే వార్త బయటకొచ్చింది. ఇప్పుడు ఆయనతో పాటు సుదీప్‌నూ ఎంపిక చేశారట! ఆగస్టు 15న ఈ సినిమా వివరాలను అధికారికంగా వెల్లడిస్తారట. ఇందులో విలన్లు ఎవరు? హీరోయిన్లు ఎవరు? అనే విషయాలు ఆ రోజే చెబుతారేమో చూడాలి. ఇంకో విషయం ఏంటంటే... మొన్నటి వరకు ఈ సినిమా టైటిల్ 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' అనుకున్నారంతా. ఇప్పుడు తెలుగుతో పాటు మిగతా దక్షిణాది భాషలు, హిందీ ప్రేక్షకులు... అందరికీ అర్థమయ్యేలా 'మహావీర' అని పెడితే ఎలా ఉంటుందని చిత్రబృందం ఆలోచిస్తోందట. చివరకు ఏ టైటిల్ కన్ఫర్మ్ అవుతుందో... వెయిట్ అండ్ సీ!!



● సుదీప్

ప్రేమికుల అడ్డా

''ఓ యువకుడు ప్రేమికులకు అండగా నిలబడుతుంటాడు. అటువంటి ఆ యువకుడి జీవితంలో అనుకోని సమస్యలు వస్తాయి. వాటిని ఎలా ఎదుర్కొన్నాడన్నది 'లవర్స్ క్లబ్' చిత్రంలో ఆసక్తికరం'' అన్నారు దర్శకుడు ధ్రువ శేఖర్. అనీష్ చంద్ర, పావని, ఆర్యన్, పూర్ణి ప్రధాన పాత్రల్లో ప్రవీణ్ గాలిపల్లి సమర్పణలో భరత్ అవ్వారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ధ్రువ శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తీశాం. ఇంతవరకు ఎవరూ తీయని విధంగా ఫస్ట్ టైమ్ ఐ ఫోన్ టెక్నాలజీ ఉపయోగించి షూటింగ్ చేశాం'' అన్నారు. ''చిన్న సినిమా అయినా, పెద్ద సినిమా అయినా కథే బలమని ఇటీవల ప్రేక్షకులు నిరూపించారు. కథ బాగుంటే ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా తీశాం'' అని భరత్ అవ్వారి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి, నేపథ్య సంగీతం: కమల్.డి, కెమెరా: డి.వి.ఎస్.ఎస్. ప్రకాష్ రావు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: మదన్ గంజికుంట, అవ్వారి ధను, అసోసియేట్ ప్రొడ్యూసర్స్ నవీన్ పుష్పాల, శ్రీ చందన గాలిపల్లి.



● 'లవర్స్ క్లబ్'లో ఓ దృశ్యం

కాలనీలో కబ్జా

'పోలీస్ పవర్' తర్వాత శివ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించనున్న తాజా సినిమా 'మాస్ పవర్'. ప్రియచైతన్య హీరోయిన్. గుద్దేటి బసవప్ప నిర్మాత. గురువారం ప్రారంభమైన ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచాన్ చేయగా, పారిశ్రామికవేత్త సారిపల్లి కొండలరావు క్లాప్ ఇచ్చారు. ముత్యాల రామదాసు గౌరవ దర్శకత్వం వహించారు. ''కాలనీలోని ఓ ఇంటిని రాజకీయ నేత కబ్జా చేస్తాడు? అప్పుడు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆ ఇంటిని హీరో ఎలా అప్పగించాడన్నదే చిత్రకథ'' అన్నారు శివ జొన్నలగడ్డ. ''ఈ నెల 10న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాత. ఈ చిత్రానికి కెమెరా: కె. శివ, సంగీతం : శివ జొన్నలగడ్డ.



● శివ జొన్నలగడ్డ

టెక్నాలజీ మాయలో...

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ముఖ్యతారలుగా రామ్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'తారామణి'ను అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత డి. వెంకటేష్. ఆయన మాట్లాడుతూ– ''ప్రస్తుతం సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. టెక్నాలజీ మాయలో పడి యువత ఎలా ప్రవర్తిస్తున్నారు? ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు? దానివల్ల ఎటువంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు? అనే అంశాలు కూడా ఉంటాయి. తమిళంలో ఈ సినిమా ట్రైలర్‌ను హీరో కమల్‌హాసన్, పాటలను రజనీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. ఈ నెలలోనే సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.



● ఆండ్రియా




ఫ్యామిలీ పేజీలపై మీ అభిప్రాయాలనూ, సూచనలనూ తెలియచేయండి. ప్రియదర్శిని రామ్, ఫీచర్స్ ఎడిటర్. features.sakshi@gmail.com

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- జిప్‌మర్‌లో ప్రిన్సిపల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితర 21 పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 7
- నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం)లో 'సైంటిస్ట్', సీనియర్/జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ తదితర 17 పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 7
- ఐఐటీ బాంబేలో జూనియర్ మెకానిక్, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్ తదితర 17 పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 7



e-RaKAM, an online platform launched

Competitive Guidance
Current Affairs



INTERNATIONAL

India and China account for 39% of young internet users: Report

India and China are home to 39% of the 830 million young people world wide who use the Internet, according to a UN report. The data released by the International Telecommunication Union (ITU), the United Nations specialised agency for Information and Communication Technologies (ICTs), shows that of the 830 million young people online worldwide, 320 million, or 39%, are in China and India.

World's longest pedestrian suspension bridge opens in Switzerland

The world's longest pedestrian suspension bridge has been opened in Switzerland, inviting walkers to brave a narrow path running 86 metre above the ground at its highest point. The Charles Kuonen Suspension Bridge, in the Swiss Alps, near the village of Randa, is a record-breaking 494-metre long and connects Grachen and Zermatt on the Europaweg foot trail.

Delhi Metro Bags Title of 'World's First Green Metro

The Delhi Metro Railway Corporation (DMRC) has become the world's first ever Metro system to get a green certification for all its major buildings and installations. After getting green certifications for its Phase 3 stations, depots and sub stations, 10 residential colonies of DMRC were also awarded the platinum rating for adherence to green building norms.

NATIONAL

RS passed NCBC (Repeal) Bill-2017 passed

The Rajya Sabha on 31st July passed constitution amendment bill on backward classes. In Rajya Sabha some amendments which were moved by the Opposition, were passed by the House. The Constitution (123rd Amendment) Bill-2017, providing for setting up of a National Commission for Backward Classes, was passed after dropping Clause 3, to which four amendments were approved by the House earlier. The dropped clause pertains to the insertion of a new article-338B about the constitution and powers of the National Commission for Backward Classes. The amended bill will now have to be returned to the Lok Sabha for its fresh approval. The Lower House had already passed the bill.

'Sagar Vani' system launched

'Sagar Vani' system was launched on 27th July, it is to communicate and help the coastal community, especially fishermen, with advisories and warnings related to the safety at sea. This is the Integrated Information Dissemination System (IDS) 'Sagar Vani', a first in India. 'Sagar Vani' seeks to target the reach of information to the 9.27 lakh people involved in actual fishing either full or part time. The system that can send information in regional languages through various platforms including radio, television, voice calling, text service, social media, mobile apps and e-mail aims at timely dissemination of ocean information and advisory services that includes Potential Fishing Zone (PFZ) advisories, Ocean State Forecast (OSF), High Wave Alerts and Tsunami early warnings.

29 Indian cities and towns vulnerable to earthquakes

According to National Centre for Seismology, twenty-nine Indian cities and towns, including Delhi and capitals of nine states, fall under "severe" to "very severe" seismic zones. A majority of these places are in the Himalayas, one of the most seismically active regions in the world. Delhi, Patna, Srinagar, Kohima, Puducherry, Guwahati, Gangtok, Shimla, Dehradun, Imphal and Chandigarh fall under seismic zones IV and V. These cities have a combined population of over three crore. The Bureau of Indian Standards (BIS) has classified different regions in the country into zones , taking into consideration earthquake records, tectonic activities and damage caused.

BILATERAL

India-Bhutan trade pact comes into force

According to the Commerce ministry, the new agreement on trade, commerce and transit between India and Bhutan has come into force from July 29. The agreement provides for a free trade regime between the countries and it also gives duty free transit of Bhutanese goods for trade with third countries. The bilateral trade relations between India and Bhutan are governed by this pact.

ECONOMY

April-June fiscal deficit hits 81 percent of full-year target

India's fiscal deficit touched 4.42 trillion rupees ($68.88 billion) during April-June period or 80.8 percent of the budgeted target for the current fiscal year that ends in March.The fiscal deficit was 61.1 percent of the full year target during the same period a year ago. India aims to bring down its federal fiscal deficit to 3.2 percent of gross domestic product in 2017/18 compared with 3.5 percent in the previous year.

'e-RaKAM' launched

Union Government launched Rashtriya Kisan Agri Mandi (e-RaKAM), an e-platform for farmers to sell agricultural produce.The e-RaKAM portal will leverage technology to connect farmers from the smallest villages to the biggest markets. This will also neutralize the role of middlemen in the farm trade. It has been developed by state-run auctioneer MSTC Limited and CRWC (Central Railside Warehouse Company) Limited. e-RaKAM centers are being developed throughout the country in a phased manner to facilitate farmers for the online sale of their produce.

Repo rate cut by 25 bps

In its latest Monetary Policy, declared by RBI on 2nd August, the Repo Rate cut by 25 basis points from 6.25 percent to 6 percent. The reverse repo rate under the LAF stands adjusted to 5.75 per cent, and the marginal standing facility (MSF) rate and the Bank Rate to 6.25 per cent. Cash Reserve Ratio is at 4%, where as Statutory Liquidity Ratio is at 20%.

SPORTS

India bags 24 medals in Table Tennis Tournament

India bagged a rich haul of 24 medals, including 7 gold, at the Jordan Junior and Cadet Open table tennis tournament (ITTF Junior Circuit). In the event held at Amman (Jordan), India ended as the second best finishers.

Summer Olympics venues finalized..!

In 2024, the Summer Olympics will be held in Paris. Los Angeles reached an agreement with the leaders of the International Olympic Committee on plans to host the 2028 Summer Games. Paris and Los Angeles have both hosted the Olympics twice before; Paris in 1900 and 1924 and Los Angeles in 1932 and 1984.

AWARDS

Magsaysay Awards

Six people were declared winners of Ramon Magsaysay Awards, regarded as Asia's version of the Nobel Prize. The awards, named after a Philippine President who died in a 1957 plane crash, are to be presented in Manila on Aug-31. The winners of 2017 are IshizawaYoshiaki (Japan), Lilia De Lima (Philippines), Abdon Nababan (Indonesia), Philippine Educational Theatre Association, GethsieShanmugam (Srilanka), Tony Tay (Singapore).

PERSONS IN NEWS

Arvind Panagariya: Niti Aayog Vice Chairman Arvind Panagariya on 1st August requested Prime Minister Narendra Modi to relieve him of his duties by 31st of August. The Indian-American economist and Professor of Indian Political Economy at Columbia University, Mr Panagariya had joined as the first Vice-Chairman of the Niti Aayog in January 2015.

OBITUARY


P.M.Bhargava: Pushpa Mitra Bhargava, well-known scientist passed away on 1st August. He is the founder director of the 'Centre for Cellular and Molecular Biology'. Bhargava is one of the architects of modern biology and biotechnology in the country. He has been a key participant in several development projects in science. He played an important role in the development and increased use of DNA finger printing (deoxyribonucleic acid) technology as Director of the CCMB.

Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad



తెలుగునాట బౌద్ధ సంస్కృతి

గౌతమ బుద్ధుడు క్రీ.పూ.563లో కపిలవస్తు నగరంలో జన్మించి, 80 ఏళ్లు జీవించినట్లు తెలుస్తోంది. అర్థరహిత కర్మకాండను, వర్ణవ్యత్యాసాలను, పూజా విధానాన్ని బుద్ధుడు ఏమాత్రం సమర్థించలేదు. బుద్ధుడు 'కర్మ' సూత్రాన్ని ఒప్పుకొన్నాడు. 'కర్మ' మానవుని మరణానంతరం కూడా వెంటాడుతూనే ఉంటుందన్నాడు. 'కర్మ'కు కారణమైన 'కోరికను' త్యజించడం ద్వారా మనిషి నిర్వాణాన్ని పొందగలడని బౌద్ధమతం చెబుతుంది.



పోటీ పరీక్షల ప్రత్యేకం

చరిత్ర – బౌద్ధమతం

బుద్ధుడు నాలుగు ఆర్య సూత్రాలు చెప్పాడు. అవి.. 1. దుఃఖం 2. దుఃఖ కారణం 3. దుఃఖ నివారణ 4. దుఃఖ నివారణ మార్గం.

దుఃఖాన్ని నివారించాలంటే దానికి కారణమైన కోరిక (కామం)ను త్యజించాలని, అందుకు 'అష్టాంగ మార్గాన్ని' అవలంబించాలని బుద్ధుడు ప్రబోధించాడు. అందులో ఎనిమిది సూత్రాలున్నాయి. అవి.. 1. సమ్యక్ వాక్ 2. సమ్యక్ క్రియ 3. సమ్యక్ జ్ఞానం 4. సమ్యక్ శ్రమ 5. సమ్యక్ ఆలోచన 6. సమ్యక్ ధ్యానం 7. సమ్యక్ నిశ్చయం 8. సమ్యక్ దృష్టి. ఈ ఎనిమిది సూత్రాలను అర్థం చేసుకొని, ఆచరించడం ద్వారా మనిషి మనశ్శాంతి, దాని ద్వారా ఉన్నత జ్ఞానాన్ని, దాని ద్వారా నిర్వాణాన్ని పొందగలడని బుద్ధుని తాత్విక బోధ చెబుతోంది.

తెలుగు ప్రాంతంలో బౌద్ధ మతం బుద్ధుని కాలం నుంచే ప్రాచుర్యం పొందినట్లు పురావస్తు అవశేషాలు, అశోకుని ధర్మశాసనాలు, బౌద్ధ సాహిత్యం – జాతక కథలు, చైనా యాత్రికులు – ఫాహియాన్, హ్యుయాన్‌త్సాంగ్, ఇత్సింగ్ యాత్రా కథనాల వల్ల తెలుస్తోంది. వివిధ ప్రాంతాల్లో సుమారు 100 బౌద్ధ స్థలాలను పురావస్తు శాస్త్రజ్ఞులు గుర్తించారు. భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, జగ్గయ్యపేట, ఆదుర్రు, శాలిహుండం, రామతీర్థం, బావికొండ, తొట్లకొండ, చందవరం, ధూళికట్ట, ఫణిగిరి, కొండాపూర్, నేలకొండపల్లి, కోటిలింగాల, పెదగంజాం – చినగంజాం, శంకరం తదితర ప్రాంతాల్లో స్థూపాలు, చైత్యగృహాలు, విహారాలు, సంఘారామాలు వంటి అవశేషాలు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా క్రీ.పూ. 3, 4 శతాబ్దాల నుంచి, క్రీ.శ. 4, 5 శతాబ్దాల వరకు కోస్తా తీరంలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు, తెలంగాణలో ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో బౌద్ధం విస్తరించిందని చెప్పవచ్చు.

శిలాశాసనాలు లభ్యం

క్రీ.పూ. 250 ప్రాంతానికి చెందిన శిలాశాసనాలు అశోకుని కాలానికి చెందిన బ్రాహ్మీ లిపి, ప్రాకృత భాషల్లో లభ్యమయ్యాయి. క్రీ.పూ.256 నాటి అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో నివసించేవారని పేర్కొంది. అశోకుని శిలాశాసనాలు ఆంధ్ర దేశంలో కర్నూలు జిల్లాలో ఎర్రగుడి, రాజుల మందగిరిలో లభించాయి. ఇవి కాకుండా గుంటూరు జిల్లాలోని అమరావతి, భట్టిప్రోలు తదితర శాసనాలు క్రీ.పూ.3వ శతాబ్దం నాటికే బౌద్ధం ఆంధ్రదేశంలో విస్తరించింది అనడానికి నిదర్శనాలు. కోస్తా తీరాంధ్రంలో లభించిన శాసనాల్లో 'సద' అనే పదం కలిగిన రాజుల పేర్లు గోచరిస్తున్నాయి. క్రీ.పూ.3వ శతాబ్ది నాటి భట్టిప్రోలు శాసనంలో 'కుబేరక' అనే రాజు పేరు ఉంది. శాతవాహన రాజు వేయించిన 'వాసిష్టీపుత్ర పులోమావి' అమరావతి శాసనం, గౌతమీపుత్ర యజ్ఞశ్రీ చినగంజాం శాసనం, సివమకసద అమరావతి శాసనం, నాగార్జున కొండ శాసనాలు, కళింగ ఖారవేలుని హాతిగుంఫ శాసనం, వేల్పూరు సదరాజుల శాసనాలు బౌద్ధ మతానికి చెందినవే.

ఆంధ్ర పద ప్రస్తావన

ఆంధ్రుల నివాసం గురించి బౌద్ధ జాతక కథల్లో వివరణ ఉంది. 'భీమసేన జాతకం' ఆంధ్ర పదాన్ని ప్రస్తావిస్తుంది. 'సెరివణిజ' జాతకం 'తెలివాహన' నదిపై ఉన్న 'ఆంధ్రనగరి' (అమరావతి)ని ప్రస్తావించింది. అది కృష్ణానది ఒడ్డున ఉన్న నగరమేనని చరిత్రకారులు నిర్ధారించారు. అమరావతి స్థూపంలో బుద్ధుని ధాతువులు నిక్షిప్తమై ఉన్నట్లు 'మంజుశ్రీ మూలకల్పం'లో ఉంది. 'వజ్రాలదిన్నె' వద్ద బుద్ధుని దంతాన్ని నిక్షేపించి, అశోకుడు ఒక స్థూపాన్ని నిర్మించినట్లు 'దీపవంశ' బౌద్ధ గ్రంథం ద్వారా తెలుస్తోంది. ఫెర్గూసన్ పండితుడు 'వజ్రాలదిన్నె'ను ధాన్యకటకంతో పోల్చాడు. కృష్ణానది ముఖ ద్వారంలో ఉన్న 'మబెరిక' (భట్టిప్రోలు)లో 'బుద్ధ ధాతువు'పై స్థూపం నిర్మించినట్లు 'దీపవంశం' గ్రంథం పేర్కొంటోంది. 'సుత్తనిపాతం' బౌద్ధ వ్యాఖ్యానంలో 'అసక-ములక' (ప్రస్తుత తెలంగాణ) ప్రాంతాలను 'ఆంధ్ర జనపదాలు'గా గుర్తించారు. సుత్తనిపాతంలో 'బావరి' అనే కోసల దేశపు బ్రాహ్మణుడు అసక-ములక ప్రాంతాల సరిహద్దుల్లో గోదావరి నది ఒడ్డున ఆశ్రమం నిర్మించుకొని ఆంధ్రులకు విద్యాబోధన చేసినట్లు ఉంది. బావరి బుద్ధుని సమకాలికుడే. 'బౌద్ధ విమానవస్తు' భాష్యం ప్రకారం బుద్ధుని ప్రధాన శిష్యుడు 'కాత్యాయనుడు' అసక-ములక ప్రాంతాల్లో బౌద్ధ ధర్మాన్ని బోధించాడు. బావరి శిష్యులు, ఆంధ్ర బౌద్ధ భిక్షువులు ఉజ్జయిని, కోశాంబి, శ్రావస్తి, కపిలవస్తు, వైశాలి నగరాలను సందర్శించినట్లు తెలుస్తోంది. వీరందరినీ అప్పుడు అంధకులు అనేవారు. త్రిపీటకాల్లో 'మహావగ్గ' ప్రకారం శ్రావస్తి నగరానికి దగ్గరలో 'అంధకవనం', రాజగృహానికి దగ్గరలో 'అంధకవింద' విహారాలు నిర్మించినట్లు తెలుస్తోంది. వీటిని బహుశా ఆంధ్రులు నిర్మించి ఉంటారని ప్రఖ్యాత చారిత్రక పరిశోధకుడు బి.ఎస్.ఎల్.హనుమంతరావు అభిప్రాయపడ్డారు. బౌద్ధ భిక్షువులు ధాన్యకటకం(అమరావతి)లో 'వంద నామగోష్టి'గా ఏర్పడినట్లు శాసన ఆధారం. బౌద్ధ మతాచార్యులు నిర్వహించిన మూడో సంగీతి (సదస్సు)లో అంధకులు ప్రముఖ పాత్ర వహించారని 'కథావస్తు' గ్రంథం పేర్కొంటోంది. మౌర్య రాజుల ప్రోత్సాహంతో 'థేరవాద మహా సాంఘికులు' బౌద్ధ మత ప్రచారం కోసం ఆంధ్ర దేశంతోపాటు, కాశ్మీరం, గాంధారం, అపరాంత, వనవాసి, మహిష మండలం, తామ్రపర్ణి, మహారక, సువర్ణభూమి వంటి ప్రాంతాలకు వెళ్లారు. బౌద్ధులు 'సింహగోష్టిగా' ఏర్పడినట్లు భట్టిప్రోలు శాసనం పేర్కొంటోంది.


బావికొండ (విశాఖపట్నం) 'బుద్ధుని ధాతువులు'

విశాఖపట్నం జిల్లా బావికొండ వద్ద పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో బుద్ధుని ధాతువులు లభించాయి. ధాతువులను (ఎముకలు, దంతాలు, భస్మం, గోళ్లు, తలవెంట్రుకలు) స్థూపాలు, పగోడాలు, విహారాల్లో నిక్షిప్తం చేస్తారు. ఈ ధాతువులతోపాటు, బంగారు పుష్పాలు, పూసలు, నాణేలు లభించాయి. అమరావతిలో 'కాలచక్ర తంత్రం' (2006) మహాసభలు జరిగాయి.

కాలచక్ర తంత్రం (అమరావతి)

గౌతమ బుద్ధుడు స్వయంగా ధాన్యకటకం (అమరావతి) వద్ద 'కాలచక్ర తంత్రం' ప్రవర్తింపజేసి, ధారణులను నిక్షిప్తం చేశాడని అందుకే అమరావతి 'ధరణికోట' అయిందని ప్రముఖ జర్మన్ పండితుడు హాలెంట్ హోప్‌మన్ తన పరిశోధనలో వెల్లడించారు. అమరావతి మహాస్థూపంలో బుద్ధుడి ధాతువులను నిక్షిప్తం చేసినట్లు మంజుశ్రీ మూలకల్పం బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది. నాగార్జున కొండలో జరిపిన తవ్వకాల్లో లభించిన ఆయకస్తంభ శాసనంలో 'సమ్మసంభుదస ధాతువర పరిగహితస' అంటే బుద్ధుడి ధాతువులు నిక్షిప్తం అయ్యాయి అని ఉంది. భట్టిప్రోలు శాసనంలో 'బుద్ధ శరీరానికి నిక్షిప్తం' అని ఉంది. నాగార్జున కొండలో లభించిన బుద్ధుడి ధాతువులు ప్రస్తుతం సారనాథ్‌లో ఉన్నాయి. భట్టిప్రోలులో లభించిన ధాతువులను ప్రస్తుతం కోల్‌కతా, ఇగత్‌పురి, జపాన్‌లలో భద్రపర్చారు.

డా॥ పి. జోగినాయుడు
డిప్యూటీ డైరెక్టర్ (రిటైర్డ్)
ఆర్కియాలజీ - మ్యూజియమ్



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

గ్రూప్-2కు ఎలాంటి ప్రిపరేషన్ వల్ల మంచి ఫలితాలుంటాయి?

- ఎస్.రాజు, హైదరాబాద్.

మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉండే గ్రూప్–2 పరీక్ష విషయంలో అధిక శాతం మంది అభ్యర్థులు చేస్తున్న పొరపాటు సిలబస్‌లోని అంశాలను నేరుగా బిట్స్ రూపంలో చదవడం. ఇది ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి అభ్యర్థులు డిస్క్రిప్టివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి. దీనివల్ల ఒక అంశాన్ని వివిధ కోణాల్లో అధ్యయనం చేసేందుకు వీలవుతుంది. ప్రశ్న ఏ విధంగా అడిగినా సమాధానం ఇవ్వగల సామర్థ్యం లభిస్తుంది. డిస్క్రిప్టివ్ తరహాలో ప్రిపరేషన్ సాగిస్తున్నప్పుడు అభ్యర్థులు ముఖ్యాంశాలను పాయింటర్స్‌లా లేదా షార్ట్ నోట్స్ రూపంలో రాసుకోవాలి. ఫలితంగా రివిజన్ చేసేటప్పుడు సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా సబ్జెక్టులకు సమ ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ కొనసాగించడానికి వీలవుతుంది. ముఖ్యంగా ఎకానమీ, పాలిటీ సబ్జెక్టుల్లో షార్ట్‌కట్ నోట్స్ విధానం ఎంతో అవసరం.



- అభ్యర్థులు కేవలం ప్రిపరేషన్‌కే పరిమితం కాకుండా, తాము అప్పటివరకు చదివిన అంశాలపై ఏ మేరకు పట్టు సాధించామనే దానిపై స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. దీని కోసం స్వయంగా మాక్‌టెస్ట్‌లు రాయాలి. వాటిని మూల్యాంకనం చేసుకొని, ప్రిపరేషన్ పరంగా లోపాలను సరిదిద్దుకోవాలి. పేపర్ల వారీగా వారాంతపు పరీక్షలకు హాజరుకావడం విజయావకాశాలను మెరుగుపరుస్తుంది. వారం రోజుల్లో చదివిన అంశాలకు సంబంధించి టెస్ట్ రాయడం, ఫలితాలను విశ్లేషించుకోవడం చేయాలి. ఒక అంశాన్ని కేవలం థియరిటికల్ అప్రోచ్‌తో చదవడానికే పరిమితం కాకుండా.. ప్రాక్టీస్ చేయాలి.


దూర విద్య.. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌గా సుపరిచితమైన పేరు. వ్యక్తిగత కారణాలతో ఉన్నత విద్య అభ్యసించలేనివారికి.. వృత్తిపరంగా ఉన్నత హోదాలు అందుకోవాలనుకునే వారికి.. దశాబ్దాలుగా చక్కటి మార్గంగా నిలుస్తున్న విధానం. దేశంలో దాదాపు ప్రతి యూనివర్సిటీలోనూ దూర విద్యా విధానంలో కోర్సులున్నాయి. ఇదే సమయంలో ఈ కోర్సులు, ప్రోగ్రామ్‌లను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని.. విద్యార్థులకు సరికొత్త నైపుణ్యాలు అందించాలని యూజీసీ సంకల్పించింది. అందుకోసం 'ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ రెగ్యులేషన్స్-2017' పేరుతో నిబంధనలు రూపొందించింది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచే విధానాలతో పాటు ఇన్‌స్టిట్యూట్లు అనుసరించాల్సిన నిబంధనలను సైతం స్పష్టం చేసింది. ఆ వివరాలు..



మరింత దగ్గరగా.. నాణ్యంగా

సార్వత్రిక విద్యా విధానంలో మార్పులు
యూజీసీ ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ రెగ్యులేషన్స్-2017

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం



యూజీసీ తాజా నిబంధనలు.. ఆన్‌లైన్ లెర్నింగ్, టీచింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దూర విద్య కోర్సులను ఆఫర్ చేస్తున్న యూనివర్సిటీలు తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ త్రూ కమ్యూనికేషన్ టూల్స్ (ఐసీటీ)ను వినియోగించాలని, విద్యార్థులకు లెర్నింగ్ పరంగా ఆన్‌లైన్ వనరులను (ఈ-లెక్చర్స్, ఈ-లైబ్రరీ తదితర) అందుబాటులో ఉంచాలని పేర్కొంది. అంతేకాక మూక్స్ (మాసివ్‌లీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్)ను విస్తృతంగా అందించాలని స్పష్టం చేసింది.

డీఈసీ/డీఈబీ.. నియంత్రణ సంస్థల గుర్తింపు

దూర విద్య కోర్సులకు ఇప్పటివరకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్/బోర్డ్ అనుమతి తప్పనిసరి. ఆఫర్ చేసే సంస్థలు దీంతోపాటు కోర్సును అందించేందుకు నిర్దేశిత నియంత్రణ సంస్థల గుర్తింపు కూడా పొందాలని.. ఆ గుర్తింపు ఉన్నప్పుడే దూరవిద్య కోర్సులను ప్రారంభించాలని తాజా నిబంధనల్లో పేర్కొన్నారు.

హెచ్ఈఐలు.. న్యాక్ తప్పనిసరి

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులు అందించే యూనివర్సిటీలు న్యాక్ గుర్తింపు పొందాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఏర్పడిన ఓపెన్ యూనివర్సిటీలకు ప్రస్తుతానికి ఈ నిబంధన వర్తించదు. అయితే.. అవసరమైన ప్రమాణాలు అందుకున్న తర్వాత ఏడాదిలోపు ఈ వర్సిటీలు కూడా న్యాక్ గుర్తింపు పొందాల్సిందేనని స్పష్టం చేశారు. 2010 కంటే ముందు డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందిన సంస్థలు కూడా ఓపెన్ లెర్నింగ్ విధానంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులను ఆఫర్ చేయొచ్చు. వాటిని సొంతంగానే అందించాలే తప్ప.. అనుబంధ కళాశాలలు ద్వారా కాదు.

ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతి


అయిదేళ్లు పూర్తి చేసుకున్న ప్రైవేటు యూనివర్సిటీలకు దూర విద్యా విధానంలో కోర్సులు అందించేందుకు అనుమతి కల్పిస్తూ యూజీసీ తాజా నిబంధనలు రూపొందించింది. ఆఫ్-క్యాంపస్ సెంటర్లను, ఆఫ్-షోర్ క్యాంపస్‌లను, స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసి.. కోర్సులు కొనసాగించొచ్చని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా ఆమోదించిన బిల్లు ద్వారా ఏర్పాటైన స్టేట్ యూనివర్సిటీలు.. ఆ రాష్ట్రం పరిధిలోనే దూర విద్య కోర్సులను అందించాలి.

ఈ కోర్సులకు అనుమతి లేదు



యూజీసీ తాజా సంస్కరణల్లో విద్యార్థులు ప్రధానంగా గుర్తించాల్సిన అంశం.. కొన్ని కోర్సులకు డిస్టెన్స్ విధానంలో అందించడాన్ని నిషేధించడం. ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్, ఫార్మసీ, నర్సింగ్, ఆర్కిటెక్చర్, ఫిజియోథెరపీ కోర్సులను దూర విద్యా విధానంలో బోధించినా.. అభ్యసించినా.. ఆ సర్టిఫికెట్లకు ఎలాంటి గుర్తింపు ఉండదు.

ముందస్తు అనుమతితో డిప్లొమా, పీజీడీ కోర్సులు



ప్రస్తుతం ఇండస్ట్రీ అవసరాలు.. ఔత్సాహిక అభ్యర్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని పలు యూనివర్సిటీలు దూర విద్యా విధానంలో డిప్లొమా, పీజీ డిప్లొమా పేరుతో షార్ట్‌టర్మ్ /లాంగ్ టర్మ్ కోర్సులను నిర్వహిస్తున్నాయి. సర్టిఫికెట్ కోర్సులను సైతం అందిస్తున్నాయి. వీటిని బోధించాలంటే తప్పనిసరిగా సంబంధిత కోర్సులకు చెందిన నియంత్రణ సంస్థల గుర్తింపు ఉండాలి. ఉదాహరణకు పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్‌ను ఆఫర్ చేయాలంటే ఏఐసీటీఈ గుర్తింపు తప్పనిసరి.

ఏడాది వ్యవధి తప్పనిసరి

దూర విద్య కోర్సుల కాల పరిమితి తప్పనిసరిగా కనీసం ఏడాది ఉండాలి. అప్పుడే డీఈబీ/డీఈసీ గుర్తింపు లభిస్తుంది. బోధన పరంగా సెమిస్టర్ లేదా వార్షిక విధానాన్ని అమలు చేయాలి. సెమిస్టర్ వ్యవధి ఆరు నెలలు తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

విశ్వ విద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు అందించే డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో నాణ్యతా ప్రమాణాల పెంపుపై యూజీసీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అందించే వర్సిటీలు తమ ప్రధాన కేంద్రంలో సెంటర్ ఫర్ క్వాలిటీ అష్యూరెన్స్ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి.. కోర్సుల అమలు తీరుపై నిరంతరం సమీక్ష నిర్వహించాలి. ఇందులో కోర్సులకు చెందిన సీనియర్ ప్రొఫెసర్స్, ప్రొఫెసర్స్ భాగస్వాములు కావాలి.

లెర్నింగ్ సెంటర్స్



ప్రతి యూనివర్సిటీ తన అనుబంధ కళాశాలల్లో లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి.. విద్యార్థులకు నిర్దిష్ట వ్యవధిలో కాంటాక్ట్ తరగతులు నిర్వహించాలి. ఈ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్లను కూడా కేవలం యూనివర్సిటీ అనుబంధ కళాశాలలు, గుర్తింపు పొందిన కళాశాలల్లోనే ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా నిర్దిష్టంగా ఒక కోర్సు విషయంలో ఒక సెమిస్టర్‌లో కనీసం 20 శాతం బోధన ఆన్‌లైన్ విధానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

మూల్యాంకనంలో మార్పులు



డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విద్యార్థుల్లోని నైపుణ్యాలను నిరంతరం పరీక్షించేలా మూల్యాంకన విధానంలోనూ యూజీసీ మార్పులు ప్రతిపాదించింది. దీని ప్రకారం.. సెమిస్టర్ లేదా వార్షిక ప్రాతిపదికగా ఆఫర్ చేస్తున్న కోర్సులు చదువుతున్నవారికి సమ్మేటివ్, ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లు నిర్వహించాలని స్పష్టం చేసింది. మూల్యాకంనపరంగా వంద మార్కుల పరీక్షలో 30 శాతం మార్కులు ఇంటర్నల్ అసెస్‌మెంట్స్‌కు వెయిటేజీ ఇవ్వాలని స్పష్టం చేసింది. సెమిస్టర్ ఎండ్, లేదా ఇయర్ ఎండ్ పరీక్షల్లో మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వాలని పేర్కొంది.

ఫ్యాకల్టీ విషయంలో నిర్దిష్ట ప్రమాణాలు



యూనివర్సిటీలు, హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్లు దూర విద్యా కోర్సులను అందించే క్రమంలో వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు ఫ్యాకల్టీ విషయంలో నిర్దిష్ట ప్రమాణాలను యూజీసీ పేర్కొంది. ప్రతి కోర్సుకు యూనివర్సిటీ స్థాయిలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌ను నియమించాలి. అదే విధంగా ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి.

ముందస్తు అనుమతితోనే ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లలోనే పరీక్షలు

కోర్సు పూర్తయ్యాక నిర్వహించే పరీక్షల విషయంలోనూ యూజీసీ పకడ్బందీ ప్రతిపాదనలు రూపొందించింది. దీని ప్రకారం కేవలం ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లోనే వీటిని నిర్వహించాలి. ప్రతి ఎగ్జామ్ సెంటర్‌లోనూ సీసీ టీవీ ఏర్పాటు చేయాలి.

చిన్నప్పడు పుస్తకాలు సైతం కొనుక్కోలేని పరిస్థితి. తరగతి గదిలో స్నేహితులను అడిగి చదువుకున్న సందర్భాలు ఎన్నో! అలాంటి దశ నుంచి డిజిటలైజేషన్ విప్లవాన్ని అందిపుచ్చుకొని.. ఏకంగా 40 ఎడ్యుకేషన్ యాప్స్ రూపొందించాడు. తనలాంటి విద్యార్థులకు అవి ఉపయోగపడేలా చేస్తున్నాడు. అంతేకాక ప్రత్యేకంగా ఒక యాప్ డెవలప్‌మెంట్ సంస్థను నెలకొల్పి నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. ఎలాంటి సాంకేతిక కోర్సులు చదవకపోయినా.. విద్యార్థులకు ఉపయోగపడే యాప్స్ రూపొందించిన రాజస్థాన్‌లోని నిరుపేద రైతు కుటుంబానికి చెందిన శంకర్‌యాదవ్ స్ఫూర్తి కథనం..

భళా శంకర్.. భలే ఉపాయం

40 విద్యా సంబంధ యాప్స్ రూపకల్పన

Youth స్టోరీ



శంకర్‌యాదవ్ (21) స్వస్థలం రాజస్థాన్ రాష్ట్రంలోని రోవ్‌పురా అనే కుగ్రామం. తండ్రి కల్లూరాంకు ఉన్నది ఎకరం పొలం మాత్రమే. దానిపై ఆదాయంతో ముగ్గురు పిల్లలున్న కుటుంబాన్ని పోషించడమే కష్టంగా ఉండేది. శంకర్‌కు పాఠశాల పుస్తకాలు కూడా కొనలేని దైన్యం. స్నేహితుల దగ్గర అడిగి తీసుకున్నా.. ఒకట్రెండు రోజులకే తిరిగిచ్చేయమని అడిగేవారు. దీంతో సబ్జెక్టులను పూర్తిస్థాయిలో చదివి అవగాహన చేసుకునే వీలుండేది కాదు.

కంప్యూటర్‌తో పరిచయం అలా..

ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు ఓ ఉపాధ్యాయుడు తన కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోమని సూచించారు. శంకర్‌కు కంప్యూటర్‌తో అలా పరిచయం ప్రారంభమైంది. ఈ సందర్భంగానే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా అపారమైన జ్ఞానాన్ని పొందవచ్చని గ్రహించాడు. ఇల్లు గడవడానికే కష్టంగా ఉన్నప్పటికీ.. కుమారుడి ఆసక్తిని గమనించి తండ్రి ఒక కంప్యూటర్ కొనిచ్చాడు. అప్పటినుంచి ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ టూల్స్‌నే సాధనంగా చేసుకుని రాణించాడు శంకర్. గూగుల్ ద్వారా యాప్స్ రూపకల్పనపై తొమ్మిదో తరగతిలోనే అధ్యయనం చేశాడు. ప్రాథమిక నైపుణ్యం అనంతరం ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందాడు.

యాప్స్ రూపకల్పన

ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్నాక.. సొంతంగా యాప్స్ రూపకల్పనకు నడుంబిగించాడు. ముఖ్యంగా విద్యా సంబంధ యాప్స్‌కు ప్రాధాన్యం ఇచ్చాడు. సొంతంగా ఏకంగా నలభై ఎడ్యుకేషనల్ యాప్స్ తయారుచేశాడు. దీనికి ప్రత్యేక కారణం ఏమిటని అడిగితే అతడి సమాధానం ఒక్కటే.. 'నా చిన్నప్పటి అనుభవాలు నేటి విద్యార్థులకు ఎదురుకాకూడదు. ముఖ్యంగా సబ్జెక్ట్‌కు సంబంధించి పుస్తకాలు లభించక గ్రామీణ ప్రాంత, పేద విద్యార్థులు పైతరగతులు చదవలేని స్థితి నుంచి తప్పించడమే' అంటున్నాడు. మరి మీ లక్ష్యం మేరకు విద్యార్థులకు ఇవి చేరతాయా? అంటే కచ్చితంగా... చేరతాయనేది అనేది శంకర్ సమాధానం. డిజిటల్ ఇండియా పథకం నేపథ్యంలో ఇప్పుడు దాదాపు అన్ని పాఠశాలల్లో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ టూల్స్ అందుబాటులోకి వస్తుండటంతో తన ఆశయం నెరవేరుతుంది అనేది శంకర్ నమ్మకం.

మరో నలుగురికి ఉపాధి

ఒకప్పుడు పుస్తకాలు కూడా కొనుక్కోలేకపోయిన శంకర్.. ఇప్పుడు యాప్స్ రూపకల్పనకు ఏకంగా యాప్స్ డెవలప్‌మెంట్ సంస్థనే నెలకొల్పాడు. తనతో పాటు నలుగురు సహచరులు పని చేస్తున్నారు. ప్రధానంగా పదో తరగతి, పన్నెండో తరగతి, పోటీ పరీక్షల సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ... వాటిలో నైపుణ్యాలు అందించేలా యాప్స్‌ను రూపొందిస్తున్నారు. సైన్స్, మ్యాథ్స్, జాగ్రఫీ, సోషల్ సైన్సెస్, భారత రాజ్యాంగం, రాజస్థాన్ సంస్కృతి, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన నైపుణ్యాలు అందించే విధంగా ఈ యాప్స్ తయారుచేస్తున్నారు.

ఆదరణకు కొదవలేదు

శంకర్ యాప్స్‌కు లభిస్తున్న ఆదరణలో కొదవలేదు. 'ఇప్పటికే దాదాపు 60 వేల మంది తమకు నచ్చిన, ఉపయోగపడతాయనుకున్నవాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు. రోజూ 15 మిలియన్ వ్యూస్ లభిస్తున్నాయి' అని సంతోషంగా చెబుతున్నాడు శంకర్. అతడు రూపొందించిన యాప్స్‌ను గూగుల్ ప్లే స్టోర్ ఎనిమిది నెలల క్రితం గుర్తించింది. అప్పటినుంచి యాప్ డౌన్‌లోడ్స్ విషయంలో మరింత ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 20 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా **Shankarraopura.com** వెబ్‌సైట్ నుంచి ఈ యాప్స్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు.

మరి ఆదాయం..?

కేవలం విద్యా సంబంధమైనవి మాత్రమే కాకుండా.. ఇతర యాప్స్ కూడా శంకర్ అభివృద్ధి చేస్తున్నాడు. ఆరోగ్యం, క్రీడలు, సంస్కృతికి సంబంధించినవి కూడా ఇందులో ఉన్నాయి. మరి ఆదాయం గురించి అడిగితే.. గూగుల్ యాడ్స్ ద్వారా మంచి ఆదాయమే లభిస్తోందని.. ఫలితంగానే మరో నలుగురికి ఉపాధి కల్పించగలుగుతున్నానని చెబుతున్నాడు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేస్తూ.. విద్యార్థులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా చేస్తున్నట్లు వివరిస్తున్నాడు. ప్రస్తుతం తమ యాప్స్‌ను హిందీ భాషలో అందిస్తున్నామని.. త్వరలో ఇంగ్లిష్‌లోకి సైతం అనువాదం చేసి.. దేశంలోని అందరూ వినియోగించుకునేలా అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నాడు.

స్వగ్రామాన్ని పూర్తి డిజిటల్‌గా

మౌలిక సదుపాయాలు కూడా సరిగా లేని తన గ్రామం రోవ్‌పురాను.. ఇప్పుడు పూర్తి డిజిటల్‌గా మార్చాడు శంకర్. పాఠశాలలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ టూల్స్ ఏర్పాటు చేశాడు. వాటిద్వారా విద్యార్థులు పుస్తకాల్లో లభించే పాఠ్యాంశాలకు అదనపు సమాచారం సొంతం చేసుకునేలా చేశాడు. ఈ విషయంలో తన కృషికి రాజస్థాన్ ప్రభుత్వం నుంచి సైతం గుర్తింపు పొందాడు.

బులెటిన్ బోర్డ్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 13 ఖాళీలు

- **పోస్టు పేరు:** సెక్యూరిటీ ఆఫీసర్(మేనేజర్)
- **మొత్తం పోస్టులు:** 13(అన్‌రిజర్వ్‌డ్-9, ఓబీసీ-3, ఎస్సీ-1).
- **వేతనం:** రూ.31,705-రూ.45,950 + నిబంధనల మేర అలవెన్సులు.
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత. దీంతోపాటు ఆర్మీ/నేవీ/ఎయిర్‌ఫోర్స్/పారామిలటరీ/పోలీస్ విభాగాల్లో నిర్దేశిత హోదాతో ఐదేళ్లు పనిచేసిన అనుభవం. అలాగే కంప్యూటర్ పరిజ్ఞానం. ❖ **వయోపరిమితి:** 25-40 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ/జీడీ
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.600(అప్లికేషన్ ఫీజు+ ఇంటిమేషన్ చార్జెస్); ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.100(ఇంటిమేషన్ చార్జెస్ మాత్రమే).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 12, 2017 ❖ **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 9, 2017.
- **వెబ్‌సైట్: www.bankofmaharashtra.in**

మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌లో 69 అప్రెంటీస్ ఖాళీలు

చెన్నైలో ఉన్న మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎంఎఫ్ఎల్)లో 69 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటీసెస్-6(కెమికల్-5 + ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్-1); డిప్లొమా(టెక్నీషియన్) అప్రెంటీసెస్-45 (కెమికల్-13 + మెకానికల్ -20 + ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ -5 + సివిల్-2 + ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్-5) ; డిప్లొమా ఇన్ మోడర్న్ ఆఫీస్ ప్రాక్టీస్ అప్రెంటీసెస్(డీఎంఓపీ)-18. ❖ **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటీసెస్‌కు రూ.10,000; డిప్లొమా(టెక్నీషియన్/డీఎంఓపీ) అప్రెంటీసెస్‌కు రూ.9,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు/విభాగాలను అనుసరించి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్/డిప్లొమా. దీంతోపాటు నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్(ఎన్ఏటీఎస్)లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పత్రం హార్డ్ కాపీని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి కవరులో ఉంచి 'ది జనరల్ మేనేజర్-పీ అండ్ఏ, మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, పోస్ట్ బ్యాగ్ నెం.-2, మనాలి, చెన్నై-600068' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 9, 2017. ❖ **వెబ్‌సైట్: madrasfert.nic.in**

నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్‌లో 15 ఖాళీలు

చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం).. 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్(3)-1; ప్రాజెక్ట్ సైంటిస్ట్(2)-1; ప్రాజెక్ట్ ఇంజనీర్(1)-1; ప్రాజెక్ట్ ఇంజనీర్(1)-1; ప్రాజెక్ట్ అసోసియేట్(పీఏ)-4; సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)-1; జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-6.
- **వేతనం:** ప్రాజెక్ట్ సైంటిస్ట్(3) పోస్టులకు రూ.50,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్(2)కు-రూ.45,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్(1), ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు రూ.40,000; ప్రాజెక్ట్ అసోసియేట్‌కు -రూ.30,000; ఎస్ఆర్ఎఫ్‌కు రూ.18,000; జేఆర్ఎఫ్‌కు రూ.16,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ/పీహెచ్‌డీ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం,
- **వయోపరిమితి:** జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు 30 ఏళ్లు, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 35 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 45 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 16, 2017. ❖ **వెబ్‌సైట్: www.ncscm.res.in**

సాక్షి బిజినెస్

శనివారం 5-8-2017

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
88 ▲	53 ▲
32,325	10,066

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... W W చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30కి)

నాస్‌డాక్	6,349	▲	8
డోజోన్స్	22,058	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,512	▲	37
డాక్స్	12,298	▲	143
షాంఘై	3,261	▽	12
నికాయ్	19,952	▽	77

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	58.92	67.16
£	బ్రిటన్ పౌండ్	76.09	88.24
€	యూరో	68.78	79.78
¥	జపాన్ ఎన్ (100)	52.61	61.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	46.12	53.38
S$	సింగపూర్ డాలర్	42.64	50.52
SAR	సౌదీ రియాల్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	15.76	18.43
¥	చైనా యువాన్	6.70	10.87

సర్కారీ షేర్ల మేళా!


కేంద్రం నుంచి కొత్త ఈటీఎఫ్ 'భారత్–22'

- ఆరు రంగాలకు చెందిన షేర్లతో కూర్పు
- ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ తదితర 22 షేర్లతో ఏర్పాటు

న్యూఢిల్లీ: 'భారత్–22' పేరుతో కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ను ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరు రంగాల నుంచి ఎంపికచేసిన షేర్లు ఇందులో వుంటాయి. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలతో కూడిన సీపీఎస్‌ఈ ఈటీఎఫ్‌ను ఏర్పాటుచేసి, మూడు విడతలుగా ఆ యూనిట్లను విక్రయించడం ద్వారా రూ. 8,500 కోట్లు సమీకరించిన ప్రభుత్వం తాజాగా రెండో ఈటీఎఫ్‌కు శ్రీకారం చుట్టింది. ఇంధనం, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్స్, బేస్ మెటల్స్, ఇండస్ట్రియల్, యుటిలిటీస్–ఈ ఆరు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న షేర్లతో భారత్–22ను నెలకొల్పినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ శుక్రవారంనాడిక్కడ మీడియాకు చెప్పారు. ఈ 22 షేర్లలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వానికి వ్యూహాత్మక వాటా కలిగిన ప్రైవేటు కంపెనీలు వున్నాయి. ఎస్‌యూయూటీఐ (గతంలో యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు చెందిన విభాగం) ద్వారా ప్రభుత్వానికి ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో వ్యూహాత్మక వాటా వుంది. తాజా ఈటీఎఫ్‌కు ఆయా రంగాలను ఎంపికచేసేటపుడు, ఆ రంగాల్లో జరిగిన సంస్కరణల్ని పరిగణనలోకి తీసుకున్నామని, ఆయా షేర్ల విలువలపై సంస్కరణల సానుకూల ప్రభావం పడుతుందని ఆయన వివరించారు.

ప్రభుత్వ బ్యాంకులు కూడా...

భారత్–22 జాబితాలో పైన పేర్కొన్న ప్రైవేటు దిగ్గజాలే కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు వున్నాయి. ప్రభుత్వ విధానానికి అనుగుణంగా పీఎస్‌యూ బ్యాంకుల్ని భారత్–22లో చేర్చినట్లు జైట్లీ తెలిపారు. పీఎస్‌యూ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాను అవసరమైన సమయంలో 52 శాతానికి తగ్గించుకుంటామని ఆయన చెప్పారు. కొత్త ఈటీఎఫ్‌లో ఇంకా ఆయిల్ అండ్ గ్యాస్, కోల్, మైనింగ్ ప్రభుత్వ కంపెనీలైన ఓఎన్‌జీసీ, ఐఓసీ, బీపీసీఎల్, కోల్ ఇండియా, నాల్కోలు వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు భారత్ ఎలక్ట్రానిక్స్, ఇంజనీర్స్ ఇండియా, ఎన్‌బీసీసీ, ఎన్‌టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎస్‌జేవీఎన్‌ఎల్, గెయిల్, పీజీసీఐఎల్, ఎన్‌ఎల్‌సీలు కూడా చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కొద్దికొద్దిగా ప్రభుత్వ వాటాను ఈటీఎఫ్‌లోకి మళ్లిస్తామని ఆయన వివరించారు. తొలి ఫండ్ ద్వారా ఈటీఎఫ్ ప్రయోగాన్ని ఇండియా విజయవంతంగా అమలుచేసిందని జైట్లీ చెపుతూ ప్రపంచవ్యాప్తంగా ఈటీఎఫ్‌ల కింద 4 ట్రిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయన్నారు. పలు పెన్షన్ ఫండ్స్, ప్రభుత్వ ఫండ్స్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులకే మొగ్గుచూపుతున్నందున, వచ్చే నాలుగేళ్లలో ఈ ఆస్తుల విలువ 7 ట్రిలియన్ డాలర్లకు చేరవచ్చన్నది అంచనా అని ఆయన వివరించారు. ఈటీఎఫ్‌లో పెట్టుబడికి రిస్క్ తక్కువని ఆయన అన్నారు.



మ్యూచువల్ ఫండ్ తరహాలోనే...

మ్యూచువల్ ఫండ్ యూనిట్లలో ఇన్వెస్టర్లు పెట్టుబడి చేసినట్లే..ఈటీఎఫ్ యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. ఈ యూనిట్లను కొనుగోలుచేయడం ద్వారా 22 బ్లూచిప్ కంపెనీల్లో ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేసినట్లవుతుంది. ప్రభుత్వం తొలుత ప్రవేశపెట్టిన సీపీఎస్‌ఈ ఈటీఎఫ్ ద్వారా ఇదేతరహాలో ఇన్వెస్టర్ల నుంచి 3 దశలుగా రూ. 8,506 కోట్లు సమీకరించింది. తొలి ఈటీఎఫ్‌లో ఓఎన్‌జీసీ, కోల్‌ఇండియా, ఐఓసీ, గెయిల్, ఆయిల్ ఇండియా, పీఎఫ్‌సీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆర్‌ఈసీ, ఇంజనీర్స్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్‌లు వున్నాయి. భారత్–22 యూనిట్లను ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా వివిధ దశల్లో ఇన్వెస్టర్లకు విక్రయించనున్నట్లు కేంద్ర పెట్టుబడుల శాఖ కార్యదర్శి నీరజ్ గుప్తా వెల్లడించారు. దీని ద్వారా సేకరించబోయే నిధులకు పరిమితి ఏదీ విధించుకోలేదన్నారు.

నాలుగు డిఫెన్స్ కంపెనీల్లో వాటా విక్రయం

- ఐపీవో ద్వారా 25 శాతం వాటా ఉపసంహరణ
- రిజిస్ట్రార్ల కోసం బిడ్లు ఆహ్వానం; గడువు తేదీ 18

న్యూఢిల్లీ: రక్షణ రంగానికి చెందిన నాలుగు కంపెనీల్లో 25 శాతం వరకు వాటాలను ఐపీవో ద్వారా ఉపసంహరించుకోవాలని కేంద్రం భావిస్తోంది. వీటిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్, మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్, మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ఉన్నాయి. వీటిలో 25 శాతం వరకు వాటాల ఉపసంహరణకు సంబంధించి రిజిస్ట్రార్లను ఆహ్వానిస్తూ పెట్టుబడుల ఉపసంహరణ విభాగం ప్రకటన జారీ చేసింది. ఈ నెల 18వ తేదీలోపు బిడ్లు సమర్పించాలని కోరింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ వ్యవహారాలను ఈ విభాగం చూస్తుంటుంది. ఈ నాలుగు కంపెనీల్లో వాటాల విక్రయానికి కేంద్ర కేబినెట్ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే అనుమతించింది. తర్వాత పెట్టుబడుల ఉపసంహరణ విభాగం మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదారుల కోసం బిడ్లు కూడా పిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ కంపెనీల్లో వాటాల విక్రయం ద్వారా మొత్తం రూ.72,000 కోట్ల నిధులు సమీకరించాలన్న లక్ష్యాన్ని కేంద్రం విధించుకుంది. ఇందులో రూ.46,500 కోట్లను మైనారిటీ వాటాల విక్రయం ద్వారా, రూ.15,000 కోట్లు వ్యూహాత్మక వాటాల విక్రయం ద్వారా, రూ.11,000 కోట్లు బీమా కంపెనీల లిస్టింగ్ ద్వారా సమీకరించనుంది. ఇప్పటికే పలు కంపెనీల్లో వాటాల విక్రయంతో రూ.8,000 కోట్ల సమీకరణ పూర్తయింది.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)




మినీరత్న ప్రభుత్వ రంగ కంపెనీ అయిన బీడీఎల్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోంది. గైడెడ్ క్షిపణులు, వాటి అనుబంధ రక్షణ పరికరాల తయారీలో ఉంది. ఈ ఏడాది జనవరి నాటికి అధీకృత మూలధనం రూ.125 కోట్లు. 2015–16లో రూ.563 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కంపెనీ నికర విలువ రూ.1,652 కోట్లు.

గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్



కోల్‌కతా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ... నేవీ, కోస్ట్‌గార్డ్‌లకు యుద్ధనౌకలు, సహాయక నౌకలను తయారు చేస్తోంది. అధీకృత మూలధనం రూ.125 కోట్లు. 2015–16లో లాభం 160 కోట్లు. నికర విలువ 1,064 కోట్లు.

మజగాన్ డాక్ (ఎండీఎల్)



ముంబై కేంద్రంగా పనిచేస్తున్న మినీరత్న కంపెనీ ఇది. ప్రస్తుతం 3 భారీ యుద్ధనౌకలు, ఒక సబ్‌మెరైన్ నిర్మాణ పనులను చూస్తోంది. 2016 మార్చికి అధీకృత మూలధనం రూ.323.72 కోట్లు. పెయిడప్ క్యాపిటల్ రూ.249 కోట్లు. 2015–16లో 637 కోట్ల లాభాన్ని ఆర్జించింది. నికర విలువ రూ.2,846 కోట్లు.

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)



హైదరాబాద్‌లో కేంద్రీకృతమై ఉన్న ఈ సంస్థ... మెటల్స్, అలాయ్స్ తయారీలో ఉంది. అధీకృత మూలధనం రూ.200 కోట్లు. 2015–16లో లాభం రూ.118 కోట్లు. నికర విలువ రూ.576 కోట్లు.

ఐటీఆర్ ఫైలింగ్‌కు నేడే ఆఖరు!

అర్ధరాత్రి వరకూ పనిచేయనున్న ఐటీ కార్యాలయాలు



న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖకు సమర్పించాల్సిన 2016–17 సంవత్సరపు ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలుకు శనివారంతో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఐటీ కార్యాలయాలు అర్ధరాత్రి వరకూ పనిచేయనున్నాయి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లకు సేవలందించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ఐటీ విభాగం తెలియజేసింది. నిజానికి జూలై 31వ తేదీతో గడువు ముగిసింది. కానీ ఆ రోజు చివరి రోజు కావటంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఫలితంగా చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఈ–ఫైలింగ్ సైట్‌లోకి లాగిన్ కాలేకపోయారు. దీనికి సంబంధించి పలు ఫిర్యాదులు రావటంతో గడువును మరో ఐదు రోజులు పొడిగించి ఆగస్టు 5వ తేదీగా నిర్ణయించారు. నిజానికి ఐటీఆర్ ఫైలింగ్‌కు ఆధార్‌ను లింకు చేయటం వల్ల కూడా సమస్యలు ఎదురయ్యాయి. అయితే ఆధార్ కార్డును పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోవడానికి మరింత సమయం ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు 31వ తేదీ లోపు అనుసంధానం పూర్తి చేసుకోవాలని ఐటీ శాఖ స్పష్టం చేసింది.

ఆధార్, పాన్ అనుసంధానం జరగాల్సిందే...

'ఐటీఆర్ ఫైలింగ్‌కు ఆధార్ తప్పనిసరి చేయడం వల్ల కూడా సమస్యలు ఎదురయ్యాయి. కొన్ని సందర్భాల్లో ఆధార్, పాన్ కార్డు డేటా సరిపోవడం లేదు. అప్పుడు రెండింటి అనుసంధానంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి' అని అధికార వర్గాలు చెప్పాయి. ఇప్పుడు ఈ–ఫైలింగ్ రిటర్న్స్‌కు ఆధార్ నంబర్ లేదా ఆధార్‌కు దరఖాస్తు చేసుకున్న అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ సరిపోతుందని, తర్వాత ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. కానీ ఈ అనుసంధానం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగస్ట్ 31 లోపు పూర్తవ్వాలని స్పష్టంచేసింది. ఆధార్, పాన్ అనుసంధానం పూర్తయితేనే రిటర్న్స్ ప్రక్రియ పూర్తవుతుందని హెచ్చరించింది. వార్షికంగా రూ.5 లక్షల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు, లేదా 80 సంవత్సరాల పైబడినవారు మినహా మిగిలిన వ్యక్తులు ఐటీఆర్ ఈ–ఫైలింగ్ తప్పనిసరి.


బెంగళూరులో హెలీ ట్యాక్సీ టేకాఫ్



Nava Bh Ventur	131.75	132.55
Neha Inter	6.04	6.11
Neocure Ther	3.6	3.26
Neuland Lab	1425	1443.55
Nile	622	614.85
Oil Country	46.8	45.1
Ortin labs	16.4	16.3
Pankaj Poly	8.66	8.25
Panyam Cemen	63.05	62.9
PennAlum	0.21	0.21
PennInd	54.8	55
Phytochem I	62.9	59.75
Pitti Lamin	53.85	54.35
Pokarna	1286	1282.4
Prajay Engs	10	9.63
PremiExpl	485.1	460.3
Prism Cement	118.45	116.95
Raasi Refrac	5.13	5.39
Ragsan Petro	66.15	63
Rain Industries	129	129.9
Raj Packagin	57.8	55.25
Ram Informat	46.4	44.25
Restile Cer	5.41	5.51
Roopa Indus	11.6	12.1
Saamya Biotech	1.88	1.88
Sagar Cem	822	836.45
Samkrg Pist	289	293.85
Sampre Nutri	44.55	46.85
SangInd	93.9	91.35
Satvah. Ispat	44	44
Saven Techno	22.8	23
Secund	0.92	0.93
Sibar Auto	11.94	11.38
Softpro Sys	4	3.81
South Bio Tech	3.7	3.73
SrRayAlk	29.9	30.35
Srinivasa Ship	62.65	64.9
Sujana Metal	1.83	2.02
Sujana Towers	4.6	4.52
Sujana Univers	1.15	1.18
Surana Tele	5.14	5.02
Suryachakra Pow	1.63	1.65
Suryalata Sp	143	136
Suryava Spin	9.88	9.45
SuvarCem	164.15	165.35
Suven Pharma	168.5	170.05
TCI Finance	22.7	23.3
Taj Gvk Hotel	164.95	165
Tanla Solutions	35	35.7
Trans Biotek	2.47	2.6
Transport Co	297	301.6
Trendy Knit	0.2	0.21
Usher Agro	7.73	8.13
VBC Ferro	42.7	42.7
VST Indus	2905	2950
Vamshi Rubb	65.8	68.5
Viceroy Hotels	18.7	18.6
VijayTextil	63.3	63.1
Vimta Labs	136.3	137.75
Virat Crane	37.95	36.85
Virinchi Con	90.55	88.35
VisakaInd	487	489.5
Vision Tech	1.47	1.54
Vista Pharma	31.15	30.6
Vivimed Labs	123.15	120.35
ZenoTech Lab	51	51.7



భద్రాద్రిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. వారికి స్వామివారి చిత్రపటం, పసుపు, కుంకుమ, పూజా సామగ్రి అందజేశారు.

రామయ్యకు వైభవంగా కలశాభిషేకం..

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం పవిత్రారోహణం వేడుక వైభవోపేతంగా జరిపించారు. ముందుగా మూలవరులకు ధరింపజేసి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తాయారమ్మ వారికి, ఆంజనేయ స్వామి వారికి, భక్త రామదాసు, గోదాదేవి ఆలయాలకు, ఉత్సవమూర్తులకు వేశారు. తదుపరి ఆలయానికి, ధ్వజస్తంభానికి, బలిపీఠానికి పవిత్రాలను ధరింపజేశారు. అర్చకులు కూడా పవిత్రాలను ధరించారు.

మీ కేసుల చిట్టా గాంధీభవన్‌కు పంపిస్తా

చదివి ఆత్మవిమర్శ చేసుకోండి

కాంగ్రెస్ నాయకులకు మంత్రి హరీశ్ హితవు

- సీఎం కేసీఆర్ ఆవేదనను అర్థం చేసుకోలేరా?
- ఈ రోషం ఆనాడు ఏమైందని ప్రశ్న



సాక్షి, సిద్దిపేట: మా ప్రభుత్వానికి ప్రజలే హైకమాండ్ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని చెప్పారు. చిల్లర రాజకీయాలు చేస్తూ ప్రతి పనికీ అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల మూలంగా ప్రాజెక్టులు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ ఇతర అభివృద్ధి ఆగిపోతోందని, ప్రతీది కోర్టులో కేసులు వేసి మోకాలడ్డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవేదన చెందితే, దీన్ని కాంగ్రెస్ నాయకులు అర్థం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన ఐదుగురు కాంగ్రెస్ నాయకులే కేసులు వేశారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో వాదిస్తున్నది కాంగ్రెస్ నాయకులు కాదా? అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కళాభారతి నిర్మించవద్దని, అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టవద్దని, అమరుల స్తూపం కట్టవద్దని, రోడ్డు వెడల్పు చేయవద్దని, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేయవద్దని కేసులు వేసింది ఎవరని హరీశ్ నిలదీశారు. పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని, వీటిని గాంధీభవన్‌కు పంపిస్తాం.. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చదువుకోవాలని సూచించారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసినప్పుడు, నల్లగొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో ఫ్లోరైడ్ బాధితులను పట్టించుకోనప్పుడు, తెలంగాణలో నిర్మించే థర్మల్ పవర్ ప్రాజెక్టు విజయవాడకు తరలించినప్పుడు, స్పెషల్ ప్యాకేజీ కింద చిత్తూరు జిల్లాకు వేల కోట్లు కేటాయించినప్పుడు మీ రోషం ఏమైందని ప్రశ్నించారు. మిషన్ కాకతీయ, భగీరథ పథకాలను దేశ, విదేశాల ప్రతినిధులు, నీతి ఆయోగ్ కమిటీ ప్రశంసించినది గుర్తు చేశారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయని, పంటలు ఎండిపోతుంటే వర్షాల కోసం ఎదురు చూసే దీనస్థితి నుంచి తెలంగాణ రైతాంగం బయట పడుతోందన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తాడిచెర్ల బ్లాక్ ప్రైవేటుకు..

ఏఎంఆర్ కంపెనీకి తవ్వకం పనులు అప్పగించిన సింగరేణి

- 25 ఏళ్లపాటు ఓబీ, బొగ్గు తవ్వకాలకు ఒప్పందం
- తాడిచర్ల శివారు కాపురం గ్రామంలో మొదలైన పనులు



కోల్‌బెల్ట్(భూపాలపల్లి): సింగరేణిలో నూతన అంకానికి తెరలేచింది. సంస్థ ఆవిర్భావం నుంచి భూగర్భ గనులు.. ఓసీల్లో సొంతంగా బొగ్గు వెలికితీయడంతో పాటు విదేశాల్లోనూ బొగ్గు వెలికితీతకు ప్రయత్నిస్తున్న సింగరేణి పురిటిగడ్డపై బొగ్గు వెలికితీత పనులను ప్రైవేటుకు అప్పగించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల బ్లాక్-1 పరిధిలో ఓసీ తవ్వకం పనులను ఏఎంఆర్ అనే ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. ఈ కంపెనీ 25 ఏళ్లపాటు ఓవర్ బర్డెన్ (ఓబీ-పైన మట్టి తవ్వడం), బొగ్గు వెలికితీత పనులు చేయనుంది. ఈ మేరకు తాడిచెర్ల సమీపంలోని కాపురం గ్రామ పరిసరాల్లో 15 రోజులుగా పనులు కొనసాగిస్తోంది.

నెల క్రితమే ఒప్పందం

తాడిచెర్ల బ్లాక్-1 పరిధిలో పనులను ఏఎంఆర్ కంపెనీకి అప్పగిస్తూ గతంలోనే నిర్ణయం తీసుకోగా.. నెల క్రితం ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులను ప్రైవేట్ కంపెనీలు దక్కించుకున్నా..తెలంగాణ రాష్ట్రంలో ఇదే మొదటిసారి. సింగరేణిలో ఓబీ పనులు నిర్వహిస్తున్న ఏఎంఆర్ టీఎస్ జెన్‌కోతో 25 ఏళ్లపాటు ఓబీతోపాటు బొగ్గును ఎండీఓ (మైన్ డెవలపర్ కం ఆపరేటర్) పద్ధతిలో వెలికితీసేందుకు అప్పగిస్తూ ఒప్పందం చేసుకున్నాయి. మరో 3 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించేందుకు ఏఎంఆర్ సంస్థ సిద్ధమవుతుండగా తొలిదశలో పనులు చేపట్టింది.

సింగరేణిని కాదని..

సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేస్తూ విదేశాల్లో సైతం బొగ్గు వెలికితీతకు చర్యలు తీసుకుంటామని గతంలో చెప్పిన తెలంగాణ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. అపార అనుభవం గల సింగరేణిని కాదని ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడంతో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి మార్గాలు లేకుండా పోనున్నాయి. ఈ పనులకు టెండర్ దక్కించుకున్న ఏఎంఆర్ సంస్థ వారి టెక్నాలజీతో పాటు మ్యాన్‌పవర్‌ను సైతం సమకూర్చుకొని పనులను చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భూములు కోల్పోయిన నిర్వాసితులు సైతం ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

ప్రైవేట్‌పై ఆగ్రహం

ప్రపంచవ్యాప్తంగా నూతన పరిజ్ఞానంతో ఏటా 60 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తూ 16 ఏళ్లుగా లాభాల బాటలో పయనిస్తున్న సింగరేణి సంస్థకు కాకుండా తాడిచెర్ల బ్లాక్-1 పరిధిలో ఓసీ పనులను ప్రైవేట్ కంపెనీకి అప్పగించడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తాడిచెర్ల బ్లాక్-1 పనులు చేపట్టే సామర్థ్యం కలిగిన సింగరేణి సంస్థను విస్మరించి ప్రైవేట్ రంగం వైపు తెలంగాణ ప్రభుత్వం మొగ్గు చూపడంపై విమర్శలు వస్తున్నాయి.

50 మిలియన్ టన్నుల బొగ్గు

ఏఎంఆర్‌కు అప్పగించిన తాడిచెర్ల బ్లాక్-1 పరిధి ఓసీలో 4.75 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో 50 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ)లోని ప్లాంట్-2కు బొగ్గు సరఫరా చేసేందుకు ఈ బ్లాక్‌ను జెన్‌కోకు అప్పగించింది. కేటీపీపీ 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావటంతో 2017 జనవరి నుంచే తాడిచర్ల బ్లాక్-1లో ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా, భూసేకరణ ఆలస్యం కావటంతో పనులు ప్రారంభం కాలేదు. కాగా, 2007లో తాడిచర్ల బ్లాక్-1ను అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పీఎల్‌ఆర్ కంపెనీకి కేటాయిస్తూ నిర్ణయం తీసుకోగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలు రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఆ తర్వాత సీఎం రోశయ్య ఈ నిర్ణయాన్ని విరమించుకొని తాడిచెర్ల బ్లాక్-1ను జెన్‌కో యాజమాన్యంగా ఉంటూ కోల్ ఆపరేషన్‌ను సింగరేణికి ఇస్తూ 2010 ఫిబ్రవరి 10న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తాడిచెర్ల బ్లాక్-1 పరిధి ఓసీని ఏఎంఆర్‌కు కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.

నిట్‌లో తరగతుల బహిష్కరణ

డైరెక్టర్ నిర్ణయానికి నిరసన

బహిష్కరణ దిశగా కౌన్సిల్ ఎన్నికలు?

కాజీపేట అర్బన్: వరంగల్‌లోని జాతీయ సాంకేతిక కళాశాల (నిట్)లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను బహిష్కరించే దిశగా విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో నిట్ డైరెక్టర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. నిట్‌లో ఈ నెల 10న స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి, ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా 56 మందిని ఎన్నుకునేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కౌన్సిల్‌లో నిట్ డైరెక్టర్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ చీఫ్ ప్యాటర్న్‌లది ప్రధాన భూమికగా ఉంటుంది. కాగా, ఏటా కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్నారు. అయితే, నిట్ డైరెక్టర్ జీఆర్‌సీ రెడ్డి తాజాగా ఈ నిబంధనను మార్చి సీజీపీఏ 7.5 సాధించిన విద్యార్థులే అధ్యక్ష పదవికి అర్హులని, పీహెచ్‌డీ స్కాలర్లు పోటీ చేయకూడదని ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం విద్యార్థులు నిట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. శుక్రవారం తరగతులను బహిష్కరించి.. విద్యార్థుల సంతకాలను సేకరించారు. ఇదిలా ఉండగా, నిట్‌లో చోటుచేసుకున్న సంఘటనను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖకు విద్యార్థులు ట్వీటర్ ద్వారా ఫిర్యాదు చేశారు.

లైంగికదాడికి యత్నించారు

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా రైతు వేడుకోలు

మహదేవపూర్ (మంథని): అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్నారంటూ బెదిరించి.. తనపై లైంగిక దాడికి యత్నించిన అటవీశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా రైతు తలారి సుశీల కోరింది. మహదేవపూర్‌లో శుక్రవారం ఆమె విలేకరుల ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. ఆమె మాటల్లోనే.. 'మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామ శివారు సర్వే నంబర్ 167/15లోని మూడు ఎకరాల్లో మేం గతకొన్నేళ్లుగా పత్తి పండించుకొని జీవిస్తున్నాం. శుక్రవారం సాయంత్రం నేను పత్తి చేనులో పనిచేస్తుండగా అటవీశాఖకు చెందిన సూరారం సారేదార్ దేవదాసు, చౌకీదార్ మక్బూల్ వచ్చారు. నన్ను పిలిచి ఈ భూమిలో ఎందుకు పనిచేస్తున్నావ్.. నీ భర్త ఎక్కడ ఉన్నాడు? అని అడిగారు. ఇక్కడ లేడని చెప్పడంతో పత్తి మొక్కలు పీకేశారు. ఇదేమిటని ప్రశ్నించగా వారిద్దరూ కలసి పట్టుకొని ఎత్తుకెళ్లి జీపులో వేశారు. బిగ్గరగా అరవడంతో నోటికి దస్తీ కట్టారు. లైంగిక దాడికి యత్నిస్తుండగా.. నేను కాలితో తన్నడంతో నన్ను జీపులో నుంచి కిందపడేసి వెళ్లారు. దీంతో నా భర్తతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాను. అయితే, పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు' అంటూ కన్నీరుమున్నీరుగా రోదించింది. తనపై లైంగిక దాడికి పాల్పడిన అటవీశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. సుశీల భర్త బుజ్జయ్య మాట్లాడుతూ.. తాము తాతల కాలం నుంచి ఈ భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. పట్టా భూమిలో పత్తి వేసినప్పటికీ తమకు లంచం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు వేధించారని, దీంతో వారిద్దరికీ రూ.80 వేలు కూడా ఇచ్చానని తెలిపాడు. ఈ ఏడాది రూ.50 వేలు ఇచ్చానని, ఇంకా రూ.30 వేలు కావాలని బెదిరిస్తున్నారని, తర్వాత ఇస్తానని చెప్పినా పత్తి చేనును ధ్వంసం చేశారని వాపోయాడు. అలాగే, తాను లేనిది చూసి, ఒంటరిగా ఉన్న తన భార్యపై అత్యాచార యత్నానికి పాల్పడ్డారని తెలిపాడు. దీనిపై అటవీశాఖ ఉన్నతాధికారులు, పోలీసులు విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరాడు.

అత్యాచార యత్నం చేయలేదు : దేవదాసు

ఎలికేశ్వరం శివారులోని రిజర్వు ఫారెస్ట్‌లో అక్రమంగా దున్నుకొని పత్తి పంట వేసిన బుజ్జయ్య, సుశీలకు ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. దీంతో మేం వెళ్లి శుక్రవారం పత్తి పంట పీకేశాం. సుశీలపై మేం అత్యాచార యత్నం చేయలేదు.

మేకను మింగిన కొండచిలువ



టేకులపల్లి(ఇల్లెందు): నీరు తాగేందుకు వెళ్లిన మేకను కొండ చిలువ మింగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రంలోని దాసుతండాకు చెందిన వాంకుడోతు రాములు తన మేకలను మేత కోసం ముక్కుమడుగు వాగు వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కొన్ని మేకలు వాగులో నీరు తాగేందుకు వెళ్లాయి. పొదల్లో మాటు వేసి ఉన్న సుమారు పదిహేను అడుగుల పొడవున్న కొండ చిలువ మేకను పట్టుకొని మింగింది. గమనించిన రాములు తన వద్ద ఉన్న గొడ్డలితో కొండచిలువను నరికి చంపాడు.

కేటీపీపీలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

క్రమబద్ధీకరణలో పేరు లేదని మనస్తాపం

గణపురం (భూపాలపల్లి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు ఉమాశంకర్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇటీవల ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించింది. ఈ జాబితాలో ఉమాశంకర్ పేరులేకపోవడంతో మనస్తాపం చెందాడు కేటీపీపీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నా తన పేరు జాబితాలో రాలేదని సంబంధిత కాంట్రాక్టర్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా.. తోటి కార్మికులు అడ్డుకున్నారు.

ఏసీటీఓ ఇంటిపై ఏసీబీ దాడులు

- కుటుంబీకులు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు
- రూ.5 కోట్ల మేర ఆస్తులున్నట్లు గుర్తింపు!


జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వాణిజ్య పన్నుల కార్యాలయంలో ఏసీటీఓగా విధులు నిర్వర్తిస్తున్న బత్తిని సురేందర్‌గౌడ్, ఆయన బంధువుల ఇళ్లపై శుక్రవారం ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బాదేపల్లిలోని తాలూకా క్లబ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సురేందర్‌గౌడ్ ఇంట్లో తెల్లవారుజామున ఐదున్నర గంటల ప్రాంతంలో అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 49 తులాల బంగారు ఆభరణాలు, 1.30 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ఇందిర, కుమార్తె స్వప్న పేరిట మూడు ప్లాట్లు, రెండు కార్లు, విద్యానగర్ కాలనీలో ఆయన కుమారుడు శ్రీకాంత్ గౌడ్ పేరిట పది పోర్షన్లు కలిగిన మూడు అంతస్తుల అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే, మహబూబ్‌నగర్‌లో ఇరిగేషన్ డీఈగా పనిచేస్తున్న సురేందర్ అల్లుడు మురళీధర్‌గౌడ్ ఇంట్లోనే కాకుండా నల్లగొండ జిల్లా మోతె మండలం ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న కుమారుడు శ్రీకాంత్ గౌడ్ ఇంటిపై కూడా ఓ బృందం దాడులు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్ విలేకరులకు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఏటిదర్‌పల్లి, తిమ్మాజీపేట మండలం మారేపల్లి, జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామాల్లోని ఆయన బంధువుల ఇళ్లలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. కాగా, తనిఖీల సందర్భంగా ఏసీబీ అధికారులు సుమారు రూ.5 కోట్ల మేర ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

మర్రిగూడ/ఆమనగల్లు: అప్పుల బాధలు భరించలేక ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం రత్యాతండా రైతు రమావత్ మధు (29) తనకున్న మూడు ఎకరాల భూమితోపాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తి సాగుచేస్తున్నాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు కట్టాలని ఒత్తిడి పెరగడం, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మధు తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. అలాగే, రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం పోలేపల్లి కొత్తకుంట తండాలో రైతు కేతావత్ సీతారాం (36) మూడెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. మూడేళ్లుగా దిగుబడి బాగా తగ్గింది. అప్పుల విషయమై గొడవలయ్యాయి. ఆవేదనకు గురైన సీతారాం పురుగుమందు తాగి బలవన్మరణం చెందాడు.

రిమాండ్ ఖైదీ మృతి

- పోలీసుల దెబ్బలతో ఆస్పత్రిలో చేరిన వెంకటేశ్
- పరిస్థితి విషమించడంతో మృతి
- రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం



కరీంనగర్ క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల దెబ్బలు తాళలేక ఓ రిమాండ్ ఖైదీ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. గత నెలలో ఓ చోరీ కేసులో వేములవాడలోని సాయినగర్‌కు చెందిన వెంకటేశ్ (25)ను ఎల్లారెడ్డిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగైదు రోజుల తర్వాత విలేకరుల సమావేశంలో నాలుగు చోరీలు ఛేదించినట్లు ప్రకటించారు. అనంతరం అతన్ని కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత పీటీ వారంట్‌లో మరో చోరీకేసులో రిమాండ్ చూపారు. గతనెల 13న కరీంనగర్‌లోని జిల్లా జైలుకు పంపించారు. రిమాండ్ రిపోర్టులో వెంకటేశ్‌కు గాయాలున్నట్లు పేర్కొన్నారు. రిమాండ్ ఖైదీ నంబర్ 1119 కేటాయించారు. జైలుకు వచ్చినప్పటి నుంచి అనారోగ్యంగా ఉండటంతో జైలు సిబ్బంది గతనెల 15న కరీంనగర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. మందులు తీసుకున్నా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో అదే నెల 21న మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తర్వాత నాలుగు రోజులపాటు జిల్లా జైలులో చికిత్స అందించినా దెబ్బలు తగ్గలేదు. దీంతో గతనెల 26న సివిల్ ఆస్పత్రికి పంపించగా మెరుగైన చికిత్స అందించాలని ఆస్పత్రివర్గాలు చెప్పడంతో ఇన్‌పేషెంట్‌గా చేర్చారు. గురువారం వెంకటేశ్ ఆరోగ్యపరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించాలని జైలు సిబ్బందికి ఆస్పత్రి వర్గాలు సూచించాయి. ఇందుకు ఏర్పాట్లు చేస్తుండగానే శుక్రవారం తెల్లవారుజామున వెంకటేశ్ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ తెలిపారు. వెంకటేశ్ రిమాండ్ ఖైదీ కావడంతో నిబంధనల ప్రకారం జిల్లా జడ్జి, ఆర్డీవో, తహసీల్దార్ ఆస్పత్రికి చేరుకుని జ్యుడీషియల్ విచారణ ప్రారంభించారు.

పోలీసులే కొట్టి పొట్టనబెట్టుకున్నారు : మృతుడి భార్య రేణుక

తన భర్తను పోలీసులే కొట్టి పొట్టనబెట్టుకున్నారని వెంకటేశ్ భార్య రేణుక ఆరోపిస్తోంది. గత నెలలో తన భర్తను ఎల్లారెడ్డిపేట పోలీసులు తీసుకెళ్లారని.. అక్కడకు వెళ్తే చూపించకుండా సీసీఎస్‌లో ఉన్నారని, మరోసారి వేములవాడలో ఉన్నారంటూ చూపించలేదని పేర్కొంది. చివరికి ఎల్లారెడ్డిపేటలో ఉన్నాడని తెలిసి వెళ్తే రిమాండ్‌కు పంపినట్లు తెలిసిందనీ, జైలుకు పోతే చేయని నేరాన్ని కొట్టి పోలీసులే ఒప్పించిండ్రని తన భర్త దెబ్బలు చూపించాడని రోదిస్తూ తెలిపింది. చిన్న పిల్లలున్నారనే కనికరం లేకుండా పోలీసులే వెంకటేశ్‌ను కొట్టి చంపారని కన్నీరుపెట్టుకుంది.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ

షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.సి.నెం.34/2016/DM తేది: 01.08.2017

తెలంగాణకు హరితహారము పథకము క్రింద జగిత్యాల జిల్లాలో 2017-18 సంవత్సరమునకు గాను నర్సరీలలో పెంచుటకు అవసరమైన నాటదగిన టేకు స్టంప్‌లు (బొటనవ్రేలు మందము) సరఫరా చేయడానికి ఉత్పత్తి దారులు మరియు సరఫరాదారుల నుండి సీల్డు టెండర్లు కోరనైనది.

టెండరు ఫారము **రూ. 300/-** డి.డి. రూపములో జిల్లా అటవీశాఖాధికారి, జగిత్యాల గారి పేరున ఏదైన జాతీయ బ్యాంకులో చెల్లుబాటు అయ్యే విధంగా చెల్లించి తేది: **01.08.2017 నుండి తేది: 05.08.2017 ఉ॥ 11.00 గం॥ల వరకు** కార్యాలయము వేళల్లో అటవీశాఖాధికారి, జగిత్యాల నుండి పొందవచ్చును. టెండరు స్వీకరణ చివరి తేది: **05.08.2017 సమయం మ॥ 12.00 గం॥ వరకు,** టెండరు వెంట **రూ. 10,000/- (అక్షరాల పదివేలు మాత్రమే)** (ఇ.ఎమ్.డి.) డి.డి. రూపములో జిల్లా అటవీశాఖాధికారి జగిత్యాల గారి పేరున ఏదైన జాతీయబ్యాంకు నుండి తీసిన డి.డి.ని జతపరుచవలెను. సీల్డు టెండర్లు తేది: **05.08.2017 సా॥ 4.00 గం॥లకు** తెరువబడును.

సం/- జగిత్యాల అటవీ శాఖాధికారి, జగిత్యాల

DIPR RO. No. 1296/CL/ADVT/1/1/2017-18 Dt: 04.08.17

ఫారం - VI

(చట్టం 30/2013లోని నిబంధన 19లో ఉప నిబంధన (1) మరియు సెక్షను 11(1) చూడండి)

తెలంగాణ ప్రభుత్వం

రెవెన్యూ (LA) శాఖ

కలెక్టర్/జాయింట్ కలెక్టర్ ప్రిలిమినరీ నోటిఫికేషన్

No. G/1248/2017 తేది: -06-2017

గెజిట్ నం. 41/2017 తేది: -06-2017

నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తి డివిజన్ **వెల్దండ మండలంలోని కోట్ర గ్రామంలోని ఎ.0.17 గుంటల** మొత్తం విస్తీర్ణం గల భూమి ప్రజోపయోగార్థం అంటే వెల్దండ మండలంలోని కోట్ర గ్రామం వద్ద 500 KLGLBR నిర్మాణం కోసం అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ భావిస్తున్నారు.

అందువలన నాగర్ కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని కోట్ర గ్రామం వద్ద మిషన్ భగీరథ పథకం క్రింద వెల్దండ మండలంలో కోట్ర గ్రామం వద్ద 500 KLGLBR నిర్మాణం కోసం ప్రామాణిక కొలత **ఎ.0.17 గుంటల** కంటే ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం గల భూమి భాగం సేకరణ కోసం పైన తెలిపిన భూములు అవసరమై ఉన్నాయని ప్రకటించడమైనది. సేకరించనున్న భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

క్ర. సం.	సర్వే నం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం (ఎకరాలలో) (ఎ.-గుం.)	పట్టాదారు పేరు తండ్రి/ భర్త పేరుతో	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు	కట్టడాలు
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	510	పట్టా	మెట్టా	0.17	రామోజు లక్ష్మణచారి తండ్రి లింగయ్య	504, 505	--	511, 512	509	1మామిడి చెట్టు	లేవు
మొత్తం				**0.17**							

భూమి ప్లానును జిల్లా కలెక్టర్ కార్యాలయం, నాగర్ కర్నూల్ మరియు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం, కల్వకుర్తిలో ఏ పనిరోజునైనా పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్12లో ఏర్పాటు చేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా వారి పనికోసం **వెల్దండ మండలంలోని కోట్ర గ్రామం** వద్ద మిషన్ భగీరథ పథకం క్రింద వెల్దండ మండలంలో కోట్ర గ్రామం వద్ద 500 KLGLBR నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్, నాగర్ కర్నూల్ వారు భూమిలోకి ప్రవేశించి, సర్వే చేసి ఏదేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోరువేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కల్వకుర్తి వారికి మరియు వారి సిబ్బందికి అధికారం ఇస్తున్నారు.

చట్టంలోని సెక్షను 11(4) క్రింద కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుంచి ఏ వ్యక్తి భూమికి సంబంధించి ఎటువంటి వ్యవహారములు అంటే అమ్మకం/ కొనుగోలు మొదలగునవి చేయరాదు లేదా సదరు భూమి పై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు లేదా దానికి కారణం కారాదు.

సేకరణకు ఏవేని అభ్యంతరాలు ఉంటే ప్రయోజనంగల వ్యక్తి జిల్లా కలెక్టర్ సమక్షంలో చట్టంలోని సెక్షను 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై) రోజులలోగా దాఖలు చేయవచ్చును.

సం/- **భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, నాగర్ కర్నూల్**
సం/- **జాయింట్ కలెక్టర్ నాగర్ కర్నూల్**
సం/- **జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్**

ఫారం - C

(10A మినహాయింపు ఇచ్చిన దానిలో సెక్షన్ 11 క్రింద) (రూల్ 6/12 చూడండి)

తెలంగాణ ప్రభుత్వం

రెవెన్యూ (భూ. సే.) శాఖ

No. B1/844/2013 తేది: 31.07.2017

గెజిట్ నం. 56/2017 తేది: 03.08.2017

మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ డివిజన్, నర్వ మండలంలోని లక్కర్‌దొడ్డి గ్రామం లోని ఎ.1-82 సెంట్ల మొత్తం విస్తీర్ణం గల భూమి ప్రజోపయోగార్థం బూద్పూర్ బ్యాలన్సింగ్ రిజర్వాయర్ కి.మీ. 0-237 నుండి కి.మీ. 0-700 వరకు ఎడమ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ 13 త్రవ్వకం కోసం అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ భావిస్తున్నారు.

అందువలన మహబూబ్‌నగర్ జిల్లా, నర్వ మండలం, లక్కర్‌దొడ్డి గ్రామం వద్ద పై సదరు ప్రాజెక్ట్ కోసం ప్రామాణిక కొలత ఎ.1-82 సెంట్ల కంటే ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం గల భూమి అవసరమై ఉన్నదని ప్రకటించడమైనది. సేకరించనున్న ప్రతిపాదిత భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

గ్రామం: లక్కర్‌దొడ్డి మండలం: నర్వ జిల్లా: మహబూబ్‌నగర్

క్ర. సం.	సర్వే నం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ క్రింద ప్రతిపాదిత విస్తీర్ణం (ఎ.-సెంట్లు)	పట్టాదారు/ తండ్రి/ భర్త పేరు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు	కట్టడాలు	ఇరిగేషన్ వనరులు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	116	పట్టా	మెట్ట	1.05	భగవంత్‌రెడ్డి తండ్రి బుచ్చారెడ్డి (0.61) నర్సింహ్మారెడ్డి తండ్రి అయ్యపురెడ్డి (0.38) నాగిరెడ్డి తండ్రి అయ్యపురెడ్డి (0.06)		117	163	120	టిన్ షెడ్	-	-
2	117	పట్టా	మెట్ట	0.77	నాగిరెడ్డి తండ్రి అయ్యపురెడ్డి (0.22) నర్సిరెడ్డి తండ్రి నాగిరెడ్డి (0.55)	116	143	118	157	-	-	-
				1-82	మొత్తం							

ఈ ప్రకటన సంబంధితులందరికీ రైట్ టు కాంపెన్సేషన్ అండ్ ట్రాన్సపరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (తెలంగాణ అమెండ్‌మెంట్) యాక్ట్, 2016 (యాక్ట్ నం. 21ఆఫ్ 2017) ద్వారా సవరించిన విధంగా రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్సపరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్ 2013 (సెంట్రల్ యాక్ట్ నం. 30/2013)లోని సెక్షన్ 11(1)లోని నిబంధనల క్రింద చేయబడినది.

భూమి ప్లానును జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం LA & R&R యూనిట్-I ఇరిగేషన్ ప్రాజెక్ట్ మహబూబ్‌నగర్‌లో ఏ పనిరోజునైనా పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్12లో ఏర్పాటు చేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా వారి పనికోసం తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ కమ్ అప్రాప్రియేట్ గవర్నమెంట్ వారు భూమిలోకి ప్రవేశించి, సర్వే చేసి ఏదేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోరువేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R, యూనిట్-I, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ అధికారి వారికి మరియు వారి సిబ్బందికి అధికారం ఇస్తున్నారు.

చట్టంలోని సెక్షను 11(4) క్రింద కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుంచి ఏ వ్యక్తి భూమికి సంబంధించి ఎటువంటి వ్యవహారములు అంటే అమ్మకం/ కొనుగోలు మొదలగునవి చేయరాదు లేదా సదరు భూమి పై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు లేదా దానికి కారణం కారాదు.

సేకరణకు ఏవేని అభ్యంతరాలు ఉంటే ప్రయోజనంగల వ్యక్తులు/పరిహారం సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్‌కు ప్రభావితులైన వారందరి నుండి క్లెయిమ్‌లను జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R, యూనిట్-I, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ సమక్షంలో చట్టంలోని సెక్షను 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై) రోజులలోగా భూమి ప్రయోజనం గల వ్యక్తి దాఖలు చేయవచ్చును.

సం/- **స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R యూనిట్-I, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్**
సం/- **జాయింట్ కలెక్టర్ మహబూబ్‌నగర్**
సం/- **జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్**

ఫారం - C

(10A మినహాయింపు ఇచ్చిన దానిలో సెక్షన్ 11 క్రింద) (రూల్ 6/12 చూడండి)

తెలంగాణ ప్రభుత్వం

రెవెన్యూ (భూ. సే.) శాఖ

No. B2/519/2008 తేది: 31.07.2017

గెజిట్ నం. 26/2017 తేది: 03.08.2017

మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ డివిజన్, మఖ్తల్ మండలంలోని పంచలింగాల్ గ్రామంలోని ఎ. 1.05 సెంట్ల మొత్తం విస్తీర్ణం గల భూమి ప్రజోపయోగార్థం సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ హై.లెవెల్ ఎడమ ప్రధాన కాలువలో డిస్ట్రిబ్యూటరీ-2 యొక్క సబ్-మైనర్-4L/M-4R సబ్ మైనర్ 2L/M-5R మరియు మైనర్- 10R మరియు మైనర్-11R త్రవ్వకం కోసం అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ భావిస్తున్నారు.

అందువలన మహబూబ్‌నగర్ జిల్లా, మఖ్తల్ మండలం, పంచలింగాల గ్రామం వద్ద పై సదరు ప్రాజెక్ట్ కోసం ప్రామాణిక కొలత ఎ. 1.05 సెంట్ల కంటే ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం గల భూమి అవసరమై ఉన్నదని ప్రకటించడమైనది. సేకరించనున్న ప్రతిపాదిత భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

గ్రామం: పంచలింగాల్ మండలం: మఖ్తల్ జిల్లా: మహబూబ్‌నగర్

క్ర. సం.	సర్వే నం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ క్రింద ప్రతిపాదించిన విస్తీర్ణం (ఎ-సెంట్లు)	పట్టాదారు/ తండ్రి/ భర్త పేరు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు	కట్టడాలు	ఇరిగేషన్ వనరులు
										-	-	-
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1.	79	పట్టా	మెట్టా	0.09	ఆదిదాన్ తండ్రి చంద్రప్ప	77	78	81	83	-	-	-
2.	71	పట్టా	మెట్టా	0.96	గంగాధర్ తండ్రి నర్సిములు	83	81	72	70	-	-	-
				1-05	మొత్తం							

ఈ ప్రకటన సంబంధితులందరికీ రైట్ టు కాంపెన్సేషన్ అండ్ ట్రాన్సపరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (తెలంగాణ అమెండ్‌మెంట్) యాక్ట్, 2016 (యాక్ట్ నం. 21ఆఫ్ 2017) ద్వారా సవరించిన విధంగా రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్సపరెన్సీ ఇన్ ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్ 2013 (సెంట్రల్ యాక్ట్ నం. 30/2013)లోని సెక్షన్ 11(1)లోని నిబంధనల క్రింద చేయబడినది.

భూమి ప్లానును జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం LA & R&R యూనిట్-I ఇరిగేషన్ ప్రాజెక్ట్ మహబూబ్‌నగర్‌లో ఏ పనిరోజునైనా పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్12లో ఏర్పాటు చేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా వారి పనికోసం తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ కమ్ అప్రాప్రియేట్ గవర్నమెంట్ వారు భూమిలోకి ప్రవేశించి, సర్వే చేసి ఏదేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోరువేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు అధీకృత అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R, యూనిట్-I ఇరిగేషన్ ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ వారికి మరియు వారి సిబ్బందికి అధికారం ఇస్తున్నారు.

చట్టంలోని సెక్షను 11(4) క్రింద కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుంచి ఏ వ్యక్తి భూమికి సంబంధించి ఎటువంటి వ్యవహారములు అంటే అమ్మకం/ కొనుగోలు మొదలగునవి చేయరాదు లేదా సదరు భూమి పై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు లేదా దానికి కారణం కారాదు.

సేకరణకు ఏవేని అభ్యంతరాలు ఉంటే ప్రయోజనంగల వ్యక్తులు/పరిహారం సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్‌కు ప్రభావితులైన వారందరి నుండి క్లెయిమ్‌లను జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్ & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R, యూనిట్-I ఇరిగేషన్ ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ వారి సమక్షంలో చట్టంలోని సెక్షను 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుంచి 60 (అరవై) రోజులలోగా భూమి ప్రయోజనం గల వ్యక్తి దాఖలు చేయవచ్చును.

సం/- **స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA & R&R యూనిట్-I ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్**
సం/- **జాయింట్ కలెక్టర్ మహబూబ్‌నగర్**
సం/- **జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్**


సాక్షి స్పోర్ట్స్
శనివారం 5-8-2017



ఆనంద్ ఖాతాలో రెండో 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్వెఫీల్డ్ కప్ అంతర్జాతీయ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వరుసగా రెండో 'డ్రా' నమోదు చేశాడు. పీటర్ స్విడ్లెర్ (రష్యా)తో జరిగిన రెండో గేమ్‌లో నల్లపావులతో ఆడిన ఆనంద్ 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో... రెండో రౌండ్ తర్వాత ఆనంద్ ఒక పాయింట్‌తో మరో ఆరుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

రెండోదీ మనవైపే!



జడేజా

లంక గడ్డపై టీమిండియా మళ్లీ 600 పరుగులు చేసింది. రెండో టెస్టులోనూ బ్యాట్స్‌మెన్ గర్జించారు. టెయిలెండర్ల అసాధారణ పోరాట పటిమతో వరుసగా ఈ మ్యాచ్‌లోనూ ఆలౌట్ కాకుండా భారీ స్కోరు బాదేసింది. తద్వారా టెస్టును, సిరీస్‌ను సొంతం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంది.

సాహా, జడేజా అర్ధ సెంచరీలు • అశ్విన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

భారత్ తొలి ఇన్నింగ్స్ 622/9 డిక్లేర్డ్ • శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 50/2

కొలంబో: లంకతో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత బ్యాట్స్‌మెన్ సమష్టిగా కదం తొక్కారు. దీంతో మరోసారి 600 పరుగులు అవలీలగా సాధ్యమయ్యాయి. అశ్విన్ (92 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్), వృద్ధిమాన్ సాహా (134 బంతుల్లో 67; 4 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (85 బంతుల్లో 70 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీలు సాధించారు. ఓవర్‌నైట్ స్కోరు 344/3తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 158 ఓవర్లలో 622/9 భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. లంక బౌలర్లలో హెరాత్‌కు 4, పుష్పకుమారకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 2 వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. అశ్విన్ (2/38) ఓపెనర్లను అవుట్ చేశాడు. మరో మూడు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం శ్రీలంక, భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకంటే 572 పరుగులు వెనుకబడి ఉంది. మరోవైపు ఆతిథ్య జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఈ జట్టు ప్రధాన పేసర్ నువాన్ ప్రదీప్ తొడ కండరాల గాయంతో మిగతా సిరీస్‌కు దూరమయ్యాడు.

సెషన్-1 పుజారా, రహానే తొందరగానే...

ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్, సెంచరీ హీరోలు పుజారా (232 బంతుల్లో 133; 11 ఫోర్లు, 1 సిక్స్), రహానే (222 బంతుల్లో 132; 14 ఫోర్లు) తమ క్రితం రోజు స్కోరుకు పెద్దగా పరుగులేమీ జత చేయలేదు. ఆట మొదలైన రెండో ఓవర్లోనే కరుణరత్నే బౌలింగ్‌లో పుజారా వికెట్ల ముందు దొరికిపోయాడు. 'డీఆర్ఎస్'తో బౌలర్ ఈ ఫలితాన్ని రాబట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 217 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత అశ్విన్‌తో కలిసిన రహానే జట్టు స్కోరును 400 పరుగులు దాటించాడు. ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించాక పుష్పకుమార బౌలింగ్‌లో రహానే స్టంపౌట్ కావడంతో భారత్ 442/5 స్కోరు వద్ద లంచ్‌కు వెళ్లింది.

ఓవర్లు: 30, పరుగులు: 98, వికెట్లు: 2

సెషన్-2 టెయిలెండర్ల జోరు



సాహా

అప్పటికే కీపర్ సాహాతో కలిసి కుదురుగా ఆడుతున్న అశ్విన్ 91 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం కాసేపటికే హెరాత్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డయ్యాడు. టెస్టుల్లో అతనికిది 11వ అర్ధశతకం. తర్వాత సాహాకు హార్దిక్ పాండ్యా జత య్యాడు. అయితే వేగంగా ఆడే క్రమంలో పాండ్యా (20 బంతుల్లో 20; 3 ఫోర్లు) వికెట్‌ను సమర్పించుకున్నాడు. దీంతో 496 స్కోరు వద్ద భారత్ ఏడో వికెట్‌ను కోల్పోయింది. తర్వాత సాహా... జడేజా అండతో 113 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. పుష్పకుమార, పెరీరా బౌలింగ్‌లో జడేజా 2 సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో జట్టు స్కోరు 550 పరుగులకు చేరింది. మరో వికెట్ పడకుండా రెండో సెషన్‌ను ముగించారు.

ఓవర్లు: 30, పరుగులు: 111, వికెట్లు: 2

సెషన్-3 వడివడిగా 600 వైపు...



అశ్విన్

విరామంలో కెప్టెన్ కోహ్లి నుంచి డిక్లేర్ సంకేతం అందుకున్న సాహా, రవీంద్ర జడేజా వేగం పెంచారు. ఈ ప్రయత్నంలో హెరాత్ బౌలింగ్‌లో సాహా స్టంపౌట్‌గా నిష్క్రమించాడు. 70 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న జడేజాకు, షమీ (19; 2 సిక్సర్లు) జత య్యాడు. ఇద్దరు ధాటిగా ఆడారు. హెరాత్ ఓవర్లో షమీ వరుసగా రెండు భారీ సిక్స్‌లు బాదాడు. అతని మరుసటి ఓవర్లో జడేజా మరో సిక్సర్ కొట్టాడు. దీంతో కేవలం 8 ఓవర్లలోనే భారత్ 69 పరుగులు చేసింది. చివరకు 622/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి లంకకు బ్యాటింగ్ అవకాశమిచ్చింది. ఇక్కడే కోహ్లి వ్యూహం ఫలించింది. కెప్టెన్ తనమీద ఉంచిన నమ్మకాన్ని అశ్విన్ వమ్ము చేయలేదు. లంక ఓపెనర్లు తరంగ (0), కరుణరత్నే (45 బంతుల్లో 25; 2 ఫోర్లు)లను పెవిలియన్ చేర్చి... జట్టును కష్టాల్లో పడేశాడు. ఆట నిలిచే సమయానికి కుశాల్ మెండిస్ (16 బ్యాటింగ్), చండిమాల్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఓవర్లు: 8, పరుగులు: 69, వికెట్లు: 2 (భారత్), ఓవర్లు: 20, పరుగులు: 50, వికెట్లు: 2 (శ్రీలంక)

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పెరీరా 35; రాహుల్ (రనౌట్) 57; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) కరుణరత్నే 133; కోహ్లి (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13; రహానే (స్టంప్డ్) డిక్‌వెలా (బి) పుష్పకుమార 132; అశ్విన్ (బి) హెరాత్ 54, సాహా (స్టంప్డ్) డిక్‌వెలా (బి) హెరాత్ 67; పాండ్యా (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20; జడేజా (నాటౌట్) 70; షమీ (సి) తరంగ (బి) హెరాత్ 19; ఉమేశ్ యాదవ్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం (158 ఓవర్లలో) 622/9 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం: 1-56, 2-109, 3-133, 4-350, 5-413, 6-451, 7-496, 8-568, 9-598.

బౌలింగ్: ప్రదీప్ 17.4-2-63-0, హెరాత్ 42-7-154-4, కరుణరత్నే 8-0-31-1, పెరీరా 40-3-147-1, పుష్పకుమార 38.2-2-156-2, డిసిల్వా 12-0-59-0.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25, తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0; మెండిస్ బ్యాటింగ్ 16, చండిమాల్ బ్యాటింగ్ 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 50.**

వికెట్ల పతనం: 1-0, 2-33. **బౌలింగ్:** షమీ 3-1-7-0, అశ్విన్ 10-2-38-2, జడేజా 7-4-4-0.

1 శ్రీలంకలో వరుస టెస్టుల్లో ఒకే ఇన్నింగ్స్‌లో 600 పైచిలుకు పరుగులు చేసిన తొలి జట్టు టీమిండియా.

4 టెస్టుల్లో 200 వికెట్లు, 2000 పరుగులు చేసిన నాలుగో భారత ఆటగాడు అశ్విన్.

4 అంతర్జాతీయ క్రికెట్లో వేగవంతంగా ఈ ఘనత (200 + 2000) సాధించిన నాలుగో ఆటగాడిగా అశ్విన్ (51 టెస్టులు) రికార్డులకెక్కాడు. బోథమ్ (ఇంగ్లండ్, 42 టెస్టులు), కపిల్ (50 టెస్టులు), ఇమ్రాన్ (పాక్, 50 టెస్టులు) ముందు వరుసలో ఉన్నారు.



దీపిక-జోష్నా జంటకు కాంస్య పతకం

న్యూఢిల్లీ: ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో దీపిక పళ్లికల్-జోష్నా చినప్ప (భారత్) జంట పోరాటం ముగిసింది. ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో దీపిక-జోష్నా ద్వయం 11-6, 6-11, 8-11తో జెన్నీ డన్‌కాఫ్-అలీసన్ వాటర్స్ (ఇంగ్లండ్) జోడీ చేతిలో ఓడిపోయింది. దాంతో ఈ భారత జంటకు కాంస్య పతకం లభించింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో దీపిక-జోష్నా 10-11, 11-6, 11-8తో సమంత కార్నెట్-నికోల్ టాడ్ (కెనడా)లపై గెలిచారు.

ఇంగ్లండ్ 260/6

మాంచెస్టర్: దక్షిణాఫ్రికాతో శుక్రవారం మొదలైన నాలుగో టెస్టు మ్యాచ్‌లో తొలి రోజు ఇంగ్లండ్ జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 6 వికెట్లకు 260 పరుగులు చేసింది. జో రూట్ (52; 6 ఫోర్లు), బెన్ స్టోక్స్ (58; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా... ఓపెనర్ అలిస్టర్ కుక్ (46; 6 ఫోర్లు) రాణించాడు. బెయిర్‌స్టో (33 బ్యాటింగ్), రొలాండ్ జోన్స్ (0) క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడ, ఒలివీర్ రెండేసి వికెట్లు తీశారు. నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది.

భారత హాకీ క్రీడాకారిణి జ్యోతి గుప్తా ఆత్మహత్య



చండీగఢ్: భారత హాకీ క్రీడాకారిణి 20 ఏళ్ల జ్యోతి గుప్తా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం సాయంత్రం ఆమె మృతదేహం హరియాణాలోని రెవారి స్టేషన్ ట్రాక్స్‌పై కనిపించింది. చండీగఢ్-జైపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక్కసారిగా ఎదురుగా వెళ్లడంతో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు. జ్యోతి గతేడాది భారత్‌లోనే జరిగిన దక్షిణాసియా క్రీడల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

నెమార్ కోసం రూ.1,661 కోట్లు



ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ఖరీదైన బదిలీగా రికార్డు

- బార్సిలోనా క్లబ్ నుంచి పారిస్ సెయింట్-జెర్మయిన్ జట్టుకు మారిన బ్రెజిల్ స్టార్

మాడ్రిడ్: ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ చరిత్రలో శుక్రవారం అద్భుతం చోటు చేసుకుంది. బ్రెజిల్ జట్టు కెప్టెన్, స్టార్ ప్లేయర్ నెమార్ జూనియర్ కోసం ఫ్రాన్స్‌కు చెందిన పారిస్ సెయింట్-జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్ జట్టు కళ్లు చెదిరే మొత్తం చెల్లించింది. ప్రొఫెషనల్ లీగ్స్‌లో ప్రస్తుతం స్పెయిన్‌కు చెందిన బార్సిలోనా క్లబ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న నెమార్ ఇక నుంచి పీఎస్‌జీ జట్టుకు ఆడనున్నాడు. 2013లో బార్సిలోనా జట్టుతో చేరిన నెమార్ 2018 జూన్ వరకు బార్సిలోనాకు ఆడాల్సి ఉంది. అయితే నెమార్‌ను ఒప్పందం గడువు పూర్తికాక ముందే బదిలీ చేయాలంటే తమకు 22 కోట్ల 20 లక్షల యూరోలు (రూ. 1,661 కోట్లు) చెల్లించాలని పీఎస్‌జీ జట్టుకు బార్సిలోనా షరతు విధించింది. దీనికి అంగీకరించిన పీఎస్‌జీ జట్టు ఈ మొత్తాన్ని బార్సిలోనాకు చెల్లించి నెమార్‌ను కొనుగోలు చేసింది. 2022 వరకు పీఎస్‌జీ జట్టుకు ఆడనున్న నెమార్‌కు ఆ క్లబ్ ఏడాదికి 4 కోట్ల 50 లక్షల యూరోలు (రూ. 336 కోట్లు) వేతనంగా చెల్లించనుంది. దీంతో నెమార్ ప్రపంచంలో అత్యధిక మొత్తం తీసుకోనున్న ఫుట్‌బాలర్‌గా రికార్డు సృష్టించాడు. శుక్రవారం పారిస్ చేరుకున్న నెమార్ జట్టుతో చేరాడు. అతనికి 10వ నంబర్ జెర్సీని కేటాయించారు.

ఇప్పటివరకు ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ చరిత్రలో ఖరీదైన బదిలీ రికార్డు పాల్ పోగ్బా (ఫ్రాన్స్) పేరిట ఉంది. గతేడాది మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ 10 కోట్ల 50 లక్షల యూరోలు (రూ. 785 కోట్లు) జువెంటాస్ క్లబ్ (ఇటలీ)కి చెల్లించి పోగ్బాను కొనుగోలు చేసింది. తాజాగా నెమార్ ఈ రికార్డును సవరించాడు.

ఆ ఇద్దరిని లంక బ్యాట్స్‌మెన్ స్ఫూర్తిగా తీసుకోవాలి

సునీల్ గావస్కర్

శ్రీలంకపై రెండో టెస్టులోనూ భారత జట్టు మరో భారీ విజయం దిశగా పయనిస్తోంది. రెండో రోజు ఆటలో కోహ్లి సేన 600లకు పైగా పరుగులు చేయడంతో లంక కష్టాల్లో పడింది. బంతి ఇప్పటికే స్పిన్‌తో పాటు బౌన్స్ కూడా అవుతోంది. ఇక ఈ ఇబ్బందిని ఎదుర్కోవాలంటే ఆతిథ్య జట్టు అద్భుతం చేయాల్సిందే. ఆరంభం నుంచి పిచ్ స్లోగా ఉండటంతో పాటు తొలి రోజు ఆట ముగియగానే స్పిన్నర్లకు అనుకూలంగా మారింది. మొదటి రోజే పుజారా, రహానే శతకాలు బాది జట్టు స్కోరును దాదాపు 350కి చేర్చారు. అయితే రెండో రోజు ఆరంభంలోనే వీరిద్దరు పెవిలియన్‌కు వెళ్లాల్సి వచ్చింది. అయినా లంక బౌలర్లు తమ తప్పులను తెలుసుకోకుండా బంతులను వేయడంతో మిగిలిన బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు. అశ్విన్ తన వేగవంతమైన బ్యాటింగ్‌తో జట్టుకు సౌకర్యవంతమైన స్కోరును అందించాడు. అతడిని కట్టడి చేయడానికి లంక కెప్టెన్ చండిమాల్ విశ్వప్రయత్నమే చేశాడు. అశ్విన్ స్లాగ్ స్వీప్ షాట్లను అడ్డుకునేందుకు ఫీల్డర్లను అతడికి దగ్గరలో మోహరించి ఒత్తిడి పెంచాలని భావించాడు. ఇక లంక బ్యాట్స్‌మెన్ ఇప్పుడు చేయాల్సిందల్లా పుజారా, రహానేలను స్ఫూర్తిగా తీసుకొని... సాధ్యమైనంత ఎక్కువసేపు క్రీజులో నిలిచి భారీ భాగస్వామ్యాలు నిర్మించాలి. అప్పుడే భారత స్పిన్నర్లకు సవాల్ విసిరినట్టవుతుంది. స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ డాట్ బంతులపై ఆందోళన వదిలితే మంచిది. షార్ట్ పిచ్ బంతులను కట్ లేక పుల్ షాట్స్ ఆడుకుంటూ వెళితే లంకకు లాభం. అయితే వారికి ఇదంతా సులువు కాకపోవచ్చు.. కానీ ఆ జట్టు ఆశావహ దృక్పథంతో ముందు కెళ్లాల్సి ఉంది.

కెరీర్‌లో తొలిసారి...

ఏటీపీ-500 టోర్నీ క్వార్టర్స్‌లో యూకీ బాంబ్రీ



వాషింగ్టన్: మరో అద్భుత విజయంతో భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ సిటీ ఓపెన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 200వ ర్యాంకర్ యూకీ 6-7 (5/7), 6-3, 6-1తో ప్రపంచ 100వ ర్యాంకర్ గిడో పెల్లా (అర్జెంటీనా)పై గెలిచాడు. ఈ గెలుపుతో ఢిల్లీకి చెందిన 25 ఏళ్ల యూకీ తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ-500 పాయింట్ల టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఏటీపీ సర్క్యూట్‌లో ప్రైజ్‌మనీ, పాయింట్ల పరంగా టోర్నీలను ఐదు స్థాయిలుగా (గ్రాండ్‌స్లామ్స్ (2000 పాయింట్లు), వరల్డ్ టూర్ ఫైనల్స్ (1500 పాయింట్లు), వరల్డ్ టూర్ మాస్టర్స్ సిరీస్ (1000 పాయింట్లు), ఏటీపీ-500, ఏటీపీ-250 పాయింట్లు) విభజిస్తారు. ఇందులో సిటీ ఓపెన్ నాలుగోస్థాయి టోర్నీ. అంతేకాకుండా ఏటీపీ వరల్డ్ టూర్ ఈవెంట్ టోర్నీలో యూకీ వరుసగా మూడు విజయాలు నమోదు చేయడం... చెన్నై ఓపెన్ (2014లో) తర్వాత ఓ ఏటీపీ వరల్డ్ టూర్ టోర్నీలో యూకీ క్వార్టర్ ఫైనల్‌కు చేరడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం. పెల్లాతో రెండు గంటల తొమ్మిది నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయాక ఒక్కసారిగా విజృంభించి వరుసగా రెండు సెట్‌లు గెల్చుకున్నాడు. రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, 22వ ర్యాంకర్ గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై యూకీ సంచలన విజయం సాధించిన సంగతి విదితమే. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 45వ ర్యాంకర్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)తో యూకీ ఆడతాడు.

మరోవైపు ఇదే టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో సానియా మీర్జా (భారత్)-మోనికా నికెలెస్కూ (రొమేనియా) జంట సెమీఫైనల్‌కు చేరింది. క్వార్టర్ ఫైనల్లో సానియా-మోనికా ద్వయం 6-3, 6-2తో జేమీ లోబ్-యాష్లే వీన్‌హోల్డ్ (అమెరికా) జోడీపై గెలిచింది.

మళ్లీ ఓడిన తమిళ్ తలైవాస్

నాగ్‌పూర్: క్రికెట్ దిగ్గజం సచిన్ జట్టు తమిళ్ తలైవాస్ మళ్లీ ఓడింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో శుక్రవారం నాగ్‌పూర్ అంచె పోటీలు ప్రారంభం కాగా... జోన్-బిలో జరిగిన తొలి మ్యాచ్‌లో తలైవాస్ 31-32 స్కోరుతో బెంగళూరు బుల్స్ చేతిలో ఒక పాయింట్ తేడాతో పరాజయం చవిచూసింది. హైదరాబాద్‌లోనూ ఓడిన తమిళ జట్టుకు వరుసగా ఇది రెండో ఓటమి. అనంతరం జరిగిన జోన్ 'ఎ' మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 26-21 స్కోరుతో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించింది. *నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో దబంగ్ ఢిల్లీ... బెంగళూరు బుల్స్‌తో యూపీ యోధ తలపడతాయి. ఈ పోటీలను 'స్టార్ స్పోర్ట్స్-2' ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.*

'మా వేతనాలు కూడా పెంచండి'

న్యూఢిల్లీ: జాతీయ క్రికెట్ సెలక్షన్ కమిటీకి చెందిన సీనియర్, జూనియర్ సెలక్టర్లు తమ వేతనాలను పెంచాల్సిందిగా బీసీసీఐని కోరారు. దేశవాళీ క్రికెటర్లతో పాటు మ్యాచ్ అధికారుల వేతనాలను పెంచే ప్రయత్నంలో ఉన్నామని ఇటీవల బోర్డు పేర్కొంది. దీంతో సెలక్టర్లు తమ గురించి కూడా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సీనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు సీజన్‌కు రూ.60 లక్షలు పొందుతున్నారు. అదే జూనియర్ ప్యానెల్ సభ్యులు ఏడాదికి రూ.40 లక్షల వేతనం తీసుకుంటున్నారు.

ప్రణయ్, సౌరభ్ వర్మ ఓటమి

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు హెచ్ఎస్ ప్రణయ్, సౌరభ్ వర్మ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో ప్రణయ్ 10-21, 22-20, 21-23తో లిన్ యు సియెన్ (చైనీస్ తైపీ) చేతిలో... సౌరభ్ వర్మ 19-21, 16-21తో అన్‌సీడెడ్ లీ చెయుక్ యుయి (హాంకాంగ్) చేతిలో ఓడారు.

విజేందర్ x జుల్ఫికర్

'డబుల్' టైటిల్ కోసం నేడు అమీతుమీ



ముంబై: డబ్ల్యూబీవో 'డబుల్' టైటిల్ కోసం భారత స్టార్ ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ నేడు చైనాకు చెందిన జుల్ఫికర్ మైమైటియాలితో తలపడనున్నాడు. ఇప్పటిదాకా ఓటమి లేకుండా ఎనిమిది నాకౌట్ విజయాలతో దూసుకెళుతున్న విజేందర్ ఈ బౌట్‌పై కూడా ధీమాగా ఉన్నాడు. 'ఇది భారత్, చైనా మధ్య పోరు. దేశం మొత్తం నా వెనకాలే ఉందని తెలుసు. ఈ బౌట్‌పై నేను పూర్తి విశ్వాసంతో ఉన్నాను. కచ్చితంగా నాదే గెలుపు. పూర్తి ఫిట్‌నెస్ కోసం ఒక్క రోజులోనే రెండు కిలోలు తగ్గాను. బౌట్‌లో అతడు ఆడే విధానాన్ని బట్టి నా ప్రణాళికలు ఉంటాయి. నా టెక్నిక్ కూడా మార్చుకున్నాను' అని డబ్ల్యూబీవో ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ చాంపియన్ విజేందర్ తెలిపాడు. జుల్ఫికర్ ప్రస్తుతం డబ్ల్యూబీవో ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్ విజేతగా ఉండగా నేటి బౌట్‌లో గెలిచిన విజేతకు ప్రత్యర్థి టైటిల్ కూడా దక్కుతుంది.

రాత్రి గం. 7.00 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం

వజ్ర బస్సులకు యాప్ బుకింగ్‌పై
రూ.25 రాయితీ

ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు

సాక్షి, హైదరాబాద్: వజ్ర బస్సుల్లో ప్రయాణానికి మొబైల్ యాప్ ద్వారా టికెట్‌లు బుక్ చేసుకునే ప్రయాణికులకు రూ.25 రాయితీ లభించనుంది. తొలి నాలుగు బుకింగ్‌లకు ఇది వర్తిస్తుంది. నేటి (5వ తేదీ) నుంచే ఈ రాయితీ లభించనున్నట్లు ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు తెలిపారు. ఆర్టీసీలో నగదు రహిత సేవలను పెంపొందించేందుకు ఈ ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని కూకట్‌పల్లి, మెహిదీపట్నం, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లోని కాలనీల నుంచి వరంగల్, నిజామాబాద్‌లకు వజ్ర మినీ ఏసీ బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. మే నెలలో ప్రవేశపెట్టిన ఈ బస్సులు ఆశించిన స్థాయిలో ప్రయాణికుల ఆదరణకు నోచుకోకపోవడంతో ఇప్పటికే అనేక రకాల మినహాయింపులను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. క్యాబ్ తరహాలో నగరంలోని సుమారు 600 కాలనీలకు సదుపాయం లభించే విధంగా వీటిని ఏర్పాటు చేశారు. తొలిసారి యాప్ బుకింగ్‌లను ప్రవేశపెట్టినా ప్రయాణికులు ఆ సేవలను పెద్దగా వినియోగించుకోలేదు. దీంతో గ్రౌండ్ బుకింగ్‌లకు అవకాశం కల్పించారు. తాజాగా యాప్ బుకింగ్‌లలో మొదటి నాలుగు ప్రయాణాలకు రూ.25 చొప్పున రాయితీని ప్రవేశపెట్టారు. త్వరలో డ్రైవర్ వద్దనే నగదు చెల్లించి టికెట్ తీసుకొనే పద్ధతిని అందుబాటులోకి తేనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

జీఎస్టీతో ప్రభుత్వ పనులపై భారం

లోక్‌సభలో టీఆర్ఎస్ ఆందోళన
జీఎస్టీ కౌన్సిల్‌కు వివరిస్తానన్న కేంద్ర ఆర్థిక మంత్రి

సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీ అమలు కారణంగా ప్రభుత్వ అభివృద్ధి పనులపై పెను భారం పడుతోందని టీఆర్ఎస్ ఆందోళన వ్యక్తంచేసింది. వివిధ పనులపై రూ.19,200 కోట్ల మేర భారం పడుతోందని పేర్కొంది. ఈ అంశంపై శుక్రవారం లోక్‌సభలో వాయిదా తీర్మానానికి టీఆర్ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి నోటీసు ఇవ్వగా సభాపతి సుమిత్రా మహాజన్ తిరస్కరించారు. సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఎస్టీ ప్రభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. 'ఇది చాలా ముఖ్యమైన అంశం. ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలు, మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. తదితర పథకాలపై జీఎస్టీ అమలు చేయరాదు. ఈ పథకాలన్నింటికీ పాత పన్ను పద్ధతిలో బడ్జెట్ కేటాయింపులు జరిపాం. జీఎస్టీ కారణంగా పడే భారం ఈ ప్రాజెక్టుల పురోగతిపై పడుతుంది. 18 శాతం జీఎస్టీ అమలు చేస్తే దాదాపు రూ.19,200 కోట్ల అదనపు భారం రాష్ట్రంపై పడుతుంది. మా సీఎం ఇదివరకే ప్రధానికి దీనిపై లేఖ రాశారు. జీఎస్టీ కౌన్సిల్‌లో ఇదివరకే దీన్ని లేవనెత్తాం. 5 శాతం పన్ను నుంచి 18 శాతం జీఎస్టీకి తీసుకెళితే భరించలేం. బడ్జెట్ కేటాయింపులను తిరిగి పెంచాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాలు, పథకాలు పేదల కోసం చేపట్టినవి. అందువల్ల అమలులో ఉన్న ప్రాజెక్టులపై 18 శాతం జీఎస్టీ వేయడం న్యాయం కాదు. రూ.లక్ష కోట్ల ప్రాజెక్టులు ఇవి. అన్నీ ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది' అని పేర్కొన్నారు. దీనికి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధానం ఇస్తూ ఈ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కాగా, అరుణ్ జైట్లీతో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. ప్రభుత్వ పథకాలపై జీఎస్టీ అమలుతో అవి తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని వివరించారు.





సిట్ కస్టడీకి కమింగ

మూడు రోజులపాటు ప్రశ్నించనున్న అధికారులు
డ్రగ్స్ దందాలో టెక్కీల సంగతి తేల్చడంపైనే దృష్టి

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి డ్రగ్స్ తెప్పించి సరఫరా చేసినట్లుగా ఆరోపణలున్న నెదర్లాండ్స్ ఐటీ నిపుణుడు మైక్ కమింగను సిట్ అధికారులు మూడు రోజుల పాటు ప్రశ్నించనున్నారు. డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారిగా కమింగ ఉన్నాడని, అతడి నుంచి చాలా సమాచారం సేకరించాల్సి ఉందని సిట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరింది. దీనికి అనుమతించిన మియాపూర్ కోర్టు.. శుక్రవారం నుంచి మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

సాఫ్ట్‌వేర్ లింకు అంతా?

మైక్ కమింగ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలర్ నిపుణుడిగా పేరుపొందాడు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రముఖ నగరాల్లో ఉన్న ఐటీ కంపెనీల్లో సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణేలలో కార్యాలయాలు కూడా ఉన్నాయి. దీంతో కమింగకు భారీ స్థాయిలో నెట్‌వర్క్ ఉందని.. వృత్తిని అడ్డుగా పెట్టుకుని డ్రగ్స్ దందా చేశాడని సిట్ అనుమానిస్తోంది. కమింగ ఫోన్‌లో 2 వేలకు పైగా టెక్కీల ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాటింగ్‌లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వాస్తవానికి సినీ ప్రముఖుల విచారణ సమయంలోనే ఆరుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను ప్రశ్నించిన సిట్.. మైక్ కమింగను అరెస్ట్ చేసింది. అతడి నుంచి 2.8 డీఎంటీ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఐటీ ఉద్యోగులకు డ్రగ్స్ అలవాటు చేసినట్లుగా పలు ఆధారాలు కూడా సంపాదించింది. తాజాగా కస్టడీలో లోతుగా ప్రశ్నించి డ్రగ్స్‌లింకును పూర్తి స్థాయిలో ఛేదించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నమే చంచల్‌గూడ జైలు నుంచి కమింగను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు.





Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792